జనవరి
2023

సంపుటి :18 సంచిక : 8

201

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

వేద వాంగ్మయ పరిచయం
ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు: సిపిఐ(ఎం) వైఖరి
రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి
వాయవ్య భారతంలో గ్రీకుల పాలన - ప్రభావం
దళిత ఉద్యమం: కామ్రేడ్ ఆర్‌బి మోరే కృషి
విస్తరిస్తున్న ఆర్థికమాంద్యం
ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా : జాతిని హైందవీకరించి, హిందువులను సైనికీకరించడం
ఒడిదుడుకులనదిగమిస్తూ సోషలిస్టు పంథాలో ముందుకు
సాఫ్ట్‌వేర్ రంగం కూడా మాంద్యం నుండి తప్పించుకోలేదు

# వేద వాఙ్మయ పరిచయం



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

**పిబి చారి**

వేదాలు నాలుగు. అవి: ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వ వేదం. ఋగ్వేదంలో రుక్కు అంటే స్తుతించటం అని అర్థం. వేద అన్నది విద్ అన్న ధాతువు నుంచి వచ్చింది. వేదము అంటే తెలుసుకోవటం. దేనిని తెలుసుకోవటం? జ్ఞానం గురించి తెలుసుకోవడం. ఈ వేదాలలోని ప్రధాన భాగాలు సూక్తాలు, మంత్రాలు. వీటినే సంహితలు అంటారు. ప్రతి సంహితకు అనుబంధంగా బ్రాహ్మణాలు ఉంటాయి. బ్రాహ్మణాలులో బ్రహ్మ అంటే మంత్రము, యజ్ఞము అన్న అర్థాలు ఉన్నాయి. సంహితలకు అర్థాలు తెలిపేవే ఈ బ్రాహ్మణాలు. ప్రతి బ్రాహ్మణం అరణ్యకాలు, ఉపనిషత్తులతో కూడి ఉంటుంది. అరణ్యకాలు అడవుల్లో ఉండే వానప్రస్తుల కోసం. వీటిలో నిగూఢధర్మ సూత్రాలు ఉంటాయి. ఉపనిషత్తులు తాత్త్విక అంశాలతో కూడి ఉంటాయి.

**రుగ్వేదం**

రుగ్వేదంలోని సంస్కృత భాష చాలా పురాతనమైనది. ఇది సంస్కృతం యొక్క ప్రారంభ రూపం. క్రీస్తుకు పూర్వం పదిహేను వందల సంవత్సరాల నుండి 1000 సంవత్సరాల మధ్య కాలంలో ఋగ్వేద కూర్పు, సంశ్లేషణ జరిగిందని పురావస్తు శాస్త్ర సహాయంతో చరిత్రకారులు నిర్ధారించారు. ఋగ్వేదంలో ఇనుముకు సంబంధించిన ప్రస్తావన లేదు. క్రీస్తుకు పూర్వం వెయ్యి సంవత్సరాల తర్వాతనే ఉత్తర భారతంలో ఇనుము వినియోగంలోకి వచ్చింది. రుగ్వేదంలో పది మండలాలు లేదా పది చాప్టర్లు ఉంటాయి. 1028 సూక్తాలు, 10, 414 రుక్కులు ఉన్నాయి. 1,53,826 శబ్దాలు, 4,32,000 అక్షరాలు ఉన్న ఉద్గ్రంథం ఋగ్వేదం.

**సామవేదం**

సామవేదం మూడు రకాల పరిష్కృత పాఠాల్లో అంటే సంహితలలో లభిస్తుంది. వీటిలో కౌ ధూమ శాఖను అత్యంత ప్రామాణికమైనదిగా భావిస్తారు. సోమపానం, సోమయాగం లాంటి యజ్ఞ నిర్వహణ సమయంలో గానం చేసే మంత్రాలు ఉన్నాయి. మంత్రాలను ఎలా గానం చేయాలి స్వరం, శ్రావ్యత ఎలా ఉండాలి, అంటే సంగీత స్వరకల్పనను దృష్టిలో పెట్టుకొని ఋగ్వేదం నుండి సామవేదాన్ని వేరు చేశారు. భారతీయ సంగీత చరిత్రలో మొదటి గ్రంథంగా దీనికి ప్రాముఖ్యత ఉన్నది. కానీ ఇందులో చరిత్ర అంశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. సామవేదంలో 75 మంత్రాలను మినహాయిస్తే మిగిలినవన్నీ ఋగ్వేదంలో నుండి స్వీకరించినవే. సామవేదంలో 2,814 మంత్రాలు ఉన్నాయి. ఈ సామగాన సంకలనం, ఈ వేదం క్రీస్తుపూర్వం వెయ్యి సంవత్సరాల తర్వాతనే కూర్చబడింది.

**యజుర్వేదం**

యజుర్వేదం యజ్ఞయాగాదులకు, కర్మకాండలకు సంబంధించిన మంత్రాల సంకలనం. సామవేదం లాగానే ఋగ్వేదం లోని అనేక రుక్కులను యజుర్వేదం స్వీకరించింది. మారుతున్న కాలాన్ని బట్టి కొత్త మంత్రాలు కొన్ని కలిపి యజ్ఞాలలో ఉపయోగపడే దానికి ఒక సంహితను తయారు చేశారు. దర్శనపూర్వ మాస, అగ్నిష్టోమ, వాజపేయ, రాజసూయ, సౌత్రామణి, అశ్వమేధ, పిత్రు మేధ, మొదలైన రకరకాల యజ్ఞాలలో పలికె మంత్రాల సంకలనమే యజుర్వేదం. ఈ యజుర్వేదం రెండు భాగాలు. ఒకటి కృష్ణ యజుర్వేదం, మరొకటి శుక్ల యజుర్వేదం. కృష్ణ యజుర్వేదం నాలుగు రకాల సంహితగా ఉనికిలో ఉన్నది. ఈ సంహితలలో తైత్తరీయ సంహిత ప్రముఖమైనదిగా భావిస్తారు. శుక్ల యజుర్వేదం వాజసనేయ సంహితగా మాత్రమే నిలిచి ఉన్నది. వాజసనేయ సంహితలో 40 అధ్యాయాలు, 1988 ఖండికలు, లేదా మంత్రాలు ఉన్నాయి. ఇది గజ్జ పద్య మిశ్రతమం. కృష్ణ యజుర్వేదం శుక్ల యజుర్వేదం కన్నా పురాతనమైనది. కృష్ణ యజుర్వేదం, మైత్రాయణి సంహిత 18-13 ఇనుముకు సంబంధించిన (శ్యామ) ప్రస్తావన ఉన్నది. అందువల్ల ఇది క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాల తర్వాతదే అని అర్థం అవుతున్నది.

**అధర్వ వేదం**

అధర్వ వేదంలో శౌనక సంప్రదాయం ప్రకారం 20 అధ్యాయాలు, 731 సూక్తాలు ఉన్నాయి. ఈ వేదం కూడా ఋగ్వేదం నుండి అనేక సూక్తాలు చర్విత చరణం అవుతాయి. ఋగ్వేద చివరి పదవ మండలంలోని సూక్తాలులో సగ భాగం పైనే ఈ వేదం స్వీకరించింది. అంటే ఋగ్వేదాన్ని పూర్తిగా కూర్చిన అనంతరమే అధర్వ వేద కూర్పు జరిగింది. ఈ వేదంలో (3:3.1.7) లో ఇనుముకు సంబంధించిన ప్రస్తావన ఉండటాన్ని బట్టి అధర్వ వేదం క్రీస్తు పూర్వం 1000 సంవత్సరాలకు చెందినదిగా భావిస్తున్నారు. ఈ వేదం చెడును, వ్యాధులను దూరం చేసుకోవడానికి పనికి వచ్చే వివిధ తాత్త్విక ప్రక్రియలకు సంబంధించిన మంత్రాల సంకలనం. అనార్య నమ్మకాలను ఆచారాలను కూడా ఇది చర్చిస్తుంది. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం ఈ మూడింటినీ వేదత్రయ అంటారు. బుద్ధుని కాలం దాకా అంటే క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దం వరకు వేదాలు మూడే అన్నారు. అధర్వణ వేదం చాలా కాలం తర్వాత గాని వేదంగా గుర్తించబడలేదు.

**బ్రాహ్మణాలు**

వేద సంహితల లోని మంత్రాలకు అర్థాలు వివరించే వాటిని బ్రాహ్మణాలు అంటారు. ఈ బ్రాహ్మణాలు సంహితలకు అనుబంధంగా ఉంటాయి. ఐతరేయ, కౌషితకి, లేక సాంఖ్యాయన బ్రాహ్మణాలు ఋగ్వేదానికి అనుబంధాలు. సామ వేదానికి జైమినీయ, పంచవింశతి బ్రాహ్మణములు అనుబంధములు. కృష్ణ యజుర్వేదానికి తైత్తరీయ బ్రాహ్మణాలు, శుక్ల యజుర్వేదానికి శతపథ బ్రాహ్మణం అనుబంధంగా ఉంటుంది. ఇవి ఆయా వేద సంహిత అర్థాలను వివరిస్తాయి. ఈ బ్రాహ్మణాలు క్రీస్తుపూర్వం 900 నుండి 700 వందల సంవత్సరాల కాలానికి చెందినవిగా నిర్ధారించారు.

**(మిగతా 35వ పేజీలో)**

## ఈ సంచికలో...

1. వేద వాఙ్మయ పరిచయం
పిబి చారి......2
2. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు: సిపిఐ(ఎం) వైఖరి
బివి రాఘవులు........4
3. రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి
ఎంబి రాజేష్...........9
4. వాయవ్య భారతంలో గ్రీకుల పాలన - ప్రభావం
ఎంవిఎస్ శర్మ........14
5. దళిత ఉద్యమం: కామ్రేడ్ ఆర్‌బి మోరే కృషి
కెకె తెకెదత్........16
6. విస్తరిస్తున్న ఆర్థికమాంద్యం
ఎ కోటిరెడ్డి.........22
7. ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా : జాతిని హైందవీకరించి, హిందువులను సైనికీకరించడం
సుభాష్ గటాడే........24
8. ఒడిదుడుకుల నడిగమిస్తూ సోషలిస్టు పంథాలో ముందుకు
ఆర్ అరుణ్ కుమార్........29
9. సాఫ్ట్‌వేర్ రంగం కూడా మాంద్యం నుండి తప్పించుకోలేదు
బివి రాఘవులు.......33



సంపాదకుడు:
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# పెనంమీద నుండి పొయ్యిలోకి

**2022** నుండి ప్రపంచం 2023లోకి అడుగిడుతున్న వేళ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అందులో భాగంగా భారత దేశ ఆర్థిక వ్యవస్థ పెనంమీద నుండి పొయ్యిలోకి పడినట్లు ఒక సంక్షోభం నుండి మరింత లోతైన సంక్షోభంలోకి వెళ్లిపోతున్న దాఖలాలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2008 సబ్ ప్రైమ్ సంక్షోభం మొదలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కింది చూపులేగానీ పైకి చూసిన ఆనవాళ్లే లేవు.

2021లో 6 శాతం ఉన్న ప్రపంచ ఆర్థికాభివృద్ధి ఈ ఏడాది 3.2 శాతానికి పడిపోయినట్లు ఐఎంఎఫ్ తెలిపింది. 2023లో ఇది మరింతగా దిగజారి 2.7 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. సంపన్న దేశాల ఆర్థికాభివృద్ధి కూడా 2022లో 2.4 శాతం నుండి 2023లో 1.1 శాతానికి పడిపోతుందని అంచనా. ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నదనీ, దానివల్ల కరోనా మహమ్మారికన్నా ఘోరమైన నష్టం జరుగుతుందనీ ఐక్యరాజ్య సమితి 2022 అక్టోబర్ 3న హెచ్చరించింది.

భారత ఆర్థిక వ్యవస్థ కూడా సంక్షోభంలోకి నెట్టబడుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రపంచం ఎలా ఉన్నా భారత్ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందనీ, 2008 ఆర్థిక సంక్షోభం తరువాత ప్రపంచానికి చైనా ఆశాకిరణంలా ఉన్నట్టే ఇప్పుడు మన దేశ ఆర్థిక పరిస్థితి ఉంటుందని బాకాలూదిన కార్పొరేట్ మీడియా నోళ్లకు ఈ తాజా ఆర్థిక గణాంకాలు తాళాలు వేసే విధంగా ఉన్నాయి. గత ఏడాది భారత దేశం అనుకున్నంత అభివృద్ధి సాధించలేదు. 2023లో అంచనాలను ఇటీవలి కాలంలో అంతర్జాతీయ ఏజెన్సీలన్నీ తగ్గిస్తూ వస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు తొలుత 8.7 శాతం అభివృద్ధి ఉంటుందని అంచనా వేయగా, ఏప్రిల్‌లో 7 శాతానికీ, అక్టోబర్‌లో 6.5 శాతానికీ అంచనాలు తగ్గించింది. అంతకన్నా తక్కువగా 4.7 శాతం మాత్రమే ఉంటుందని అంక్టాడ్ అంచనా వేసింది. 2022లో పారిశ్రామికోత్పత్తి గణనీయంగా తగ్గింది. రూపాయి విలువ డాలరుతో పోలిస్తే రూ. 74.21 నుండి రూ 82.61 కి చేరి 11 శాతం క్షీణించింది. విదేశీ మారక నిల్వలు 63,500 కోట్ల డాలర్ల నుండి 56,300 కోట్ల డాలర్లకు దిగజారిపోయాయి.

మొత్తం మీద 2023లో ప్రపంచంలోనూ, భారత దేశంలోనూ ఆర్థిక సంక్షోభం మరింత భయంకరంగా ఉంటుందని ఆర్థిక నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

కరోనా వల్ల ఈ సంక్షోభం వచ్చిందని కొన్నాళ్లుగా చెబుతూ వస్తున్నారు. అంతకు ముందు అనేక దేశాల్లో ఆర్థిక మాంద్యం ఛాయలు కనిపిస్తున్నాయన్నారు. ట్రంప్ హయాంలో అమెరికా ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వల్ల ప్రపంచ వాణిజ్యంలో మాంద్యం నెలకొన్నదని చెప్పారు. కరోనా కనుమరుగైన తరువాత అమెరికా ప్రేరేపిత ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఇంధనం, ఆహారం కొరత ఏర్పడి సంక్షోభం వచ్చిందని చెబుతున్నారు. మొత్తం మీద పదిమంది గుడ్డి వాళ్లు ఏనుగును వర్ణించినట్లు పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు ఆర్థిక సంక్షోభానికి అనేక కారణాలు చెబుతూ వస్తున్నారు. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏర్పడిన సర్వసాధారణ సంక్షోభమే దీనికి కారణమన్న విషయాన్ని అందరూ కలిసి కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. 2008లో వచ్చిన సబ్‌ప్రైమ్ సంక్షోభం తరువాత పెట్టుబడిదారీ సంక్షోభం వ్యవస్థాగత సంక్షోభంలోకి జారిపోయిందని అనేక మంది ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. వ్యస్థాగత సంక్షోభానికి పరిష్కారం వ్యవస్థకు సమూలంగా చికిత్స చేయడంలోనే ఉంటుంది. అందువల్ల మార్క్సిస్టు మహోపాధ్యాయులు దర్శించినట్లు వ్యవస్థలో మౌలిక పరివర్తన తేవడం ద్వారా మాత్రమే సంక్షోభాన్ని శాశ్వతంగా పరిష్కరించడం సాధ్య మవుతుంది.

ప్రపంచ వ్యాపితంగానూ మన దేశంలోనూ పాలక వర్గాలు సంక్షోభ భారాన్ని అనేక రూపాల్లో కార్మికవర్గం, శ్రామిక ప్రజానీకం మీదికి నెట్టేస్తున్నారు. అందువల్లనే ఇంతటి సంక్షోభ పరిస్థితుల్లో కూడా ప్రపంచ వ్యాపితంగానూ, మన దేశంలోనూ కుబేరులు పెరుగుతున్నారు. వారి ఆస్తులు ఇంతకింతలు పెరుగుతున్నాయి. మరోవైపు సమాన్య ప్రజల జీవనం రోజురోజుకూ క్షీణిస్తోంది. వారిలో అసంతృప్తి పెరుగుతోంది. ప్రజల ఈ అసంతృప్తి అనేక దేశాల్లో పెరుగుతున్న శ్రామిక ప్రజల పోరాటాల్లోనూ, కొన్ని దేశాల్లో ముఖ్యంగా లాటిన్ అమెరికాలో వామపక్ష, అభ్యుదయ గాముక ప్రభుత్వాలను ఎన్నుకోవడంలోనూ ప్రతిబింబిస్తోంది. అయితే ఇప్పటికీ ఈ పోరాటాలు తమ హక్కులపై జరుగుతున్న దాడి నుండి రక్షించుకునే స్థితిలోనే ఉన్నాయి. కార్మికవర్గం, ఇతర శ్రామిక ప్రజలు సంక్షోభ భారం నుండి బయటపడాలంటే పాలకవర్గాలపై ఎదురుదాడి పోరాటాల్లోకి దిగాలి. వ్యవస్థను సమూలంగా మార్చే విప్లవ పోరాటాలు వర్ధిల్లాలి. సంక్షోభం ముదురుతున్న కొద్దీ పోరాటాల వెల్లువ పెరుగుతుంది. ఆ పోరాటాలను విప్లవాలవైపు నడిపించేందుకు విప్లవ శక్తులు సన్నద్ధం కావాలి.

# ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు: సిపిఐ(ఎం) వైఖరి



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

**బి.వి.రాఘవులు**

ఆర్థికంగా వెనకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించడం కోసం 2019లో పార్లమెంటు 103వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చింది. ఈ రాజ్యాంగ సవరణకు ఆ రోజు పార్లమెంటులో డిఎంకె, ఆప్ మినహా అన్ని పార్టీలూ సమర్థించాయి. డిఎంకె, ఆప్‌లు ఆ రోజు పార్లమెంటులో వాకౌవుట్ చేశాయి. అలాగే ఆర్‌జెడి కూడా దానిని సమర్థించలేదు కాని వారు వాకౌవుట్ చేయలేదు. పార్లమెంటులోని మిగతా అన్ని పార్టీలు ఈ సవరణను సమర్థించాయి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్‌కు ఎవరు అర్హులు అనే అంశపైన కొన్ని కొలబద్దలు ప్రతిపాధిస్తూ నిబంధనలు తయారు చేసింది. ఆ రూల్స్‌ని సిపిఎం తీవ్రంగా విమర్శించింది. ఎందుకంటే, ఎనిమిది లక్షల రూపాయల ఆదాయం, ఐదు ఎకరాల భూమి, వెయ్యి గజాల స్థలం.... ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు పరిమితిగా విధించారు. అంతకు మించిన వారికి ఈ రిజర్వేషన్లు వర్తించవు అనేది దీని సారాంశం. దానిని సిపిఎం వ్యతిరేకించడానికి కారణాలు: మొదటిది, ఎనిమిది లక్షలు, ఐదు ఎకరాలు పరిధి పెడితే దాదాపు 103వ రాజ్యాంగ ఉద్దేశం నెరవేరదు. ఎందుకేంటే, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి, అంటే పేదవారికి రిజర్వేషన్లు కల్పించాలని ఉద్దేశం అయినప్పుడు ఈ కొలబద్దలు దాదాపు పేదలు, ధనికులు అనే తేడా లేకుండా అత్యధికులకు వర్తిస్తాయి. ఆ రకంగా రిజర్వేషన్లు అనుభవించేందుకు అందరికీ అవకాశం వస్తుంది. జనాభాలో 5 లేదా 6 శాతం తప్ప మిగతావారందరూ ఈ కొలబద్దలోకి వస్తారు. అందుకని ఈడబ్ల్యుఎస్ వల్ల పేద వర్గాలకు అన్యాయం జరుగుతుందని సిపిఎం తీవ్రంగా విమర్శించింది. ఆ ఆర్థిక కొలబద్దని తగ్గించాలని డిమాండ్ చేసింది. అంతే కాదు, ఇంతకముందు వెనకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించేటప్పుడు క్రీమీ లేయర్ భావన ముందుకు వచ్చింది. అప్పుడు సిపిఎం ఇలానే చెప్పింది. కారణం ఏదైనప్పటికీ ఓబిసీలకు క్రీమీ లేయర్ సీలింగ్ పరిమితంగానే పెట్టారు. అది పేద ఓబిజీలకు లాభం చేసే పద్ధతిలో వచ్చింది. కానీ ఈడబ్ల్యుఎస్‌కి వచ్చేసరికి ఆ కొలబద్ద చాలా ఎక్కువగా నిర్ణయిండం ద్వారా ద్వంద ప్రమాణం అచరించారు. అందుకనే దీనికి తీవ్రమైన అభ్యంతరం తెలిపాం. మొత్తంగా 103వ రాజ్యంగ సవరణ అంశాలు అన్నిటిపైనా కోర్టులో రకరకాల పిటీషన్లు వేశారు. ఆర్థిక కొలబద్ద పెట్టడం వంటివి రాజ్యంగ విరుద్ధమనీ, రిజర్వేషన్లకు నష్టమనీ, వీటికి పెట్టిన ఆదాయం పరిమితి చాలా భారీగా ఉంది గనుక దానివల్ల పేదలకు తీవ్రమైన నష్టం జరుగుతుందనీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఉల్లంగిస్తుందని సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు భంగం కలిగిస్తుందనీ ఇలా రకారకాల అంశాలతో పిటీషన్లు వేశారు.

ఈ పిటీషన్లన్నింటినీ సుప్రీం కోర్టు ఒక దగ్గర తెచ్చి వాటన్నింటిపై విచారణ చేసి అయిదుగురు సభ్యుల ధర్మాశనం ఒక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ఏకగ్రీవంగా ఉండి ఉంటే దాని ప్రతిష్ట, ఆమోదయోగ్యత ఒక రకంగా ఉండి ఉండవచ్చు. కానీ ముగ్గరు జడ్జిలు ఒకవైపు ఇద్దరు జడ్డిలు ఒకవైపు తీర్పు ఇచ్చారు. ఆ ఇద్దరి జడ్జీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి కూడా ఉన్నారు. సుప్రీం కోర్టు 103వ రాజ్యంగ సవరణ చట్టబద్ధం కాబట్టి దాన్ని అమలు పరచవచ్చు అని మెజార్టీ అభిప్రాయంగా తీర్పు ఇచ్చింది. ఇద్దరు మాత్రం ఈ ఆర్థిక కొలబద్ద ప్రాతి పదికమీద రిజర్వేషన్లు ఇవ్వగలిగే అకాశం ఉన్నా అది న్యాయబద్ధమే అయినా ఇతర కారణాల రీత్యా ఈ 103వ రాజ్యంగ సవరణ చెల్లదు అని చెప్పారు. ఇది సమానత్వానికి విఘాతం కలిగిస్తుందని ఇద్దరు న్యాయమూర్తుల్లో ఒకరు చెప్పారు. మొత్తం మీద ముగ్గురు సమ్మతిస్తే ఇద్దరు మాత్రం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ తీర్పు వెలువడిన తర్వాత సహజంగానే దానిపైన అనేక రకాల అభిప్రాయాలు వెల్లడయ్యాయి. సానుకూలమైన అభిప్రాయాలు, ప్రతికూలమైన అభిప్రాయాలు వచ్చాయి. 103వ రాజ్యాంగ సవరణను సమర్థించిన పార్టీలు, వ్యక్తులు, సంస్థలు అలాగే ఆ రోజు వ్యతిరేకించిన పార్టీలు అంత ఉదృతంగా ముందుకు రాకపోయినా తమిళనాడులో ఈ రోజు అధికారంలో ఉన్న డిఎంకె మాత్రం తమ రాష్ట్రంలో ఈ తీర్పు సామాజిక న్యాయానికి భంగం కలిగిస్తుందని, కాబట్టి దీనిపైన పిటీషన్ వేస్తామని ప్రకటించింది. ప్రకటించడంతో పాటుగా చెన్నైలో అన్నీ పార్టీలతో సమావేశం నిర్వహించింది. ఈ తీర్పుకు తమిళనాడులో రాజకీయ వ్యతిరేకత చోటు చేసుకుంది. సిపిఎం అందులో పాల్గొని తమ వైఖరిని అక్కడ కూడా తెలిపింది.

తీర్పు వెలువడిన వెంటనే సిపిఎం ఒక ప్రకటన చేస్తూ, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు తమ పార్టీ వ్యతిరేకం కాకపోయినా సుప్రీం కోర్టు ఇచ్చిన విభజన తీర్పు తీవ్రమైన సమస్యల్ని సృష్టిస్తుందనీ, వాటిని పరాష్కారం చేసుకునే

> ❝ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించే రాజ్యంగ సవరణ అనేదే రాజ్యంగ విరుద్ధం అని ఒక వాదన. ఆర్థికంగా వెనుకబాటు తనానికి రిజర్వేషన్లు ఇవ్వకూడదని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదు. రాజ్యాంగం చెప్పిందేంటంటే, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమానత్వాన్ని సాధించాలని. ఈ రిజర్వేషన్ సమానత్వం సాధించే ప్రాతిపదిక కిందకు వస్తుంది. కాబట్టి రాజ్యాంగం కేవలం సామాజిక వెనుకబాటుతనం గురించే చెప్పిందని అనడం సరైంది కాదని చెప్పి కోర్టు ఈ వాదనను తిరస్కరించింది.❞

అవసరమైన చర్యలు, ఆలోచనలు చేయాలని చెప్పింది. అందులో ముఖ్యంగా ఇడబ్ల్యూఎస్‌కి పెట్టిన ఆర్థిక పరిమితి అశాస్త్రీయంగా ఉందనీ, పేదలకు నష్టదాయకంగా ఉందనీ అవసరమైతే దానిని పూర్తిగా మార్చేందుకు అవసరమైన నిర్ణయాలు చేయాలనీ సిపిఎం ప్రకటలో ప్రేర్కొన్నది. ఆ రకంగా ఇడబ్ల్యూఎస రిజర్వేషన్లను సమర్థిస్తూనే ఈ విభజన తీర్పు సృష్టించిన సమస్య తీవ్రతని పట్ల, ఒక హెచ్చరిక, ఒక ఆందోళనను సిపిఎం వ్యక్తం చేసింది.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపైన రకరాల వాదనలు చర్చల్లోకి వచ్చాయి. అంగీకరించిన వారిని పక్కన పెడితే, వీటిని వ్యతికేరించేవారు రకరకాలుగా వాదనలు ముందుకు తీసుకువచ్చారు. ఈ వివాదాలు ఏమిటో మనం తెలుసుకోవాలి.

### రాజ్యాంగ విరుద్ధమా?

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించే రాజ్యంగ సవరణ అనేదే రాజ్యంగ విరుద్ధం అని ఒక వాదన. సుప్రీంకోర్టు ఇది రాజ్యాంగ బద్ధమే అని చెప్పింది. ఆర్థికంగా వెనుకబాటుతనానికి రిజర్వేషన్లు ఇవ్వకూడదని రాజ్యాంగం ఎక్కడా చెప్పలేదు. రాజ్యాంగం చెప్పిందేంటంటే, సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమానత్వాన్ని సాధించాలని. కాబట్టి ఈ రిజర్వేషన్ సమానత్వం సాధించే ప్రాతిపదిక కిందకు వస్తుంది. కాబట్టి రాజ్యాంగం కేవలం సామాజిక వెనుకబాటుతనం గురించే చెప్పిందని అనడం సరైంది కాదని చెప్పి కోర్టు ఈ వాదనను తిరస్కరించింది. ఆర్థిక అసమానతలు అధిగమించేందుకు రిజర్వేషన్లు కూడా ఒక మార్గం అని కోర్టు చెబుతూ దనిపై నిర్ణయం తీసుకొనే హక్కును ప్రభుత్వానికి రాజ్యాంగం ఇచ్చిందని పేర్కొంది. ఆ విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించ వీలులేదని సుప్రీం కోర్టు మెజారిటీ సభ్యులు చెప్పారు. ఇంకొకటి ఏంటంటే, ఇడబ్ల్యూఎస్ రజర్వేషన్లు, 103వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ విరుద్ధం అంటున్నారు. ఇప్పటికే.. ఈ సవరణ రాజ్యాంగంలో అంతర్భాగం అయింది. దీనిని కాదని చెప్పడానికి వీల్లేదు, రాజ్యాంగ మౌళిక అంశాలకు ఇది భిన్నంగా ఉందా లేదా అని మాత్రమే వాదించాలి అని పేర్కొంది.

### ఆర్థిక ప్రాతిపదిక అసలు అక్కర లేదా?

మరొక ముఖ్యమైన వాదన ఇలా సాగుతుంది: రిజర్వేషన్లు అనేవి సామాజిక వెనుకబాటు తనాన్ని నిర్మూలించడానికి ఉద్దేశించినవి. భారతదేశంలో చారిత్రకంగా కుల వ్యవస్థ నెలకొని ఉంది. కొన్ని కులాల వారు సామాజిక వివక్షతకు గురయ్యారు. కాబట్టి, వారికి సమాజంలో పోటీలో నిలబడగలిగే అవకాశాలు మృగ్యమయ్యాయి. దానిని దృష్టిలో పెట్టుకొని ఈ రిజర్వేషన్లు కల్పించారు. ఆ రకంగా ఆర్థిక వెనుకబాటుతనం కూడా ముఖ్యమైన విషయమే. కానీ, దానిని అధిగమించడానికి రిజర్వేషన్ల అవసరమేమీ లేదు. వారికి దారిద్ర్య నిర్మూనా పథకాల్ని, ప్రత్యేక సౌకర్యాల్ని కల్పించవచ్చు. కాబట్టి, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇవ్వవల్సిన అవసరం లేదని వారి వాదన. ఈ వాదన కూడా సరైంది కాదని కోర్టు చెప్పింది. ఎందుకంటే, ఒకటి రిజర్వేషన్ల వల్లే ఏ సమూహం ముందు పోవటం లేదు, అలాగే ఆర్థిక పథకాలు ఇచ్చినంత మాత్రాన అవి సరిపోవడం లేదు. అందువల్ల రిజర్వేషన్లతోపాటు సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు రెంటినీ మేళవించి అమలు చేయడం ముఖ్యమే అని తీర్పు పేర్కొన్నది.

### రిజర్వేషన్ స్వభావం ఏమిటి?

మరో ముఖ్యమైన వాదన..రిజర్వేషన్ స్వభావం ఏంటి అనేదానిమీద సాగుతోంది. రిజర్వేషన్ అనేది ఆర్థిక వెనకబాటు నుండి గానీ, సామాజిక వెనకబాటు నుండి గానీ బయటపడేసే సాధనమా? అనే చర్చ కోర్టులో జరిగింది. ఒక్క సామాజిక వెనుకబాటు తనం ఉన్న వారికి రిజర్వేషన్లు ఉండాలి. మిగతావారికి అక్కరలేదు అన్న వాదన సరైంది కాదని కోర్టు చెప్పింది. సామాజిక వెనుకబాటునుండి బయటపడేయడానికి మినహా మిగతావాటికి రిజర్వేషన్లు సాధనం కాదని రాజ్యాంగం భావించడం లేదని కోర్టు చెబుతోంది. అయితే సామాజిక వెనుకబాటు తనం అనేది ఒక ముఖ్యమైన అంశం అని మనం భావిస్తున్నాం. దానర్థం మిగతా కొలబద్దలన్నిటినీ విస్మరించాలని, వాటిని వేరు చేయాలని మన ఉద్దేశం కాదు. సామాజిక, ఆర్థిక వెనుకబాటు తనాలకు మధ్య లంకె ఉంది. అలా లేదని చెప్పడం తప్పు. ఈ రోజు వాస్తవంగా భారతదేశంలో కుల వ్యవస్థ ఇంత బలంగా వేళ్లునూరుకొని కొనసాగడానికి పాత ఫ్యూడల్ వ్యవస్థ ఆర్థిక చట్రం ప్రధాన కారణం అని చెప్పవచ్చు. అలాగే దళితులకు, పేదలకు భూములు లేకుండా చేయడం, హక్కులు లేకుండా చేయడం ఇదంతా ఆర్థిక దోపిడీతో ముడిపడి ఉన్నది.

### రిజర్వేషన్లు ఎందుకు?

రెండోది అంశం.. అసలు రిజర్వేషన్లు ఎందుకు కోరుకుంటున్నాం? కేవలం ప్రాతినిధ్యం కోసం అని కొంతమంది చెబుతున్నారు. రిజర్వేషన్లు ఇచ్చేది ఆర్థికాభివృద్ధి కోసం కాదు ఆయా కులాల్లో ఉండేవారికి నిష్పత్తి ప్రతిపదిక మీద వారు రాజకీయాల్లో, ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం సాధించడం కోసమే ఈ రిజర్వేషన్లు అని అంటున్నారు. ఆయా తరగతులను మొత్తంగా వివక్ష నుండి విముక్తి చేయడానికి ఉద్దేశించకపోతే, అసలు వివక్షను నిర్మూలించడానికి ఉద్దేశించకపోతే.. కొంతమంది ధనవంతులు, కొంతమంది తెలివితేటలు ఉన్నవారికి ప్రాతినిధ్యం సంపాధించిపెట్టేదానికి ఉద్దేశిస్తే అటువంటి దాన్ని భుజాన వేసుకొని మనం ఊరేగాల్సిన అవసరం లేదు. అందుకని మనం ఆర్థిక పునాదిలో భాగంగా, ఆర్థిక అంశంతో జోడించి కుల వివక్షతను చూస్తున్నాం. కులవివక్షకూ ఆర్థిక వెనుకబాటుతనానికీ మధ్య సంబంధం ఉంటుంది. విద్యలో వెనుకబాటు తనానికీ, ఆర్థిక స్థితిగతులకూ మధ్య సంబంధం ఉంటుంది. మొత్తం మీద చూసినప్పుడు సామాజిక స్థితికీ, విద్యా స్థితికీ, ఆర్థిక స్థితికీ సంబంధం ఉంటుంది. కాబట్టి ఈ అంశాలను కాకుండా మిగతావాటిని పరిగణనంలోకి తీసుకోవడం ఏమాత్రం సరైంది కాదు. అంటే ఆ తెగలో లేక ఆ బృందంలో ధనికులకు మాత్రమే ప్రాతినిధ్యం వహించే పరిస్థితి

**"రిజర్వేషన్లు పాలక వర్గాలు ప్రవేశపెట్టాయి. ప్రస్తుతమున్న దేశ పరిస్థితుల్లో కుల వ్యవస్థను నిర్మూలించకుండా, కుల వ్యవస్థను వినియోగించుకుంటూ పాలక వర్గం తమ అవసరాల కోసం కొంతమంది మిత్రుల్ని తయారు చేసుకొని, కో- ఆప్టు చేసుకొని తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. ఆ విధంగా రిజర్వే షన్లు పాలక వర్గాల ప్రయోజనాలకోసం ఉపయోగించుకోడాన్ని మనం సమర్థించనక్కరలేదు. రిజర్వేషన్ల వల్ల పీడిత వర్గాలు బాగుపడే విధంగా వాటిని పీడిత వర్గాలకు దగ్గర చేసే ప్రయత్నం చేయాలి."**

ఉన్నప్పుడు ఆ ప్రాతినిధ్యాన్ని ఆ తెగ లేక బృందలోని పేద వర్గాలకు కూడా వర్తింపజేసేందుకు అవసరమైన ప్రాతిపదికలను ఏర్పాటు చేయాలనేది మన పార్టీ అభిప్రాయం. అందువల్ల సిపిఎం వర్గ దృక్పథం నుండి రిజర్వేషన్లకు కేవలం ఒకే అంశం కొలబద్దగా ఉండాలనే అంశం సరైంది కాదని భావించడం జరుగుతుంది.

అయితే, రిజర్వేషన్లు ఎవరు ప్రవేశ పెట్టారు? పాలక వర్గాలు ప్రవేశపెట్టాయి. పెట్టుబడి దారీ వర్గం ప్రవేశపెట్టింది. భూస్వామ్య వర్గం ఇష్టం ఉన్నా లేకపోయినా అంగీకరించింది. ప్రస్తుతం ఉన్న భారతదేశ పరిస్థితుల్లో కుల వ్యవస్థను నిర్మూలించకుండా, కుల వ్యవస్థను వినియోగించుకుంటూ పాలక వర్గం తమ అవసరాల కోసం కొంతమంది మిత్రుల్ని తయారు చేసుకొని, కో- ఆప్టు చేసుకొని తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నారు. ఆ విధంగా రిజర్వేషన్లు పాలక వర్గాల ప్రయోజనాలకోసం ఉపయోగించుకోవడాన్ని మనం సమర్థించనక్కరలేదు. రిజర్వేషన్ల వల్ల పీడిత వర్గాలు బాగుపడే విధంగా వాటిని పీడిత వర్గాలకు దగ్గర చేసే ప్రయత్నం చేయాలి.

**ప్రపంచవ్యాపితంగా రిజర్వేషన్లు**

మనదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా పాలక వర్గాలు సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన బృందాలను కట్టడి చేసి ఒక వ్యవస్థను రూపొందించేందుకు అటువంటి రిజర్వేషన్ల పద్ధతిని తీసుకొచ్చారు. ఒకప్పుడు అమెరికాలో కోటా పద్ధతి ఉండేది. అంటే, సామాజికంగా వెనుకబడిన వారికి నిర్ణీత శాతం, నిర్ణీత నిష్పత్తి కోటా ఉండేది. ప్రస్తుతం దాన్ని ఎత్తేశారు. ఈ కోటా పద్ధతిని చట్ట ప్రకారం అమలు జరిపేది ఏమీ లేదు. కానీ ఒక విధానం ఉంది. అంటే ప్రభుత్వ సహాయం పొందే సంస్థల్లో విభిన్న సామాజికార్థిక తరగతుకలకు అవకాశం ఇవ్వాలని ఉండేది. ఆయా సంస్థల్లో వైవిధ్యం కలిగిన పనివాళ్ల బృందాలనూ, విద్యార్థుల్ని చేర్చుకోవాలి. అటువంటి వారికి ప్రభుత్వం సహాయం అందించే ఒక అఫర్మేటివ్ యాక్షన్ పద్ధతి అమెరికాలో ఉంది. అక్కడ రకరకాల ప్రాతిపదినిధ్య పద్ధతులు ఉన్నాయి. ఆర్థికంగా స్తోమత ఉన్న వారికి కూడా అనేక రకాలలైన సౌకర్యాలు, స్కాలర్‌షిప్‌లు ఇచ్చే పద్ధతి ఉంది.

మలేషియాలో ఆర్థికంగా రకరకాల మార్గాలో సహకారాన్ని అందించే పద్ధతి ఉంది. వ్యవసాయంలో, ప్రత్యేకంగా భూమిపైన రిజర్వేషన్లు, పెట్టుబడుల రిజర్వేషన్లు, పరిశ్రమ రిజర్వేషన్లు ఇచ్చే పద్ధతులున్నాయి. కొన్ని దేశాల్లో మత ప్రాతిపదిక రిజర్వేషన్లు కూడా ఉన్నాయి. ఇందులో రెండు పద్ధతులున్నాయి. ఒకటి సమాంతర (హారిజాంటల్) పద్ధతి, రెండు నిలువు (వెర్టికల్) పద్ధతి. ఒకతరగతికి ఒక నిష్పత్తి, మరో తరగతికి మరో నిష్పత్తి అలా రిజర్వేషన్లను ఇచ్చే పద్ధతిని నిలువు పద్ధతి అంటాం. సమాంతర పద్ధతి అంటే, వివిధ తరగతుల్లో స్థానిక, స్థానికేతర రిజర్వేషన్లు వంటి రూపాల్లో ఇచ్చే పద్ధతి. సమాంతర పద్ధతిలో రిజర్వేషన్లు సామాజిక అంశాలు, రకరకాల అంగవైకల్యం, క్రీడాకారులు రకరకాల గుర్తింపులతో ఇస్తారు. అంతర్జాతీయంగా ఆయా దేశాల పరిస్థితుల్ని బట్టి, అవసరాల కోసం పాలకవర్గాల స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు పలు రకాలుగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు.

**మన దేశంలో రిజర్వేషన్లు**

మన దేశంలోనూ బ్రిటీషు హయాంలో మొదటి సారి మత ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఇచ్చారు. రిజర్వేషన్లు రాజకీయ ప్రాతిపదికపైన కల్పించారు. ఆ తర్వాత మన దేశంలో నాన్ బ్రాహిన్ ఉద్యమాలు వచ్చాయి. బ్రాహ్మణ వ్యతిరేక సెంటిమెంట్స్‌తో కొన్ని బ్రాహ్మణేతర కులాలకు రిజర్వేషన్లు పెట్టారు. ఇందులో దళితుల నుండి జమిందార్ల దాకా సామాజిక న్యాయం అనే అంశం లేదు. అయినా ఆ పేరుతో రిజర్వేషన్లను ఇచ్చారు. తర్వాత అంబేద్కర్ వచ్చాడు. దళితులికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు కావాలని చెప్పాడు. సామాజిక న్యాయంలో వ్యత్యాశాన్ని చూడాలి. దళితులు, అర్ధ భానిసత్వం, అంటరానితనం అనుభవించేవారికీ మిగతా సూద్ర కులాలందరికీ సామాజిక న్యాయం ఒకటిగా చూడలేం. అలాగే ఇప్పుడు వెనుకబడిన కులాలు, సేవాకులాలు, వ్యవసాయ కులాలు వంటివాటిల్లోనూ చూస్తున్నాం. వ్యవసాయ కులాల్లో కూడా అందరూ సూద్రులే. ఆ సూద్రుల్లో ఆధిపత్య కులాల వారు అందరూ వర్ణ వ్యవస్థలో ఉన్నారు. అణచివేతకు గురవుతున్నారు. వారికి న్యాయం జరగాలని కోరే పరిస్థితిలో ఉంది. ఈ రోజు అందరూ సామాజిక న్యాయం కావాలని అంటున్నారు. కాపులు, కమ్మలు, మరాఠీలు కావాలంటున్నారు. వీల్లందరూ సూద్ర కులాలు కాబట్టి సామాజిక న్యాయం కావాలని అంటున్నారు. వాళ్లల్లో ఆధిపత్య కులాల్లో పెత్తనం చేసేవాళ్లున్నారు. కాబట్టి, ఈ సామాజిక న్యాయాన్ని అగ్రకులాలు, సూద్ర కులాలు అనే పద్ధతిలో చూస్తే సరిపోదు. ఈ రకమైన వాటిని ఒకే గాటిన కట్టి సామాజిక న్యాయాన్ని వర్గ దృష్టి లేకుండా కోరడం సరైంది కాదని అర్థం చేసుకోవాలి.

అందుకని ఈ సామాజిక న్యాయం అనే పడికట్టు పదాన్ని వాడి మొత్తం దళితులనూ దాదాపు ఆధిపత్య తరగతులుండే కులాలనూ ఒకే గాటున కట్టి చర్చించడం సిపిఎంకు అంగీకారం కాదు. దళితులకు రిజర్వేషన్లు కావాలని మనం అంటున్నాం. వారికి సంబంధించి క్రీమీ లేయర్ వద్దంటున్నాం. అదేసమయంలో వెనుబడిన కులాలకు రిజర్వేషన్లు ఇస్తూనే క్రీమీ లేయర్ ఉండాలని అంటున్నాం. క్రీమీ లేయర్ అంటే ఇక్కడ ఆధిపత్య వర్గాల వారిని పక్కన పెట్టి మిగతా వారికి వర్తింపజేయడం. అలాగే వెనుకబడిన కుల్లాల్లో వర్గీకరణ విషయం కూడా. కొన్ని సేవా కులాలు, సంచార కులాల వారికి వర్గీకరణ గురించి ఆలోచిస్తున్నాం. కాబట్టి సామాజిక న్యాయంలో ఈ రకమైన వైవిధ్యాన్ని చూపించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి దృక్పథంతోనే మనం సామాజిక న్యాయానికి ఒకే కొలబద్దను తీసుకోవడం న్యాయం కాదని చెబుతున్నాం. కుల వ్యవస్థ ఉన్న నేపథ్యంలో సామాజికాంశాన్ని ప్రధానమైనదిగా తీసుకోవాల్సిందే. కానీ, దానికి తోడు మిగతా అంశాల్ని కూడా పరిగణలోకి తీసుకోకపోతే భారతదేశంలో ఉన్న వైవిధ్యాన్ని విస్మరించి

సామాజిక న్యాయం నిజంగానే కావాల్సిన వారికి మనం హాని చేసినవారం అవుతాం. ఇదీ వర్గ దృష్టి నుండి చూసే పద్ధతి.

**50 శాతం రిజర్వేషన్**

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వ్యతిరేకించేవారు చెప్పే మరో కారణం ఏమంటే ఈ రిజర్వేషన్ల వల్ల 50 శాతం రిజర్వేషన్ సీలింగ్ దాటిపోతుందని. 1992లో సుప్రీం కోర్టు ధర్మాసనం రిజర్వేషన్లు ఏవైనా గానీ 50 శాతం సీలింగ్ దాటకూడదు అని తీర్పు ఇచ్చింది. అప్పటికే తమిళనాడులోనూ, మరికొన్ని రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు 50 దాటిపోయాయి కాబట్టి ఈ అదనపు శాతాలను రక్షించడం కోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేసి అదనపు రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన మండల కమిషన్ నివేదిక రాక ముందు ఈ విధంగా వెనుకబడిన కులాలకు రాష్ట్రాలు రిజర్వేషన్లు ఇచ్చుకుంటూ వచ్చాయి. కేంద్రంలో మాత్రం ఓబీసీలకు రిజర్వేషన్ లేదు. మండల కమిషన్ సిఫార్సు అమలు జరపడానికి నిర్ణయించుకున్నప్పుడు ఈ 50 శాతం సీలింగ్ ఉంది కాబట్టి అప్పటికి ఉన్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు పోను 50 శాతంలో మిగిలి ఉన్న భాగం ఎంతంటే 27 శాతం. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50 శాతం సీలింగ్ ఉంది కాబట్టి ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్ అని నిర్ణయించారు. అంటే 27 శాతానికి జనాభా ప్రమాణికం కాదు.

ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ఈ 50 శాతం సీలింగు అనే దానిపై కొత్త చర్చమొదలైంది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల 50 శాతం సీలింగ్ దాటిపోతుంది గనుక ఇది రాజ్యాంగ విరుద్ధం అని వాదన చేస్తున్నారు, ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ రిజర్వేషన్లు 50 శాతం వచ్చాయి. ఇప్పుడు పెంచిన 10 శాతం కలిపితే 60 శాతానికి చేరుతుంది. అందువల్ల 50 శాతం సీలింగ్ దాటిపోతోంది కాబట్టి ఇది న్యాయ విరుద్ధం అని వాదిస్తున్నారు. దీనికి సమాధానంగా మెజార్టీ న్యాయమూర్తులు అంటే ముగ్గురు న్యాయమూర్తులు చెప్పింది ఏమంటే.. 50 శాతం సీలింగ్ అనేది మనం పెట్టుకున్నది. మార్చుకోవడానికి అసాధ్యం అయ్యేదేమీ కాదు. కాబట్టి ఆ పేరుతో దీనిని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని అన్నారు. అంటే దాని అర్థం, రాజ్యాంగ సవరణతో సీలింగ్ మార్చుకోడంపై రాజకీయ శక్తుల ఇష్టా ఇష్టాలు, ప్రభుత్వం అవసరం బట్టి నిర్ణయం తీసుకోవచ్చు అని, అంటే కోర్టు తీర్పుని ఒమ్ము చేస్తూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సుప్రీం కోర్టు తీర్పు ఆంతర్యం. రాజ్యాంగ సవరణ చేయకపోతే 50 శాతం సీలింగ్ జరుగుతూనే ఉండాలి. ఎందుకంటే 50 శాతంతో సీలింగ్ ఉన్నప్పటికీ 10 శాతం ఇవ్వడానికి పార్లమెంటు నిర్ణయించిందంటే సుప్రీం కోర్టు నిర్ణయాన్ని పార్లమెంట్ తిరస్కరించినట్లవుతుంది. ఈ పరిస్థితి నుండి తప్పుకోడానికి సుప్రీం కోర్టు విధించిన 50 శాతం సీలింగ్‌ను రద్దు చేస్తూ పార్లమెంట్ చట్టం చేయవచ్చు. లేదా రాజ్యాంగంలో మార్పుల చేయవచ్చు.

> “50 శాతం సీలింగ్ సుప్రీంకోర్టు పెట్టినప్పటి నుండీ ఆ రకంగా సీలింగ్ పెట్టడం సరైంది కాదని సిపిఎం చెబుతూ వచ్చింది. ఈ సీలింగ్ వల్ల ఇప్పటికే అనేక వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు చేరకుండా ఉన్నాయి. 50 శాతం సీలింగ్ పెట్టారు కాబట్టి దళితులు, గిరిజనులు ఎక్కువగా ఉండే కొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన కులాల వారికి తగిన విధంగా రిజర్వేషన్లు అందకుండా పోయే అవకాశం ఉంది.”

50 శాతం సీలింగ్ సుప్రీంకోర్టు పెట్టినప్పటి నుండీ ఆ రకంగా సీలింగ్ పెట్టడం సరైంది కాదని సిపిఎం చెబుతూ వచ్చింది. ఈ సీలింగ్ వల్ల ఇప్పటికే అనేక వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు చేరకుండా ఉన్నాయి. 50 శాతం సీలింగ్ పెట్టారు కాబట్టి దళితులు, గిరిజనులు ఎక్కువగా ఉండే కొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన కులాల వారికి తగిన విధంగా రిజర్వేషన్లు అందకుండా పోయే అవకాశం ఉంది. ఉదాహరణకు బెంగాల్, త్రిపుర వంటివే కాకుండా ఇతర రాష్ట్రాలోనూ ఈ పరిస్థితి ఉంది. కొన్ని రాష్ట్రాల్లో కేటాయించిన 50 శాతం సీలింగ్ ప్రకారం కూడా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అందకుండా పోయిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు ఈ పరిస్థితిని మార్చే అవకాశం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయం. సిపిఎం మొదటి నుంచీ 50 శాతం సీలింగ్ తొలగించాలని చెబుతోంది.

ఇప్పుడు కోర్టు తీర్పు ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 60 శాతం అవుతాయి. అలాంటప్పుడు బిసిలకు ఏ కొలబద్ద ప్రకారం రిర్వేషన్లు కల్పించాలన్న సమస్య ముందుకువస్తుంది. బిసిల జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్ ముందుకు వస్తుంది. ఈ విషయం కోర్టులో తేలాలంటే బిసిల జనాభ ఎంత, వాటి ప్రాతినిధ్యం ఎంత అని కోర్టు అడుగుతుంది. అందుకు సంబంధించిన డేటాను మీరు సేకరించారా లేదా అని ప్రభుత్వాన్ని అడుగుతుంది. అప్పుడు 50 శాతం గురించి సుప్రీం కోర్టు ఇచ్చిన భాష్యాన్ని పురస్కరించుకొని జనాభా గణన చేయాల్సి వస్తుంది. లేకపోతే, వివాదం ఏర్పడే అవకాశముంది.

**10 శాతానికి ప్రాతిపదిక ఏమిటి?**

ఇంకో విషయం ఏమిటంటే, ఈడబ్ల్యూఎస్‌కి 10 శాతం రిజర్వేషన్లు అని నిర్ణయించడానికి ప్రాతిపదిక ఏమిటి అనేది. పదే ఎందుకు నిర్ణయించాలి. 20 లేక 30 ఎందుకు నిర్ణయించడకూడదు. అంటే నాన్ రిజర్వుడ్ క్యాటగిరీలో ఎంతమంది ఉన్నారు వారిలో పేదవారు ఎంతమంది? వారికి 10 శాతం ఇచ్చారేమిటి అనేది చర్చనీయాంశంగా ముందుకు వస్తుంది. దీనికి కూడా ఇంతకు ముందు చెప్పినట్లే గణాంకాలు లేవు. అంతా ఊహాజనితం. పేదవారు ఎంతభాగమైతే అంతభాగం పేదవారికే రిజర్వేషన్లు పరిమితం చేస్తే నష్టం ఏమీ లేదు. కానీ జనాభాలో పేదవారు ఎక్కువ శాతం ఉండి 10 శాతం మాత్రమే రిజర్వేషన్ ఇస్తే ఇంకా మాకు ఎక్కువ కావాల్సి ఉంటుందని అడగవచ్చు. దీనికి మించి రిజర్వేషన్ ఇచ్చి ఉండాల్సిందా అనే విషయాన్ని జనాభా వివరాలు తెలిస్తే కాని తేల్చలేరు. ఉదాహరణకి భారత దేశంలో 15 నుండి 20 శాతం పేదరికం ఉందని అంచనా. ఒకరోజు వారికి ఎంత ఆదాయం ఉండాలి అనే కొలబద్దని బట్టి రకరకాల అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వ కొలబద్ద చూసుకున్నా.. తెల్ల రేషన్ కార్డు ప్రకారం చూసుకున్నా.. ఎంత శాతం అనేది చెప్పగలం. ఏదేమైనా జనాభా గణన చేస్తే ఆ రకంగా పరిష్కారం సులభంగా దొరికే అవకాశం ఉంది. అప్పుడు ఇంకా పెంచాల్సివస్తే డిమాండ్ చేయవచ్చు.

**"సిపిఎం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కావాలని మొదటినుండి చెబుతూ వచ్చింది. మొట్టమొదట 1978లో జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీలకు రిజర్వేషన్లు ప్రకటించారు. అప్పుడు దానికి వ్యతి రేకంగా చాలా తీవ్రమైన ఉద్యమం వచ్చింది. ఆ పరిస్థితుల్లో అన్ని పార్టీలు కూర్చుని పరిష్కారం వాటి కోసం అలోచించాయి. పేదలకు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేశాయి, ఆ రోజు సిపిఎం దానికి సాను కూలంగా స్పందించి ఆ నిర్ణయం మంచిది అని ప్రకటించింది."**

8 లక్షల వార్షికాదాయం, 5 ఎకరాలు, వెయ్యి గజాల స్థలం వంటి కొలబద్దలను 10 రిజర్వేషన్‌కు ప్రభుత్వం పెట్టింది. ఈ కొలబద్ద ప్రకారం చూసినప్పుడు అత్యధిక ధనవంతులు కూడా దీనిని వినియోగించుకొంటారు. కాబట్టి ఈ కొలబద్దలను తీవ్రంగా ఖండించాల్సి ఉంటుంది. పేదలకీ, ధనికులకీ వ్యత్యాసం లేకుండా పోయే పరిస్థితి వస్తుంది. ఈ ముఖ్యమైన ఆర్థిక అంశాన్ని సుప్రీం కోర్టు ఇప్పటి వరకూ పరిశీలించిన పరిస్థితిలేదు. ఆదాయ పరిమితిని బాగా తగ్గిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుంది.

**ఈబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సిపిఎం మొదటి నుండీ అనుకూలం**

సిపిఎం ఈడబ్ల్యూఎస్ సెక్షన్లకు రిజర్వేషన్ కావాలని మొదటినుండి చెబుతూ వచ్చింది. మొట్టమొదట 1978లో జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీలకు రిజర్వేషన్లు ప్రకటించారు. అప్పుడు దానికి వ్యతిరేకంగా చాలా తీవ్రమైన ఉద్యమం వచ్చింది. ఆ పరిస్థితుల్లో అన్ని పార్టీలు కూర్చుని పరిష్కారం వాటి కోసం అలోచించాయి. పేదలకు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేశాయి, ఆ రోజు సిపిఎం దానికి సానుకూలంగా స్పందించి ఆ నిర్ణయం మంచిది అని ప్రకటించింది. అప్పటి నుండీ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విషయం ఏ సందర్భంలో చర్చకు వచ్చినా అందుకు అనుకూలంగా సిపిఎం స్పందిస్తూ వచ్చింది. మండల కమిషన్‌కు వ్యతిరేకంగా ఉద్యమం జరిగినప్పుడూ, కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఏ హయాంలో కమిషన్ వేసినప్పుడూ అటువంటి వైఖరినే తీసుకున్నాం. ఆరోజు 103 రాజ్యాంగ సవరణ వచ్చినప్పుడు కూడా సిపిఎం అనుకూలంగానే స్పంధించింది. సిపిఎం ఇటువంటి వైఖరిని తీసుకవడానికి కారణాలు:

1. ఈ భారతదేశంలో కులవ్యవస్థ తీవ్రంగా నెలకొని ఉన్న నేపథ్యంలో కొన్ని కులాలు సామాజిక అణచివేతకు గురవుతున్నాయి. కాబట్టి, మొదటిగా సామాజిక ప్రాతిపదికనే దానికి ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఎం అంగీకరిస్తుంది.

2. అయితే అదేసమయంలో సామాజిక పరిస్థితుల్లో కూడా వైవిధ్యం ఉంది. ఇంతకుముందే చెప్పినట్లు చాలా కాలం నుండి వర్ణవ్యవస్థ ఉంది, అలాగే పెట్టుబాడిదారీ విధానం అభివృద్ధి అయిన తర్వాత అనేక మార్పులు వచ్చాయి. వీటన్నిటి రీత్యా సామాజిక అంశాలకు ప్రాధ్యాన్యత ఇస్తూనే ఇతర అంశాలను కూడా జోడించి ఆయా సందార్భలను బట్టి ముఖ్యంగా పేద ప్రజల ప్రయోజాలను బట్టి మనం రిజర్వేషన్లు నిర్ణయించుకోవాల్సి ఉంటుందని సిపిఎం అభిప్రాయం. అలాగే కొన్ని ప్రత్యే తరగతులకు ఉదాహరణకు స్పోర్ట్స్ పర్సన్స్, దేశసేవ చేసిన వారు బలహీనవర్గాలని చెప్పలేం కానీ వారి విషయంలో కూడా రిజర్వేషన్లకు సాను కూలంగా స్పంధిస్తాం. కాబట్టి ఈ రిజర్వేషన్లు ఇచ్చేటపుడుఅనేక అంశాలు వస్తున్నాయి కనుక సామాజిక అంశంతోపాటు ఆర్థిక అంశాన్ని కూడా చూడాలి. అదే ఈ రిజర్వేషన్ సృష్టించిన ప్రత్యేక సమస్యలకి శాశ్వతమైన పరిష్కారం. ఈ దేశంలో ఉండే పేదరికానికీ, వెనుకబాటుతనానికీ రిజర్వేషన్లే సరైన పరిష్కారం కాదు అని భావిస్తూనే మరోవైపు ప్రస్తుత పరిస్థితిల్లో సాధ్యమైనంతవరకు అవి అర్హులకు దక్కేట్టుగా చేయడానికి మనం ఇతర అంశాల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

3. రిజర్వేషన్లను మనం సమర్ధించడానికి మరో కారణం ఉంది. అనేక సందర్భాల్లో.. పాలక వర్గాలకు అవకాశం దొరికినప్పుడల్లా రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమాల్ని రెచ్చగొడుతున్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సెంటిమెంట్‌ని రెచ్చగొట్టినట్టడం ద్వారా ఉద్యమాలు చేస్తున్నారు. ఇది రకరకాల పద్ధతుల్లో జరుగుతోంది. మొదటిది, రిజర్వేషన్ అనుభవించని తరగుతులు అంటే సూద్రకులాలలోని ఉండేవాళ్లు కావచ్చు, లేక అగ్రకుల్లాలో కావచ్చు రిజర్వేషన్లు పొందని వారిలో రిజర్వేషన్ వ్యతిరేకతను రెచ్చగొట్టి ఉద్యమాల్లోకి తెస్తున్నారు. ఈ తరగతుల్లో ఉండే పేదవాళ్లని రకరకాల పేర్లతో రెచ్చగొడు తున్నారు. పెట్టుబడిదారులు కూడా రకరకాల పద్ధతుల్లో రిజర్వేషన్లను ప్రతిఘటిస్తున్నారు. మొత్తం మీద రిజర్వేషన్ వ్యతిరేక సెంటిమెంటును రెచ్చగొట్టి వర్గ ఐక్యతను దెబ్బదీసే విధంగా పాలక వర్గాలు వ్యవహరి స్తున్నాయి. దీనిని ఆసరాగా చేసుకొని అనేక రూపాల్లో రిజర్వేషన్లను బలహీనం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అందుకనే ఈ రిజర్వేషన్ వ్యతిరేకతని తగ్గించి ఆ తరగతుల్లోనూ సానుకూలతను సృష్టించి ఐక్యతను పెంచేందు కోసం ఈడబ్ల్యూఎస్ వంటివి పేదలకు అండగా నిలవాలి.

4. ఈ రోజు మనం గ్రామ సీమల్లో చూస్తే ఒకప్పుడు వ్యవసాయ కార్మికులు దళితుల్లో ఎక్కువగా ఉండేవారు. రోజురోజుకీ వ్యవసాయ కార్మికుల సంఖ్య పెరగిపోతూ ఉంది. అంటే దళితులే పెరుతున్నట్లు కాదు.. వెనుబడిన తరగతుల నుండి అనేక మంది వ్యవసాయ కార్మికులుగా వస్తున్నారు. అగ్రకులాల నుండి అంటే సూద్రకులాల నుండి కూడా ఈ రోజు వ్యవసాయ కార్మికుల్లోకి వస్తున్నారు. పోరాటాల్లో వారంతా ఐక్యం కావడానికి ఈ పరిస్థితి అనుకూలం. కానీ రిజర్వేషన్ సందర్భం వచ్చినప్పుడు రిజర్వేషన్ తీసేయాలి లేదా ఇవ్వాలని అని చర్చ వస్తుంది. ఈ రోజు మరాఠీ ఉద్యమంలో మొదట రిజర్వేషన్ తీసేయాలనే డిమాండ్ వచ్చింది. ఆ తర్వాత అది మారి పోయింది. కాబట్టి రిజర్వేషన్ల వంటి వాటి వల్ల వర్గ ఐక్యతని దెబ్బతీసే అవకాశం రాకుండా పేదలందరూ ఐక్యంగా ఉండేందుకు రిజర్వేషన్లలో ఉండే అపోహల్ని తొలగించాల్సిన అవసరం ఉంది. కార్మిక వర్గంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. అందుకని రిజర్వేషన్లు పెంచే అంశం ప్రాతిపదికన వర్గ ఐక్యతను విచ్చిన్నం చేసే అవకాశం లేకుండా చేయడానికి ఇది అవసరం. మౌలికంగా సామాజిక సమస్యతో ఇతర ఆధునిక సమస్యల్ని ముడిపెట్టి చూడాల్సిన వైవిధ్యం ఉంది కాబట్టి, ఆ రకంగా సంపూర్ణంగా అర్థం చేసుకొని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ని సిపిఎం సమర్ధిస్తుంది.

❁

# రాష్ట్రాల హక్కులపై కేంద్రం దాడి



రచయిత కేరళ
స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి

**ఎంబి రాజేష్**

**(భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత, మార్క్సిస్టు సిద్ధాంత వేత్త కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య 108వ జయంతి సందర్భంగా విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 2022 డిసెంబర్ 26న జరిగిన సభలో కేరళ స్థానిక స్వపరిపాలన శాఖ మంత్రి ఎంబి రాజేష్ చేసిన స్మారకోపన్యాసం పూర్తి పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం... సంపాదకుడు)**

భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమం ఇచ్చిన ఒక గొప్ప కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన అగ్ర నాయకుడు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు వ్యవస్థాపకుల్లో ఒకరు. సిపిఐ(ఎం) తొలి పొలిట్‌బ్యూరోలో నవరత్నాలు అని పిలిచే తొమ్మిది మంది సభ్యుల్లో బసవపున్నయ్య ఒకరు. కామ్రేడ్ ఎంబి ఒక మహా సిద్ధాంత వేత్త. 1964లో రూపొందించబడిన సిపిఐ(ఎం) కార్యక్రమ రూపకర్తల్లో ఆయన అగ్రగణ్యుడు. భారత దేశ పరిస్థితులకు ఆయన మార్క్సిజం-లెనినిజాన్ని వర్తింపజేశారు. భారత దేశంలోని నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా విశ్లేషించడంలో ఆయన మార్క్సిజం-లెనినిజాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. ఒక సిద్ధాంత వేత్తగా ఆయన సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించడంలో విజయం సాధించారు. అన్ని రకాల క్లిష్ట పరిస్థితుల్లోనూ ఆయన కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించారు. రివిజనిస్టు ధోరణలకూ మరోవైపు వామపక్ష పిడివాద ధోరణులకు వ్యతిరేకంగా ఆయన సైద్ధాంతిక పోరాటం నిర్వహించారు. అదే విధంగా ఈ దేశంలోని యువజన, విద్యార్థి ఉద్యమాల్లో కామ్రేడ్ ఎంబి పాత్ర, వాటికి ఆయనిచ్చిన మార్గదర్శకత్వం గణనీయమైనది. భారతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక మేధో మార్గదర్శిగా, దూరదృష్టి గల కమ్యూనిస్టు నాయకునిగా కామ్రేడ్ ఎంబి ఎల్ల వేళలా గుర్తుండిపోతారు.

కామ్రేడ్ ఎంబి 108వ జయంతి సందర్భంగా జరుగుతున్న ఈ సదస్సులో చర్చనీయాంశంగా మీరు 'రాష్ట్రాల హక్కులపై కేంద్రప్రభుత్వ దాడి' అనే అంశాన్ని తీసుకోవడం ప్రస్థుత పరిస్థితుల్లో చాలా సముచితమైన నిర్ణయం. మన దేశంలో రాష్ట్రాల హక్కులపైనా, ఫెడరలిజం మీదా దాడికి సంబంధించి చాలా కాలంగా చర్చ జరుగుతోంది. కానీ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఉన్న తరుణంలో ఈ సమస్యపై చర్చకు మరింత ప్రాధాన్యత వచ్చింది.

మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కుల మీదా, రాజ్యాంగంలోని ఫెడరల్ సూత్రాల మీదా తీవ్రమైన దాడి చేస్తోంది. ఈ దాడి అనేది సాధారణంగా జరుగుతున్న దాడి కాదు, మన లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తిరగరాయడానికి ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం చేస్తున్న దాడి. అందువల్ల ఈ దాడిని ఇతర అంశాలతో సంబంధం లేకుండా చూడలేం. మన రాజ్యాంగంలోని అన్ని మౌలిక అంశాలమీదా అంటే లౌకికత్వం, ప్రజాసామ్యం ముఖ్యంగా పార్లమెంటరీ ప్రజాసామ్యం, ఫెడరలిజం మొదలైన రాజ్యాంగ మౌలిక అంశాలన్నిటిమీదా జరుగుతున్న దాడిలో ఇదో భాగం. ఫెడరలిజం అనేది మన రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో ఒకటి. ఈ విషయాన్ని సుప్రీం కోర్టు పదేపదే చెప్పింది. ఈ రోజు మొత్తం రాజ్యాంగం మీద జరుగుతున్న దాడిలో భాగంగా ఈ రాజ్యాంగ మౌలికాంశాల మీద కూడా దాడి జరుగుతోంది.

మన రాజ్యాంగంలోని ఒకటవ అధికరణం "ఇండియా అంటే భారత్ రాష్ట్రాల సమాఖ్య" అని చెప్పింది. మన రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫెడరలిజం సారాన్ని రాజ్యాంగ పరిషత్‌లో ఈ విధంగా వివరించారు: "భారత దేశ రాజ్యాంగం ఫెడరల్ రాజ్యాంగం. యూనియన్ అనేది రాష్ట్రాల సమాఖ్య కాదు. రాష్ట్రాలు కూడా యూనియన్ ఏజెన్సీలు కాదు. యూనియన్, రాష్ట్రాలు రెంటినీ రాజ్యాంగం సృష్టించింది, రెంటికీ రాజ్యాంగమే అధికారాలు ఇచ్చింది." అందువల్ల రాష్ట్రాలు కేంద్రం చెప్పుచేతల్లోని సంస్థలు కాదని స్పష్టంగా చెప్పడం జరిగింది. రాష్ట్రాలకు మన రాజ్యాంగం కల్పించిన అధికారాలు, హక్కులు ఉన్నాయి. ఈ రోజున జరుగుతున్నదేమంటే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా లభించిన ఈ హక్కులనూ, అధికారాలనూ ఒక పద్ధతి ప్రకారం హరించేస్తున్నది. ఫెడరలిజం స్ఫూర్తిని మోడీ ప్రభుత్వం నగ్నంగా ఉల్లంఘిస్తున్నది.

భారత దేశం కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ఫెడరిలిజాన్ని ఎంచుకోలేదు. ఫెడరలిజం అనేది మన రిపబ్లిక్‌కు హృదయం వంటిది. మన అవసరం కోసమే మనం ఈ ఫెడరల్ నిర్మాణాన్ని ఎంచుకున్నాం. ఒక్క ఫెడరల్ నిర్మాణం మాత్రమే మన దేశంలోని సంక్లిష్ట పరిస్థితులను, విస్తారమైన వైవిధ్యాన్ని తనలో ఇముడ్చుకోగలదు. భారత దేశంలో వేలాది భాషలున్నాయి. ప్రపంచంలోని ప్రధాన మతాలు, విభిన్న సంస్కృతులు ఇక్కడున్నాయి. ఆధునిక భారత దేశం ఇటువంటి విస్తారమైన భిన్నత్వం నుండి ఏర్పడింది. 600కు పైగా సంస్థానాలను కలుపుకుని భారత దేశం ఏర్పడింది. 1947కు ముందు ఆధునిక భారత దేశం లేదు. అప్పుడు మన దేశం 600కు పైగా సంస్థానాలుగా విభజించబడి ఉంది. ఈ సంస్థానాల్లోని ప్రజలను ఏకం చేయడం జరిగింది. విభిన్న ప్రాంతాలు, మతాలు, కులాలు, సంస్కృతులకు చెందిన వారిని ఏకం చేయడం జరిగింది. వీళ్లందరినీ ఏకం

> **" గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారు. వాటి అధికారాన్ని సవాలు చేస్తున్నారు. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించే బిల్లులకు కొన్ని సార్లు వాళ్లు ఆమోదం ఇవ్వకుండా తొక్కిపడుతున్నారు. "**

చేసింది మన దేశ స్వాతంత్ర్యోద్యం. ఆ వలసవాద వ్యతిరేక ఉద్యమమే భారత ప్రజలను ఏకం చేసింది, ఆ ఉద్యమమే ఆధునిక లౌకిక ప్రజాస్వామిక రాజ్యాన్ని ఏర్పాటు చేసింది.

భారత దేశంలోని విభిన్న మతాలు, కులాలు, సంస్కృతులను తనలో ఇముడ్చుకుంటున్నది గనుకనే దేశం ఈనాడు ఫెడరల్ రాజ్యంగా ఉంది. ఫెడరల్ వ్యవస్థ మాత్రమే దేశంలోని అందరి ప్రయోజనాలు రక్షించగలుగుతుంది. ఈ ఫెడరలిజంలో లోపాలు లేవని కాదు. సిపిఐ(ఎం) మన ఫెడరలిజంలోని లోపాలను ఎత్తి చూపించింది. మన ఫెడరలిజం రూపంలో ఫెడరల్‌గా ఉంటుంది సారంలో మాత్రం కేంద్రీకృతంగా ఉంటుంది అని చెప్పింది. అందువల్ల ఈ లోపాలున్నప్పటికీ దేశంలోని భిన్నత్వం, బహుళత్వానికి ప్రాతినిధ్యం వహించే విధంగా ఈ దేశంలో ఫెడరలిజం అమలవుతున్నది.

మోడీ అధికారంలోకి వచ్చింది మొదలు ఆయన సహకార ఫెడరలిజం అంటూ తేనెపూసిన మాటలు చెబుతున్నారు. కానీ వాస్తవంలో ఆయన ఫెడరలిజం మీద దాడి చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రాల హక్కులు హరిస్తోంది. మూడు రంగాల్లో అది ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తోంది. అవి 1. రాజకీయ రంగం, 2. శాసన రంగం, 3. ఆర్థిక రంగం.

2014 నుండి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను నిరంతరం దుర్వినియోగపరుస్తోంది. గవర్నర్లను ఉపయోగించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయంగా దాడి చేస్తోంది. ముఖ్యంగా బిజెపి యేతర పార్టీలు పరిపాలిస్తున్న ప్రభుత్వాలపై ఈ దాడి కేంద్రీకరించింది. దీనికి అనేక ఉదాహరణలున్నాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, గోవా, కర్నాటక, ఇటీవలి కాలంలో కేరళలో ఈ దాడులను చూశాం. కేంద్ర ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను బిజెపీయేతర ప్రభుత్వాలపై ఆయుధంగా ఎలా ఉపయోగించుకుంటున్నదో ఈ ఉదాహరణలు కళ్లకు కడతాయి.

గవర్నర్లకు రాజ్యాంగం ఇచ్చిన కొన్ని విచక్షణాధికారాలను ఉపయోగించుకుని వారు సమాంతర అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నిస్తున్నారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారు. వాటి అధికారాన్ని సవాలు చేస్తున్నారు. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించే బిల్లులకు కొన్ని సార్లు వాళ్లు ఆమోదం ఇవ్వకుండా తొక్కిపడుతున్నారు. ఇటీవల కేరళలో ఇలాగే జరిగింది. అంతకు ముందు తమిళనాడులో, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ ఇంకా అనేక రాష్ట్రాల్లో పదేపదే ఇలా జరిగింది. రాజ్యాంగంలోని 200 వ అధికరణం.. శాసన సభల బిల్లుల విషయంలో గవర్నర్లకు కొన్ని ప్రత్యామ్నాయాలు ఇచ్చింది. అందులో మొదటిది, గవర్నరు బిల్లును ఆమోదించాలి, లేకుంటే తిరిగి శాసన సభకు పంపాలి. శాసన సభ మళ్లీ ఆ బిల్లును ఆమోదించి గవర్నకు పంపితే దానిపై సంతకం చేసి ఆమోదించడం మినహా గవర్నరుకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఇక రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ముందున్న మూడో ప్రత్యామ్నాయం ఏమంటే ఆయన బిల్లును రాష్ట్రపతికి పంపించవచ్చు. రాజ్యాంగం ఈ మూడు ప్రత్యామ్నాయాలనే గవర్నరుకు కల్పించింది. కానీ గవర్నర్లు ఈ మూడు పనులు చేయకుండా బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టేస్తున్నారు. వాళ్లు బిల్లుకు ఆమోదం తెలపరు, లేక శాసన సభకు తిరిగి పంపరు లేకుంటే రాష్ట్రపతికీ పంపించరు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా, రాష్ట్ర శాసనసభల ఉమ్మడి అభిప్రాయానికి వ్యతిరేకంగా వారు బిల్లులను తొక్కిపట్టి ఉంచుతున్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన శాసనసభ ఉద్దేశాన్ని నామినేట్ చేయబడిన, కేంద్రంచే నియమించబడిన గవర్నరు నిరాకరిస్తున్నారు. ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యం మీద దాడి మినహా మరేమీ కాదు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నియమించిన గవర్నర్లు రాజ్యాంగం వారికిచ్చిన విచక్షణాధికారాలను మించి వ్యవహరిస్తున్నారు. రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాల ఛాన్సలర్లుగా గవర్నర్లు ఉంటున్నారు. ఈ అధికారం వారికి రాజ్యాంగం కల్పించింది కాదు. ఈ అధికారాన్ని వారికి రాష్ట్ర శాసన సభలు, చట్టాలు కల్పించాయి. ఈ అధికారాన్ని కూడా గవర్నర్లు దుర్వినియోగం చేస్తూ బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయ దాడికి ఉపయోగించుకుంటున్నారు. దీనికి ఇటీవలి ఉదాహరణ కేరళలో జరిగిన ఘటనలు. కేరళ గవర్నరు ఇటీవల 'అభీష్ట సూత్రాన్ని' ముందుకు తెచ్చారు. దీని ప్రకారం రాష్ట్ర మంత్రులు తన అభీష్టం మేరకు అధికారంలో ఉంటారని తనకు ఇష్టం లేని వారిని అధికారం నుండి తొలగించవచ్చుననీ చెప్పారు. అంటే ఆయన మంత్రులను డిస్మిస్ చేస్తానని చెబుతున్నారన్నమాట. ప్రజాస్వామ్య వ్యవస్థలో మన రాజ్యాంగం కింద గవర్నరు అభీష్టం అంటే రాజరికాల్లో మహారాజుకు ఉన్న అభీష్టం వంటిది కాదు. ఇక్కడ గవర్నర్ అభీష్టం అంటే మంత్రి వర్గ అభీష్టం అన్నమాట. గవర్నరు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రివర్గం సిఫార్సుల మేరకే పనిచేయాల్సి ఉంటుంది. మంత్రివర్గంలోని మంత్రులను ముఖ్యమంత్రి సలహా మేరకే గవర్నరు నియమిస్తారు, ఆయన సలహా మేరకే తొలగిస్తారు. అందువల్ల గవర్నరు ఏ మంత్రినీ స్వతంత్రంగా డిస్మిస్ చేయలేరు. అభీష్ట సూత్రం అనేది రాష్ట్ర ముఖ్యమంత్రి సలహా ప్రకారం పనిచేయాలని మాత్రమే చెబుతుంది. ఈ సూత్రాన్ని వక్రీకరించి తాను మంత్రులను డిస్మిస్ చేయగలనని గవర్నరు బెదిరిస్తున్నారు.

రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలో డాక్టర్ అంబేద్కర్ గవర్నర్ల గురించి పేర్కొంటూ వారికి ఎటువంటి పనులూ లేవు అని స్పష్టంగా చెప్పారు. వారికి కొన్ని విధులు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు. పనులకూ, విధులకూ మధ్య తేడాను గురించి కూడా అంబేద్కర్ స్పష్టంగా వివరించాడు. కానీ రాజ్యాంగం చెప్పిన ఈ పరిధులు దాటి వారు వ్యవహరిస్తున్నారు. అందువల్ల సిపిఐ(ఎం) గవర్నర్ల వ్యవస్థ గురించి చాలా స్పష్టంగా ప్రకటించింది. ఒక వేళ గవర్నర్లు గనుక

అవసరమైనట్టయితే వారిని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదించి నియమించాలి అని చెప్పింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ముగ్గురు సభ్యుల ప్యానల్ ఇవ్వాలి. వారిలో ఒకరిని ముఖ్యమంత్రితో సంప్రదించి నియమించాలి.

నేను ప్రాంతీయ పార్టీలకు ఒక విజ్ఞప్తి చేయదలుచుకున్నాను. ఈ రోజు బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న దాడులను అన్ని ప్రాంతీయ పార్టీలూ ఏదోఒక నాడు ఎదుర్కొంటాయి. బిజెపియేతర ప్రభుత్వాల మీద ఈ రోజు గవర్నర్లను అడ్డుపెట్టుకుని కేంద్రం దాడి చేస్తోంది. గవర్నర్లను రాష్ట్ర ప్రభుత్వాల మీద దాడికి రాజకీయ ఆయుధంగా ఉపయోగించుకుంటోంది. బిజెపితో ఏదో ఒక రకంగా స్నేహంగా ఉంటే తనకు రక్షణ లభిస్తుందన్న భ్రమల్లో ఎవరూ ఉండనక్కరలేదు. బిజెపి పంచన చేరిన ప్రాంతీయ పార్టీలతో అది ఎలా వ్యవహరించిందో తెలిపే అనేక ఉదాహరణలు మన ముందున్నాయి. తన ప్రాంతీయ పార్టీల మిత్రపక్షాలన్నిటినీ బిజెపి నాశనం చేసింది, మింగేసింది, విచ్ఛిన్నం చేసింది. పంజాబ్‌లో అకాలీ దళ్‌కు ఏమైందో మనకు తెలుసు. అక్కడ బిజెపితో అకాలీదళ్ తెగతెంపులు చేసుకోడానికి కారణమేమిటో తెలుసు. మహారాష్ట్రలో శివసేనకు ఏమైందో తెలుసు. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. బిజెపి తమను రక్షిస్తుందని ఏ పార్టీ అయినా భావిస్తుంటే అది ఘోరమైన తప్పు చేస్తున్నట్లే. అలా అనుకునే పార్టీలు భవిష్యత్తులో బిజెపి నుండి అదే రకమైన ప్రమాదాన్ని ఎదుర్కొంటాయి.

ఇక రెండవ విషయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల శాసన, పరిపాలనాధి కారాలపై దాడులు చేస్తున్నది. మోడీ ప్రభుత్వం పార్లమెంటులో మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను ఎలా ఆమోదింపజేసుకుందో మనం చూశాం. వ్యవసాయం రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశం. అయినప్పటికీ రాష్ట్రాలతో సంప్రదించకుండా మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు పార్లమెంటులో మూడు వ్యవసాయ చట్టాలు చేసింది. లోక్‌సభలో బండ మెజారిటీతో బిల్లులకు ఆమోదం పొందింది. రాజ్యసభలో పార్లమెంటరీ సాంప్రదాయాలన్నిటికీ తిలోదకాలిచ్చి, పార్లమెంటును దుర్వినియోగపరిచి వారు బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకున్నారు. ఆ వ్యవసాయ చట్టాల విషయంలో రాష్ట్రాల శాసన సభలకున్న శాసనాధికారాలను కేంద్రం హరించింది.

“ఇక రెండవ విషయం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల శాసన, పరిపాలనాధి కారాలపై దాడులు చేస్తున్నది. మోడీ ప్రభుత్వం పార్లమెంటులో మూడు వ్యవసాయ వ్యతిరేక చట్టాలను ఎలా ఆమోదింపజేసుకుందో మనం చూశాం. వ్యవసాయం రాష్ట్రాల జాబితాలో ఉన్న అంశం. అయినప్పటికీ రాష్ట్రాలతో సంప్ర దించకుండా మోడీ ప్రభుత్వం భారత వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు పార్లమెంటులో మూడు వ్యవ సాయ చట్టాలు చేసింది.”

అలాగే జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని ఆ రాష్ట్ర ఆమోదం లేకుండా ఎలా మూడు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టిందో మనం చూశాం. ఇక్కడ కూడా అన్ని రకాల పార్లమెంటరీ సాంప్రదాయాలను ఉల్లంఘించడం జరిగింది. బిజెపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రాల సంఖ్య తగ్గి కేంద్ర పాలిత ప్రాంతాల సంఖ్య పెరిగిందంటే ఫెడరలిజం పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. అలాగే విద్యారంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఎలా రాష్ట్రాల హక్కులు హరించిందో చూశాం. నూతన విద్యా విధానం అనేది విద్యను కేంద్రం తన గుప్పెట్లో పెట్టుకోడానికి ఉద్దేశించింది. మోడీ ప్రభుత్వం ఒక దేశం ఒక పాఠ్యాంశం అని మాట్లాడు తున్నది. తద్వారా అది మన సమాజంలోని భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని పూర్తిగా నీరుగారుస్తోంది. విద్య అనేది ఉమ్మడి జాబితాలో ఉన్న అంశం. అయినప్పటికీ వారు రాష్ట్రాల మీద కృత్రిమంగా ఏకశిలాసదృశ విధానాన్ని రుద్దుతున్నారు. ఉపా, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) చట్టాలకు చేసిన సవరణలు కూడా ఇదే కోవకు చెందుతాయి. శాంతి భద్రతలు రాష్ట్రాలకు చెందిన అంశాలు. అయినప్పటికీ వారు రాష్ట్రాల మీద తమ అధికారాన్ని రుద్దుతూ చట్టాలకు సవరణలు తెచ్చారు. రాష్ట్రాలకు తెలియకుండానే ఈ రెండు సంస్థలు రాష్ట్రాల్లో స్వేచ్ఛగా పనిచేసుకోడానికి అవకాశం కల్పించారు. వీటితో పాటు ఇటీవలి కాలంలో ఫెడరల్ స్ఫూర్తిని పూర్తిగా ఉల్లంఘిస్తూ కేంద్ర ప్రభుత్వం సహకార సంస్థను కేంద్ర స్థాయిలో ఎలా నెలకొల్పిందో చూశాం. సహకార రంగం అనేది పూర్తిగా రాష్ట్ర పరిధిలోని అంశం. చివరికి సుప్రీం కోర్టు కూడా జోక్యం చేసుకుని ఇది రాష్ట్రాల పరిధిలోని అంశం అని చెప్పాల్సి వచ్చింది. సహకార విభాగానికి అమిత్ షా నాయకత్వం వహిస్తున్నారు. అంటే వారి ఉద్దేశం చాలా స్పష్టం. ఎందుకంటే సహకార బ్యాంకుల్లో కోట్లాది రూపాయల డిపాజిట్లు ఉన్నాయి. ఈ డబ్బును కార్పొరేట్ కంపెనీలకు రుణాలుగా ఇచ్చి ఆ రుణాలను మాఫీ చేయడం ద్వారా ఈ డబ్బును కార్పొరేట్లకు అప్పగించడమే వారి లక్ష్యం. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి ఇచ్చిన 11.5 లక్షల కోట్ల రూపాయల రుణాన్ని రద్దు చేసినట్లు పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన ఒక సమాధానంలో తెలిపింది. దీని వల్ల బాగా లాభం పొందిన వారు కార్పొరేట్ అధిపతులే. ఇప్పుడు సహకార బ్యాంకుల్లోని డబ్బుపై కన్నేశారన్న మాట. అదే విధంగా 1954 ఐఎఎస్ క్యాడర్ నిబంధలను కేంద్ర ప్రభుత్వం ఎలా సవరించిందో చూశాం. ఈ సవరణల ప్రకారం ఐఎఎస్ అధికారుల బదిలీలపై రాష్ట్రాలు తమ నిరాకరణను తెలియజేసే హక్కును కోల్పోతాయి. ఇప్పుడు ఈ అధికారులను కేంద్రానికి డిప్యుటేషన్‌పై బదిలీచేయడాన్ని నిరాకరించే అధికారం రాష్ట్రాలకు ఉంది. ఇక ఇప్పుడు ఈ సవరణ వల్ల రాష్ట్రాలు ఆ అధికారాన్ని కోల్పోతాయి. ఈ విషయంలో కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య వివాదం వస్తే కేంద్ర నిర్ణయమే అమలవుతుంది. ఏడు రాష్ట్రాలు దీన్ని వ్యతిరేకించాయి. కానీ విచిత్రం ఏమంటే ఈ ఏడు రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్ లేదు. రాజస్థాన్, ఛత్తీశ్‌ఘర్, కేరళ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, తెలంగాణాలు వ్యతిరేకించిన రాష్ట్రాల్లో ఉన్నాయి.

మూడవది, ఆర్థిక రంగంలో కూడా రాష్ట్రాల హక్కులపై తీవ్రమైన దాడి జరుగుతోంది. భారత దేశంలో **చారిత్రికంగా** కేంద్రం నుండి రాష్ట్రాలకు నిధులు రెండు మార్గాల్లో బదిలీ అవుతుంటాయి. ఒకటి ప్రణాళికా సంఘం, రెండవది ఫైనాన్స్ కమిషన్. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారు. ఇప్పుడు రాష్ట్రాలకు నిధులు బదిలీ చేసే మొత్తం అధికారం ఫైనాన్స్ కమిషన్ వద్ద పోగుపడింది. కేంద్ర

> **"దేశంలో ప్రభుత్వాల ద్వారా అవుతున్న ఖర్చులో 60 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. కేవలం 40 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. విద్య మీద 85 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే 15 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఆరోగ్యం విషయంలో 82 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. మిగిలింది మాత్రమే కేంద్ర ఖర్చు చేస్తోంది. అంటే ఖర్చులో అత్యధిక శాతం రాష్ట్ర ప్రభుత్వాలే చేస్తుంటే వాటికి ఆదాయం మాత్రం 30 శాతమే వస్తోంది."**

ప్రభుత్వం పట్ల పక్షపాతంగా వ్యవహరించే ఈ ఫైనాన్స్ కమిషన్ నేడు రాష్ట్రాలపై దాడికి రాజకీయ ఆయుధంగా ఉపయోగించు కోబడుతోంది. ఫైనాన్స్ కమిషన్ రెండు పన్నుల ద్వారా వచ్చే నిధులను రాష్ట్రాలకు బదిలీ చేస్తుండేది. ఒకటి ఆదాయపు పన్ను, రెండు కేంద్ర ఎక్సైజ్ పన్నులు. ఇప్పుడు ఫైనాన్స్ కమిషన్ తన పన్నుల పరిధిని బాగా విస్తృతం చేసుకుంది. రెండు రకాల పన్నుల నుండి అన్ని రకాల పన్నుల ఆదాయం కేంద్రం తన వద్ద కేంద్రీకరించుకుంది. జిఎస్‌టి (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్)ను అమలు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆదాయం సమకూర్చే వనరులన్నిటినీ తనవద్ద కేంద్రీకరించుకున్నది. ఇప్పుడు రెండు వస్తువుల మీద పన్నులు వేసే అధికారం మాత్రమే రాష్ట్రాలకు ఉన్నది. అవి ఒకటి పెట్రోలియం, రెండు మద్యం. ఈ రెండు వస్తువుల మీద మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు వేయగలవు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చుకునే హక్కులన్నిటినీ కేంద్రం హరించి వేసింది. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కోసం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం మీద ఆధారపడాల్సి వచ్చింది. రాష్ట్రాలు తమ స్వంత వనరులనుండి ఖర్చు చేయగల సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది. 1955-56లో రాష్ట్రాలు 69 శాతం ఖర్చులను తమ స్వంత ఆదాయాల నుండి ఖర్చు చేసేవి. 2019-20 నాటికి ఇది 38 శాతానికి దిగజారిపోయింది. ఇటువంటి పరిస్థితి రావడానికి కారణమెవరు? కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా మోడీ ప్రభుత్వం కారణం. దీనికి కేరళ ఉదాహరణ చెప్పవచ్చు. జిఎస్‌టి ప్రవేశపెట్టినప్పుడు మోడీ ప్రభుత్వం రాష్ట్రాలు కోల్పోయిన ఆదాయానికి పరిహారం చెల్లిస్తామని మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2022 జులై 1వ తేదీ నుండి ఆ పరిహారాన్ని ఆపేసింది. దీని వల్ల గత ఆర్థిక సంవత్సరంలో కేరళ సుమారు 10,000 కోట్ల రూపాయలు నష్టపోయింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం ఆదాయ లోటు పరిమితిని తగ్గించడం వల్ల కేరళకు 6,717 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం, ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలకు పన్నుల నిధులు బదిలీ చేసే నిబంధనల్లో మార్పులు చేయడం వల్ల కేరళకు మరో 12,800 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. 13వ ఫైనాన్స్ కమిషన్ సమయంలో రాష్ట్రాలకు కేంద్రం నుండి పన్నుల నిధుల బదిలీ వాటా 2.5 శాతం నుండి ఇప్పుడు 14 ఫైనాన్స్ కమిషన్ 1.92 శాతానికి తగ్గించడం వల్ల ఈ నష్టం వాటిలింది. రెవెన్యూ లోటు పరిధి తగ్గించడం వల్ల 6,717 కోట్లు, జిఎస్‌టి పరిహారం ఆపేయడం వల్ల 10,000 కోట్లు, పన్నుల నిధుల బదిలీ వాటా తగ్గించడం వల్ల మరో 12,800 కోట్లు మొత్తం 29,517 కోట్ల రూపాయలను కేరళ నష్టపోయింది. అంటే సుమారు రూ. 30,000 కోట్లు. కేరళలో వరదలు వచ్చినప్పుడు జరిగిన నష్టం దాదాపు అంతే అంటే 30,000 కోట్లు ఉంది. ఆ విధంగా అత్యంత తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం కేరళకు కలిగించిన నష్టం ఎంత ఉందో మోడీ ప్రభుత్వం అంతే నష్టాన్ని కేరళకు కలిగించింది. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు మోడీ కల్పించిన వైపరీత్యం.

దేశంలో ప్రభుత్వాల ద్వారా అవుతున్న ఖర్చులో 60 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. కేవలం 40 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. విద్య మీద 85 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తుంటే 15 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఆరోగ్యం విషయంలో 82 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. మిగిలింది మాత్రమే కేంద్ర ఖర్చు చేస్తోంది. అంటే ఖర్చులో అత్యధిక శాతం రాష్ట్ర ప్రభుత్వాలే చేస్తుంటే వాటికి ఆదాయం మాత్రం 30 శాతమే వస్తోంది. ఇదీ భారత దేశంలో నేడు కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న సంబంధాల పరిస్థితి.

ఇటీవల కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కేంద్రం నుండి 42 శాతం నిధులను రాష్ట్రాలకు ఇస్తున్నాను, సహకార ఫెడరలిజానికి ఇదే నిదర్శనం అని చెప్పడంతో కార్పొరేట్ మీడియా అంతా దాన్ని ఆకాశానికెత్తేసింది. కానీ వాస్తవం దానికి భిన్నంగా ఉంది. కేంద్రం ఇచ్చే 42 శాతం రాష్ట్రాలతో పంచుకోగలిగే నిధుల్లో 42 శాతం. రాష్ట్రాలతో పంచుకోవలసిన అవసరం లేని పన్నులను కేంద్రం రోజురోజుకూ పెంచుతూపోతున్నది. రాష్ట్రాలతో పంచుకోవలసిన పన్నులను తగ్గించేస్తున్నది. దానివల్ల 42 శాతం వాటా ఇచ్చిన రాష్ట్రాలకు వచ్చే మొత్తం తగ్గిపోతున్నది. ఇటీవల కేంద్రం రాష్ట్రాలతో పంచుకోవలసిన అవసరం లేని పన్నులను విపరీతంగా పెంచింది. పెట్రోలియం ఉత్పత్తులపై బేసిక్ ఎక్సైజ్ పన్నును కాకుండా స్పెషల్ ఎక్సైజ్ పన్ను, అదనపు ఎక్సైజ్ పన్నును కేంద్రం పెంచింది. కేంద్రం వసూలు చేసే అదనపు ఎక్సైజ్ పన్ను, స్పెషల్ ఎక్సైజ్ పన్ను రాష్ట్రాలతో పంచుకోనవసరం లేదు. బేసిక్ ఎక్సైజ్ పన్నును మాత్రమే రాష్ట్రాలతో పంచుకోవాలి. కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా 18 లక్షల కోట్ల రూపాయల అదనపు ఎక్సైజ్ పన్నులు, స్పెషల్ ఎక్సైజ్ పన్నులు వసూలు చేసింది. ఈ మొత్తాన్ని అది రాష్ట్రాలతో పంచుకోవలసిన అవసరం లేదు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వం మోస పూరితంగా వ్యవహరిస్తున్నది. మోడీ ప్రభుత్వం ఒకవైపు సహకార ఫెడరలిజం గురించి మాట్లాడుతోంది, మరోవైపు రాష్ట్రాలకు వెన్నుపోటు పొడుస్తోంది. 2012లో రాష్ట్రాలతో పంచుకోవలసిన అవసరం లేని పన్నుల వాటా 9.43 శాతం ఉండేది. మోడీ ప్రభుత్వ హయాంలో దీన్ని 2020 నాటికి 15.4 శాతానికి పెంచారు. ఇది మోడీ ప్రభుత్వం ఎంత మోసకారి తనంతో వ్యవహరిస్తున్నదో తెలియజేస్తోంది.

మరోవైపు మోడీ ప్రభుత్వం ధనవంతులు, బడా వ్యాపారులపై వేసే కార్పొరేట్ పన్ను విషయంలో చాలా ఉదారంగా రాయితీలు ఇస్తున్నది. కార్పొరేట్ పన్ను రాష్ట్రాలతో పంచుకోవలసిన పన్ను. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ పన్నును 30 శాతం నుండి 22 శాతానికి తగ్గించింది. దీని వల్ల చివరకు నష్టపోయేదెవరు. రాష్ట్రాలు నష్టపోతాయి. ఇది కాకుండా కార్పొరేట్లకు పన్ను రాయితీలు ఇస్తున్నది. మోడీ ప్రభుత్వం ఏడాదికి సగటున 5 లక్షల కోట్ల పన్నుల్లో రాయితీలు ఇచ్చింది. దీనివల్ల కూడా రాష్ట్రాలు పెద్ద ఎత్తున నష్టపోతున్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు

రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం మరోవైపు పేదలకు ఇచ్చే రాయితీలను 'ఉచితాలు' అని పేరుపెట్టి రాద్ధాంతం చేస్తున్నది. ఎన్నికల సంఘమేమో ఈ 'ఉచితాలు'ను ఎలా అమలు చేస్తారో చెప్పండి, వీటికి నిధులు ఎక్కడి నుండి తెస్తారో తెలపండి అని రాజకీయ పార్టీలను నిలదీస్తోంది. మోడీ పదే పదే 'ఉచితాల' గురించి మాట్లాడుతున్నారు. ఏమిటా ఉచితాలు. పేదలకు ఇచ్చే సంక్షేమ కార్యక్రమాలు, సబ్సిడీలు ఆయన దృష్టిలో 'ఉచితాలు'. పేదలకు ఇచ్చే సంక్షేమాన్ని 'ఉచితాలు' అని ఎద్దేవా చేస్తున్నారు, కార్పొరేట్లకు ఇచ్చే రాయితీలను ప్రోత్సాహకాలు అంటున్నారు. ఇదీ ఈ ప్రభుత్వ కుత్సితం.

> "కేంద్ర ప్రాయోజిత పథకాలను కూడా రాష్ట్రాల హక్కులు హరించడానికి ఆయుధాలుగా కేంద్రప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది. 131 కేంద్రప్రాయోజిత పథకాలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ పథకాలన్నిటినీ రాష్ట్రాల్లోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ఏకరూపకంగా రూపొందించింది. కేరళ లాంటి రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల నిబంధనలను అనుసరించి వాటిని అమలుపరచడం ఆచరణ సాధ్యం కాదు."

కేంద్ర ప్రాయోజిత పథకాలను కూడా రాష్ట్రాల హక్కులు హరించడానికి ఆయుధాలుగా కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటున్నది. 131 కేంద్ర ప్రాయోజిత పథకాలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ పథకాలన్నిటినీ రాష్ట్రాల్లోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం ఏకరూపకంగా రూపొందించింది. కేరళ లాంటి రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల నిబంధనలను అనుసరించి వాటిని అమలుపరచడం ఆచరణ సాధ్యం కాదు. ఈ కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్రాలు తమ వాటా కింద 25 శాతం నుండి 40 శాతం వరకు నిధులు సమకూర్చాలి. అంటే కేంద్ర ప్రాయోజిత పథకాల ఖర్చులో 25 నుండి 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలన్నమాట. ఈ పథకాల్లో చాలా భాగం రాష్ట్రాల పరిధిలో ఉన్నవే. అలాంటప్పుడు ఆ అంశాల మీద కేంద్రం ఎందుకు పథకాలు రూపొందించాలన్నది ప్రశ్న. మరోవైపు కేంద్ర జాబితాలోని అంశాలపై రాష్ట్రాలు ఎందుకు ఖర్చు చేయాలి అన్నది మరో ప్రశ్న. కేంద్ర జాబితాలోని అంశాల భారాన్ని రాష్ట్రాలపై ఎందుకు మోపుతున్నారు?

ఈ విధంగా రాష్ట్రాల హక్కులపై కేంద్రం చేస్తున్న దాడి ఏదో ఆకస్మికంగా జరుగుతున్నదిగానీ లేక ఇతర అంశాలతో సంబంధం లేనిది గానీ కాదు. నేను గతంలోనే చెప్పినట్లు భారత దేశాన్ని మనుస్మృతిపై ఆధారపడ్డ ఫాసిస్టు తరహా హిందూ రాష్ట్రగా మార్చడానికి జరుగుతున్న పెద్ద కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోంది. హిందూత్వ శక్తులు అందరినీ ఇముడ్చుకునే భారత దేశం అనే భావాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకిస్తాయి. అందరినీ ఇముడ్చుకునే భారత దేశం ఏర్పాడాలన్న భావం ఏర్పడ్డంలో అంటే మన స్వాతంత్ర్యోద్యమంలో వారు ఏనాడూ భాగస్వాములు కాదు. వారు భారత దేశ భిన్నత్వాన్ని ఏనాడూ అంగీకరించరు. వారు భారత దేశాన్ని ఏక శిలాసదృశమైన హిందూరాష్ట్రగా మార్చడానికే నిరంతరం ప్రయత్నిస్తున్నారు. అందువల్లనే వాళ్లు ఫెడరల్ వ్యవస్థను నిరంతరం వ్యతిరేకిస్తారు. వాళ్ల సిద్ధాంత వేత్త, గురువు అయిన గోల్వాల్కర్ తాను "ఫెడరలిజానికి వ్యతిరేకం" అని స్పష్టంగా ప్రకటించారు. ఆయన ఇలా అన్నారు: "మన దేశ రాజ్యాంగంలో ఫెడరల్ నిర్మాణం అనే మాటను నిలువులోతు గొయ్యిలో పాతేయాలి," ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఫెడరలిజాన్ని పాతిపెట్టడానికి గొయ్యి తవ్వుతున్నది. ఆ విధంగా ఈ ప్రభుత్వం ఆయన గురువుగారు చెప్పిన దాన్ని తూ.చ తప్పక పాటిస్తున్నది. బలమైన కేంద్రం ఉండాలనీ, బలహీనమైన రాష్ట్రాలు ఉండాలనీ గోల్వాల్కర్ చెప్పారు. "ఫెడరల్ వ్యవస్థ దేశాన్ని విశ్చిన్నం చేస్తుంది, ఓటమి పాలు చేస్తుంది" అని ఆయన పేర్కొన్నాడు. అదీ ఫెడరలిజం పట్ల ఆయన వైఖరి. ఒక కేంద్రీకృత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం మన రాజ్యాంగాన్ని తిరగరాయాలని ఆయన కోరాడు. అందువల్ల ఆయన ఆలోచనల్లో అస్పష్టత ఏమీ లేదు. ఆయన ఫెరడల్ నిర్మాణాన్ని పూర్తిగా వ్యతిరేకించారు, దేశంలో అధికారం కేంద్రీకృతమైన రాజ్యం ఏర్పడాలన్నారు. ఆయన చెప్పినట్లే మోడీ నేడు ఒక దేశం – ఒక యూనిఫామ్ ఉండాలంటున్నారు. ఒక దేశం–ఒక మార్కెట్–ఒక పన్ను ఉండాలంటున్నారు. దీనివల్ల కార్పొరేట్లు చాలా సంతోషిస్తారు. ఎందుకంటే వారికి రాష్ట్రాల హద్దుల అడ్డంకులు లేకుండాపోతాయి. ఒక దేశం–ఒక పాఠ్యాంశం, ఒక దేశం–ఒక ఎన్నిక, ఒక దేశం–ఒక భాష, ఒక దేశం–ఒక మతం... ఇదీ ఆర్ఎస్ఎస్ నినాదం అయిన హిందీ–హిందూ–హిందూస్తాన్ సారాంశం. ఈ నినాదాలిన్నటిలోనూ హిందీ–హిందూ– హిందూస్తాన్ అనే నినాదం ప్రతిఫలిస్తుంది. త్వరలోనే మరోటి కూడా దీనికి జతచేరుతుంది. అది ఒక దేశం–ఒక ఎన్నిక–ఒక నాయకుడు. అంటే యూనిటరీ ప్రభుత్వం, అధ్యక్ష తరహా ప్రభుత్వం.

అందువల్ల హిందూత్వ సిద్ధాంతాన్ని జీర్ణించుకోవడం వల్లనే వాళ్లు ఫెడరలిజాన్ని వ్యతిరేకిస్తున్నారు. హిందూత్వ ఏ నాడూ దేశంలోని వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని ఆమోదించదు. ఇక్కడ హిందూత్వ అంటే మనువాద హిందూత్వ అని అర్థం. మనుస్మృతి మీద ఆధారపడిన సిద్ధాంతం అది. అందువల్ల మనువాద హిందూత్వ ఫెడరల్ నిర్మాణాన్ని సహించలేదు. వాళ్లు ఒక ఏకశిలా సదృశమైన హిందూరాష్ట్రను నిర్మించదలుచుకున్నారు. నిరంకుశ రాజ్యం మాత్రమే భారత దేశాన్ని హిందూరాష్ట్రగా పరివర్తన గావించగలదు. లౌకిక ప్రజాతంత్ర రిపబ్లిక్కును ఫాసిస్టు తరహా హిందూరాష్ట్ర పరివర్తిన గావించాలంటే వారికి ఒక ఫాసిస్టు పోలీసు రాజ్యం అవసరం. కాబట్టి రాష్ట్రాల హక్కులపై జరుగుతున్న దాడులు విడివిడిగా జరుగుతున్నవి కావనీ అవి ఒక సైద్ధాంతిక పథకంలో భాగంగా జరుగుతున్నాయనీ మనం గుర్తించాలి. అందువల్ల మనం ఈ కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంది. ఈ పని కేవలం వామపక్షాలది మాత్రమే కాదు. వామపక్షాలు నిరంతరం ఫెడరలిజాన్ని రక్షించే ఛాంపియన్లుగా నిలుస్తున్నాయి. ఇప్పుడు మన దేశ రాజ్యాంగం మౌలిక నిర్మాణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత దేశంలోని ప్రజాతంత్ర లౌకిక శక్తులన్నిటి మీద ఉంది. ఫెడరలిజం మన రాజ్యాంగంలో ఒక భాగం. ఫెడరలిజం లేకుండా భారత దేశం ఒక దేశంగా మనజాలదు. అందువల్లనే ఫెడరలిజాన్ని రక్షించుకోవడం, లౌకిక తత్వాన్ని రక్షించుకోవడం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడం ఈ రోజు అన్నిటి కన్నా దేశభక్తియుతమైన కర్తవ్యం.

(అనువాదం: ఎస్. వెంకట్రావు)

# వాయవ్య భారతంలో గ్రీకుల పాలన - ప్రభావం


రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

ఎం.వి.ఎస్.శర్మ

అలెగ్జాండర్ క్రీ.పూ. 336 నుండి 323 వరకూ పాలించాడు. ఆ కాలంలో మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్‌ల మీదుగా సింధునదీ పరీవాహక ప్రాంతం వరకూ దండయాత్ర సాగించాడు. తన స్వాధీనంలోకి వచ్చిన భూభాగాల్లో పలు సామంత రాజ్యాలను నెలకొల్పాడు. తన ప్రతినిధులను ఎక్కడికక్కడ పాలకులుగా నియమించాడు. అలెగ్జాండర్ మరణానంతరం, సామంతులుగా నియమించబడిన వారి మధ్య అనేక యుద్ధాలు జరిగాయి.

మౌర్య సామ్రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు (క్రీ.పూ. 322 నుండి 298 వరకూ పాలించాడు.) ఈ పరిస్థితిని ఒక అవకాశంగా తీసుకుని గతంలో అలెగ్జాండర్ స్వాధీనంలో ఉండిన పలు ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. అలెగ్జాండర్ అనంతరం మధ్య ఆసియాలో (ఇరాక్, సిరియా ప్రాంతంలో) బలపడిన సెల్యూకస్ అక్కడినుండి ఆఫ్ఘనిస్తాన్ ఉత్తర భాగంలోని బాక్ట్రియా వరకూ మళ్ళీ చొచ్చుకుని వచ్చాడు. అక్కడివరకూ ఉన్న భూభాగం మీద తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకున్నాడు. హిందూకుష్ పర్వతాలకు దక్షిణాన ఉన్న ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతం మీద చంద్రగుప్తమౌర్యుడి అధికారాన్ని అంగీకరించి సంధి చేసుకున్నాడు.

సింధునదికి వాయవ్య భాగంలో అప్పుడు నెలకొన్న శాంతియుత వాతావరణం గ్రీకు సంస్కృతి భారత ఉపఖండంలో ప్రవేశించడానికి దోహదం చేసింది. గ్రీకు సంస్కృతిలో భాగమైన బహిరంగ నాటకశాలలు, వ్యాయామశాలలు బాక్ట్రియా ప్రాంతంలో జరిపిన తవ్వకాలలో బైటపడ్డాయి. మౌర్య, గ్రీకు సామ్రాజ్యాల మధ్య నెలకొన్న స్నేహ సంబంధాలు ఇరుదేశాల మధ్య వ్యాపారాన్ని కూడా పెంచాయి. క్లియర్కస్ అనే గ్రీక్ తత్వవేత్త క్రీ.పూ. 275లో అశోకుడి శిలా శాసనాలను గ్రీకు భాషలోకి అనువదించి శిలలమీద చెక్కించి అయ్ ఖనుమ్ వద్ద (ఇది బాక్ట్రియా దగ్గర ఉంది) స్థాపించాడు. ఖాందహార్‌లో లభించిన అశోకుడి శిలా శాసనాలలో అప్పటి గ్రీకు రాజులలో ప్రముఖులైన అయిదుగురి పేర్లు ప్రస్తావించబడివున్నాయి.

ఈ ప్రాంతంలో జీవించే ప్రజలు అరమైక్ భాషను ఇరానిక్ యాసతో మాట్లాడేవారు. అందుకే వాయవ్య భారతంలో ఖాందహార్, తక్షశిల, తదితర ఆఫ్ఘన్ ప్రాంతాల్లో దొరికిన అశోకుడి శిలా శాసనాలు అరమైక్ భాషలో లిఖించబడివున్నాయి. సెల్యూకస్ అనంతరం ఆంటియోకస్-1, ఆంటియోకస్-2 అనే గ్రీక్ ప్రభువులు ఉత్తర-వాయవ్య ప్రాంతం మీద తమ అధికారాన్ని కొనసాగించగలిగారు. అదే కాలంలో దక్షిణావాయవ్య భాగంలో మౌర్య సామ్రాజ్య ఆధిపత్యం కొనసాగింది.




ఆంటియోకస్-2 అనంతరం స్థానిక గ్రీక్ పాలకులు తిరుగుబాటు ప్రకటించి బాక్ట్రియా రాజధానిగా స్వతంత్ర రాజ్యాన్ని ప్రకటించారు. ఆ తిరుగుబాటును ఆంటియోకస్-3 అణచివేయడానికి ప్రయత్నించినా పూర్తిగా సఫలం కాలేదు. బాక్ట్రియా స్వతంత్రతను క్రీ.పూ. 205లో అంగీకరించవలసివచ్చింది. యూథీడెమస్ రాజుగా బాక్ట్రియాలో ఏర్పడిన స్వతంత్ర రాజ్యం తన పరిధిని ప్రధానంగా ఉత్తర-వాయవ్య ప్రాంతానికే పరిమితం చేసుకుంది. ఆ తర్వాత రాజైన డెమిట్రియస్ దక్షిణావాయవ్య ప్రాంతం వైపు విస్తరణ కోసం ప్రయత్నించి కొంతవరకూ సఫలీకృతుడయ్యాడు. కపిశ (కాబూల్ లోయ) వరకూ ఆక్రమించుకున్నాడు. ఐతే అతడి అనంతరం రాజైన మిలియోక్లిస్ కాలంలో బాక్ట్రియా ప్రాంతాన్ని ఆ చుట్టుపక్కల బలంగా ఉండిన తెగలు ఆక్రమించుకున్నాయి. క్రీ.పూ. 145 నాటికి బాక్ట్రియా ప్రాంతంలోని గ్రీక్ రాజ్యం పూర్తిగా విచ్ఛిన్నమై స్థానిక తెగల చేతుల్లోకి పోయింది.

ఐతే దక్షిణావాయవ్య సింధు ప్రాంతంలోకి గ్రీక్ సేనల

చొరబాటు మాత్రం కొనసాగింది. డెమిట్రియస్, మియాండర్ (ఇతడి పేరును మిళిందుడు అని బౌద్ధ గ్రంథాల్లో ప్రస్తావించారు) బియాస్ నది (సింధు నదికి ఉపనది) ని దాటి యమున వరకూ చొచ్చుకువచ్చారు. ఈ మిళిందుడు శాకాల (నేటి సియాల్‌కోట్ – ఇది పాకిస్తాన్‌లో ఉంది) ను కేంద్రంగా చేసుకుని పాలించినట్టు పలు ప్రస్తావనలున్నాయి. ఈ సేనల చొరబాట్లు దక్షిణాన సౌరాష్ట్ర ప్రాంతం వరకూ విస్తరించాయి. అంటే దాదాపు సింధునదీ పరీవాహక ప్రాంతం యావత్తూ ఈ రాజుల అధికారంలోకి వచ్చింది. సుమారు క్రీ.పూ.145 నుండి క్రీ.శ, 50 వరకూ వాయవ్య ప్రాంతం వివిధ గ్రీక్ రాజుల ఆధిపత్యంలో కొనసాగింది. ఖాందహార్, కాబూల్ లోయ, తక్షశిల వంటి నగరాలను కేంద్రాలుగా చేసుకుని ఈ రాజులు తమ పాలనను నిర్వహించారు. దాదాపు 200 సంవత్సరాల కాలంలో 40 మందికి పైగా రాజులు అధికారం చెలాయించారు. తక్కిన భారత ఉపఖండ భూభాగం లోని రాజ్యాలతో వీరు వ్యాపార సంబంధాలను నెలకొల్పారు. (చూ. మ్యాప్ 1.1)

> ❝ ఈ గ్రీక్ రాజులు ఎవరికి వారు తమ పరిపాలనా కాలంలో తమదైన ముద్రలతో రాగి, వెండి నాణేలను ముద్రించడం ఒక ప్రత్యేకత. ఆ నాణేలు భారత ఉపఖండం మొత్తం మీద చెలామణీ అయేవి. ఈ కాలపు చరిత్రకు అవి ఒక ముఖ్యమైన ఆధారాలుగా ఉన్నాయి. ❞

ఈ గ్రీక్ రాజులు ఎవరికి వారు తమ పరిపాలనా కాలంలో తమదైన ముద్రలతో రాగి, వెండి నాణేలను ముద్రించడం ఒక ప్రత్యేకత. ఆ నాణేలు భారత ఉపఖండం మొత్తం మీద చెలామణీ అయేవి. ఈ కాలపు చరిత్రకు అవి ఒక ముఖ్యమైన ఆధారాలుగా ఉన్నాయి. (చూ. ఫిగర్ 1.1)




నాణేలను ముద్రించే సాంకేతిక పరిజ్ఞానం ఇక్కడినుంచే తక్కిన ఉపఖండానికి ఎక్కువగా విస్తరించింది. ఆ నాణేలపై ఆయా ప్రభువుల చిత్రాలను సైతం స్పష్టంగా ముద్రించగలగడం చూస్తే అక్కడి సాంకేతికత ఎటువంటి ప్రమాణాలను కలిగివుండేదో బోధపడుతుంది.




ఈ ప్రాంతంలో అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన కత్తెర, పట్టుకారు, శ్రావణం, తిరగలి వంటి పరికరాలు కూడా భారత భూభాగంలోకి ప్రవేశించాయి. గ్రీక్ సంస్కృతి ప్రభావం భారత ఉపఖండపు కళలమీద కూడా పడింది. జేగురు మట్టితో చేసిన బొమ్మలు చూస్తే అందులో స్పష్టంగా గ్రీకులు పాటించిన ప్రమాణాలు, శరీరాకృతుల కొలతలు కానవస్తాయి. (చూ. ఫిగర్ 1.2)

క్రీ.శ. రెండవ శతాబ్దంలో ప్రసిద్ధి గాంచిన గాంధార కళలో గ్రీక్–రోమన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రీకులు ప్రవేశపెట్టిన కాలెండర్‌ను ఉపయోగించడం, అందులో సౌరమానాన్ని స్వీకరించడం, దానితోబాటు గ్రీకుల ఖగోళ శాస్త్ర పరిజ్ఞానాన్ని కూడా స్వీకరించినది ఈ కాలంలోనే. ( సుమారు క్రీ.పూ.100 నాటికి) వీటిని భారత ఉపఖండంలో వివిధ ప్రాంతాలలో ఉపయోగించినట్టు పలు ఆధారాలు లభించాయి. ప్రాకృతంలో 'యవన జాతక' అనే పేరుతో క్రీ.శ.149 లో రచించిన గ్రంథం లభించింది. దాని సంస్కృత అనువాదం క్రీ.శ.270 లో స్ఫుజిధ్వజుడు అనే వ్యక్తి చేశాడు.

గ్రీకుల సంస్కృతితోబాటు వారు ఉపయోగించిన భాషలోని పదాలు కూడా భారతీయ భాషల్లో ప్రవేశించాయి. గ్రీకుల సంస్కృతిలో నాటకం ఒక ప్రధానమైన ప్రక్రియ. దానిని కూడా భారత ఉపఖండం స్వీకరించింది. మౌర్యుల కాలం వరకూ భారతీయ సమాజంలో దేవతలను మానవ ఆకృతుల్లో చూపించడం అనే ఆనవాయితీ లేదు. ఈ అలవాటును కూడా గ్రీకులనుండే ఇక్కడివారు స్వీకరించినట్టు కనిపిస్తోంది.

❈

# దళిత ఉద్యమం: కామ్రేడ్ ఆర్‌బి మోరే కృషి

**కెకె తెకేదత్**

అణగారిన తరగతుల నుంచి వచ్చిన మొట్టమొదటి విప్లవకారుడు కామ్రేడ్ రామచంద్ర బాబాజీ మోరే. 20వ దశాబ్దం ప్రారంభంలోనే మహారాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమంలో చేరిన మోరే 120వ జయంతి ఈ ఏడాది మార్చి 1వ తేదీన జరుగుతుంది. ఈ సందర్భంగా కామ్రేడ్ మోరే చేసిన కృషి ఈనాటికీ దళిత ఉద్యమానికి ఏ విధంగా కరదీపిగా ఉపయోగపడుతుందో మనం అర్థం చేసుకోవడం అవసరం.

2022 జూలై 17-18 తేదీల్లో జరిగిన దళిత సోషణ్ ముక్తి మంచ్ కార్యవర్గ సమావేశంలో వార్షిక ప్రణాళిక రూపొందించుకొని, 14 ప్రధాన కర్తవ్యాలు నిర్వహించాలని తీర్మానించుకుంది. అందులో మొదటిది ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి ఉత్సవాలు జరపటం. వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి దీనిని ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. రెండోది, కామ్రేడ్ ఆర్‌బి మోరే వారసత్వ స్మారకోత్సవం నిర్వహించాలనే సూచన.

ఈ మధ్య కాలంలో అంబేద్కర్‌కి అనేక రకాల విశేషణాలు చేరుస్తున్నారు. అందులో ఒకటి క్రాంతి సూర్య. ఇవన్నీ అణగారిన తరగతుల స్వేచ్ఛ కోసం అహరహం పనిచేసిన మహామహుని గురించిన సరైన వర్ణనలు. వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమం కోసం పనిచేస్తున్న వారందరికీ ఇప్పటికీ ఆయన స్ఫూర్తిదాయకం. కామ్రేడ్ మోరే అంబేద్కర్ గురించి ఏమన్నారో ఈ సందర్భంలో ఒకసారి గుర్తుచేసుకుందాం. 1953 డిసెంబర్ 23న కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరోకి 'అంటరానితనం, వర్ణ వ్యవస్థ'పై లేఖ రాస్తూ, "మన దేశంలో బ్రిటిష్ ప్రభుత్వంతో పాటుగా బూర్జువా ప్రజాతంత్ర సిద్ధాంతం కూడా వచ్చింది. అది పాతకాలం నాటి భూస్వామ్య సిద్ధాంతంపై పోరాటం మొదలు పెట్టింది. రాజారాం మోహన్ రాయ్, మహాత్మా పూలె,



రనడే, అగార్కర్, మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌లు ఈ సామాజిక మితవాద భావాలకు వ్యతిరేకంగా శక్తివంతంగా పోరాడారు. అందువలన అది చాలావరకు బలహీన పడిందనడంలో సందేహం లేదు. అస్పృశ్యతకి వ్యతిరేకంగా పోరాడటంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పాత్ర అద్వితీయంగా, మిలిటెంట్‌గా, ఏమాత్రం రాజీ లేకుండా సాగింది. అస్పృశ్యతకు మూలకారణం వర్ణ వ్యవస్థ అని ఆయన మొట్టమొదటిసారిగా చూపించారు. దాన్ని సమూలంగా కూల్చి వేయాల్సిందేనని ఘంటాపథంగా చెప్పారు. హిందూ శాస్త్రాలన్నిటినీ నిర్దాక్షిణ్యంగా ఏకిపారేశారు. అందువల్ల అణగారిన తరగతులన్నిటికీ మార్గదర్శిగా నిలిచాడు." .. "ఆయన పరిమితులు ఏవైనప్పటికీ, ఆయన మానవతావాదం, సెంటిమెంట్లతో పోకుండా అస్పృశ్యులను మేల్కొలిపారు. వారిలో ఆత్మగౌరవాన్ని నింపారు. తమ మానవ హక్కుల కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడడం వారికి నేర్పించారు. అస్పృశ్య సమస్య స్థాయిని, అడుక్కునే, లేదా అర్థించే స్థాయి నుంచి పోరాటం చేసే, ప్రకటన చేసే స్థాయికి చేర్చారు." (సత్యేంద్ర మోరే రాసిన ఆర్‌బి మోరే జీవిత కథ నుండి)

**రామచంద్ర మోరే - ఒక ధ్రువతార**

రామచంద్ర మోరే మొదటి నుండి అంబేద్కర్ అనుయాయుడు. అతడే డాక్టర్ అంబేద్కర్‌ని చారిత్రికంగా ప్రసిద్ధికెక్కిన మహారాష్ట్రలోని సముద్ర తీరంలో ఉన్న మహద్ పట్టణంలోని చౌదర్ తలావ్ (చెరువు నీటికై సత్యాగ్రహం జరిగినది) కి 1927లో వెళ్ళడానికి వ్యక్తిగతంగా ప్రోత్సహించారు. కానీ ఈనాడు మోరేని చాలామంది అంబేద్కర్ ప్రధానమైన అనుయాయుడిగా గుర్తించడం లేదు. ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కడం లేదు. ఆయన ఒక ధ్రువతార. స్వయం ప్రకాశకుడు. అంబేద్కర్ ఉద్యమ పరిమితులు గుర్తించిన వ్యక్తి. దానిని కార్మికోద్యమంతో, కార్మికోద్యమ తాత్వికతతో అనుసంధానం చేసిన వ్యూహకర్త. 1928లో మహారాష్ట్ర కమ్యూనిస్టు పార్టీలో చేరిన మొదటి తరం దళితులలో మోరే ఒకరు. దళితుల స్వేచ్ఛ కోసం చేసిన పోరాటాలలో యువకులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన వారిలో ప్రధానంగా గుర్తించవలసిన వ్యక్తి. అంబేద్కర్ జీవితం లాగే మోరే జీవితం కూడా తన తండ్రి బ్రిటిష్ వారి మహర్ రెజిమెంట్ సైనిక జీవితంలో భాగంగా నేర్చుకున్న ఆంగ్ల విద్యతో ముడిపడి ఉంది. మహర్లు అంటరానివారు. సంప్రదాయకంగా వారు చనిపోయిన జంతు కళేబరాలను వలిచే పనిచేసేవారు.

మార్క్స్ ఇలా చెప్పాడు: "భారతదేశంలో ఇంగ్లాండ్ రెండు పనులు చేయాల్సి ఉంది. ఒకటి నాశనం చెయ్యడం, రెండోది పునర్నిర్మించడం. ఒకటి ఆదికాలపు ఆసియా తరహా సమాజాన్ని ధ్వంసం చెయ్యడం. రెండు ఆసియాలో ఆధునిక సమాజ సమాజ నిర్మాణానికి పునాదులు వేయడం." సైన్యంలోకి మనుషులను రిక్రూట్ చేసుకుంటున్న సందర్భంగా బ్రిటిష్ వారు మన దేశంలోని మహర్ల ధైర్యసాహసాలను గుర్తించారు. వాళ్ళను అధిక

సంఖ్యలో రిక్రూట్ చేసుకుని మహార్ రెజిమెంట్‌ని ఏర్పాటు చేశారు. 1818 జనవరి 1వ తేదీ బ్రిటిష్ మహార్‌జర్‌లకీ, పీష్వాలకీ మధ్య భీమాకోరేగాం యుద్ధం జరిగినప్పుడు, మహర్లను సైన్యంలో చేర్చుకున్నందుకు బ్రిటిష్ వారు చింతించాల్సిన పనిలేకపోగా బాగా లాభపడ్డారు. పదివేల మంది పీష్వాలు ఆ యుద్ధంలో పాల్గొనగా 900 మంది మహర్లు మాత్రమే పాల్గొని పీష్వాలను చిత్తుగా ఓడించారు.

సైన్యంలో చేర్చుకున్న బ్రిటిష్ వారు, “మహర్లకు మెట్రికులేషన్ వరకు ఆంగ్లం, భూగోళం, విజ్ఞాన శాస్త్రాలలో శిక్షణనిచ్చి, విద్యావంతులను చేశారు. ఈ విధంగా విద్యావంతులు కావడం వలన స్వేచ్ఛను ఎలా పొందగలరో తమిళనాడు దళిత ఉద్యమ చరిత్ర తెలియచేస్తుంది. అస్పృశ్యులు ఇవి రామస్వామి నాయకర్ నాయకత్వంలో ఒక ఉద్యమంగా సంఘటితం కాకముందే, దళిత ఉద్యమం ఎగసిపడక ముందే, వేలాది మంది నాడార్లు అక్కడ క్రిస్టియన్ మతం స్వీకరించారు. అది వారికి ప్రయోజనకరంగా మారింది. వారు ఆంగ్ల విద్యనభ్యసించ గలిగారు. ఫలితంగా సాధికారతను పొందగలిగారు. పంతొమ్మిదో శతాబ్దంలో, మోరే తాత శివరాం, అతని తమ్ముడు తనజీ, మహారాష్ట్రలోని సముద్రతీర జిల్లా కొలాబాలోని లోనేరి గ్రామాన్ని వదిలిపెట్టి, జీవనం వెతుక్కుంటూ వలస వెళ్ళవలసి వచ్చింది. ఆ క్రమంలో వారు రోడ్లు వేయడం, రాళ్లు కొట్టడం, వంటి అనేక రకాల పనులు చేసుకుంటూ ఒక చోటి నుంచి మరో చోటికి సంచరిస్తూ ఉండేవారు. అలా సంచరిస్తూ వారు ఖండాల చేరుకున్నారు. అప్పుడక్కడ రైల్వే లైన్ వేసే పని జరుగుతుండేది. అక్కడ వారికి మారిషస్‌లో మంచి పనులు దొరుకుతాయని చెప్పే ఒక రిక్రూటింగ్ ఏజెంట్ పరిచయమయ్యారు. శివరాం, తానాజీలు మూడేళ్ళ కాంట్రాక్టుకి బానిసగా పని చేయడానికి అంగీకరించి వారితో మారిషస్ వెళ్లారు. శివరాం మూడేళ్ళ తరువాత తిరిగి వచ్చి రాయగడ్‌లోని దాసగవ్ పట్టణంలో స్థిరపడ్డారు. అది మహద్‌కి పది కిలోమీటర్ల దూరంలో ఉంది. అరేబియా సముద్రంలో ఒక రేవు పట్టణం అయినందువల్ల అక్కడున్న వారికి మహర్ సైనికులతో సంబంధాలు ఏర్పడేవి. మహర్ సైనికులు సెలవులకు ఇళ్లకు వెళ్ళేటప్పుడు ఆ రేవులో దిగేవారు. మోరే ఆంగ్లం నేర్చుకో కలగడానికి గల నేపథ్యం ఇదే.

శివరాం కొడుకు బాబాజీ (రామచంద్ర తండ్రి) తన కొడుకులు, లక్ష్మణుడు, రామచంద్రులకి చదువు చెప్పించారు. లక్ష్మణుడు ఏడవతరగతి వరకు చదివారు. ఆ ప్రాంతంలోని బడిలో మొదటి దళిత ఉపాధ్యాయుడయ్యారు. తుడిల్ గ్రామంలో బడిలో పనిచేయడం మొదలు పెట్టారు. అప్పుడతని జీతం నెలకు ఏడు రూపాయలు. రామచంద్ర దళితుల కోసం ముఖ్యంగా మహర్ల కోసం ఏర్పడిన దళితవాడలో తన యవ్వనం గడిపారు. అయితే ఆయన తెలివితేటలు, చుట్టూ ఉన్న దళితులను ఏ సమస్య వచ్చినా అతని వైపు చూసేటట్టు చేసాయి.

> **“ మోరే పట్ల అభిమానం గల ఉన్నత కుల బడి పంతులు అతనిని స్కాలర్‌షిప్ పరీక్షకు కూర్చోమని సలహా ఇచ్చారు. పరీక్ష 1914 సెప్టెంబర్లో. అప్పటికి మోరేకి 11 ఏళ్ల వయసు. పరీక్ష రాయడానికి అతడు జిల్లా కేంద్రం అలీబాగ్‌కి వెళ్ళాలి. అయితే తీరా అక్కడ ఇతర విద్యార్థులతో కలిసి కూచొని పరీక్ష రాసేందుకు అనుమతి దొరక లేదు. అతనికో ప్రత్యేకమైన చెక్క బల్ల వేయించారు. తన ఆత్మ కథలో మోరే అలీబాగ్‌లో అస్పృశ్యత ఎంత కఠినంగా అమలయ్యేదో రాశారు. ”**



**1946లో బొంబాయిలోని సిద్ధార్థ కళాశాలతో డాక్టర్ అంబేద్కర్‌తో ఆర్‌బి మోరే**

రామచంద్ర తెలివితేటలకు నిదర్శనాలుగా ఆయన యవ్వనంలో జరిగిన రెండు సంఘటనలు చెప్పుకోవచ్చు. ఒకసారి అతని పట్ల అభిమానం గల ఉన్నత కుల బడి పంతులు రామచంద్రని స్కాలర్‌షిప్ పరీక్షకు కూర్చోమని సలహా ఇచ్చారు. పరీక్ష 1914 సెప్టెంబర్లో. అప్పటికి రామచంద్రకి 11 ఏళ్ల వయసు. పరీక్ష రాయడానికి అతడు జిల్లా కేంద్రం అలీబాగ్‌కి వెళ్ళాలి. అయితే తీరా అక్కడ ఇతర విద్యార్థులతో కలిసి కూచొని పరీక్ష రాసేందుకు అనుమతి దొరక లేదు. అతనికో ప్రత్యేకమైన చెక్క బల్ల వేయించారు. తన ఆత్మ కథలో రామచంద్ర అలీబాగ్‌లో అస్పృశ్యత ఎంత కఠినంగా అమలయ్యేదో రాశారు. అంటు కోకుండా ఉండడానికి ప్రశ్న పత్రాలు కూడా ఆయన పైకి విసిరేసేవారట.

అయితే ప్రధానమైన విషయం ఆ పరీక్ష రాయడానికి 200 మంది విద్యార్థులు హాజరైతే, రామచంద్ర మొదటి ర్యాంక్ సాధించారు. అతనికి నెలకు రూ 5/- స్కాలర్‌షిప్ మంజూరు అయింది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం అనే చెప్పాలి. ఆనాటి ఉపాధ్యాయుల జీతాలతో పోల్చి చూస్తే మనకా విషయం స్పష్టమవుతోంది. ఈ స్కాలర్‌షిప్‌తో రామచంద్ర మహద్‌లోని ఆంగ్ల పాఠశాలలో చదవవచ్చు. కానీ అక్కడి ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు బడిలో చేర్చుకోడానికి అంగీకరించలేదు. ఆ బడి భవన యజమాని బ్రాహ్మణులని సాకు చూపారు. దళితుడిని గనక బడిలో చేర్చుకుంటే బడిని అక్కడి నుంచి మార్చేయాల్సి ఉంటుందని సంజాయిషీ ఇచ్చుకున్నారు.

రామచంద్ర తిరిగి ఊరికి చేరుకున్నారు. ఇతర అన్నదమ్ములతో కలిసి ఆవులను సాకడం తదితర పనులు చేయడం మొదలు పెట్టారు. ఒకరోజు ఆ ప్రాంతానికి వచ్చిన ఇద్దరు సామాజిక కార్యకర్తలు రామచంద్రుడి గురించి

> **“ ఒక తెలివైన మహర్ కుర్రాడిని ప్రభుత్వ పాఠశాలలో చేరనివ్వలేదనే ఈ వార్త అన్ని పత్రికలలో అచ్చయ్యింది. ఫలితంగా ప్రధానోపాధ్యాయుడు రామచంద్రని పిలిచి బడిలో చేరాలని చెప్పాడు. అతనికి కావలసింది కూడా అదే. అయితే రామచంద్ర వేరుగా, ఎవరినీ అంటుకోకుండా కూచోవాలన్నది ఒప్పందం. ”**

విన్నారు. రామచంద్రుడిని కలిసి మాట్లాడిన తరువాత వారు బడి యాజమాన్యంపై, తన ఫిర్యాదును బహిరంగ పరచమని కోరారు. వారు ఒక పోస్ట్ కార్డుపై వివరాలు, అడ్రస్ రాసి ఇచ్చారు. రామచంద్ర దీనిపై సంతకం చేసి పోస్ట్ డబ్బాలో వేశారు.

ఒక తెలివైన మహర్ కుర్రాడిని ప్రభుత్వ పాఠశాలలో చేరనివ్వలేదనే ఈ వార్త అన్ని పత్రికలలో అచ్చయ్యింది. ఫలితంగా ప్రధానోపాధ్యాయుడు రామచంద్రని పిలిచి బడిలో చేరాలని చెప్పాడు. అతనికి కావలసింది కూడా అదే. అయితే రామచంద్ర వేరుగా, ఎవరినీ అంటుకోకుండా కూచోవాలన్నది ఒప్పందం.

అందువలన రామచంద్ర బడికి బొమ్మలు గీయించే, డ్రిల్ నేర్పించే తరగతులుకు హాజరవడం నిషిద్ధం. అక్కడ ఒకరినొకరు తాకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, ఆ పీరియడ్స్ మినహాయించి మిగిలిన తరగతులకు హాజరు అయ్యేవాడు. బడి లేని సమయాల్లో మహద్ పట్టణ వీధుల్లో గడిపేవాడు.

ఇక ఆయన తెలివితేటలు బయటపడ్డ రెండో సంఘటన. మూరే మహద్ పట్టణంలో నివసిస్తున్న తన తోటి మహర్ల కష్టసుఖాలు అడిగి తెలుసుకునే వారు. అటువంటి ఒక సందర్భంలో మహద్ పట్టణానికి కాలక్షేపానికి వచ్చే మహర్ సైనిక పెన్షనర్ల కష్టాలు ఆయన దృష్టికి వచ్చాయి. వారిని ఏ హోటల్‌లో కూడా నీరు తాగనిచ్చేవారు కాదు. ఆనాడు బకెట్ నీరు ఒక పైసా ఇచ్చి ఆ హోటల్ వాళ్ళు కొనుక్కునే వారు. మహర్లకు ఉచితంగా నీరు ఇవ్వడానికి వారు నిరాకరించే వారు. వాళ్ళకి అసలు హోటల్‌లో అడుగు పెట్టడానికి అర్హత లేదు.

రామచంద్ర తన స్వగ్రామం దాసగవ్ వెళ్ళినప్పుడు ఈ విషయాన్ని గ్రామస్థులతో చర్చించారు. మహర్వాడలో సమావేశం వేసి ఈ విషయం చర్చించారు. చుట్టుపక్కల గ్రామాలలో నివసించే మహర్‌లు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆ సమావేశంలో మహర్లు మహద్‌లో ఒక హోటల్ని తెరవాలని అక్కడ తేనీరు కప్పు ఒక పైసాకి అందరికీ అందించాలని, ప్రత్యేకంగా మహర్లకి మంచినీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు.

ఫలితంగా మహద్ పట్టణంలో మొదటి మహర్‌ల ఫలహారశాల మొదలైంది. దాని యజమాని మోహాప్రేకర్. ఆ హోటల్లో అనుకున్నట్టే మహర్లకి పైసాకి ఉచితంగా మంచి నీళ్లే కాదు, రామచంద్రకి ఇతర మహర్లను కలిసేందుకు, వారికి అవసరమైన అర్జీలు ఆంగ్లంలో రాసిచ్చేందుకు స్థలం కూడా సమకూరింది. ప్రధానంగా ఆ హోటల్ సమావేశాలకు కేంద్రంగా మారింది. భవిష్యత్తులో మహర్లు తమ హక్కుల సాధనకు ఏర్పరచుకోబోయే సంఘానికి కేంద్రంగా తయారైంది.

ఆ తరువాతి కాలంలో ఒక ఉన్నత కుల జమీందారు హోటల్ యజమానిని ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తే, మోరే తానే ఆ హోటల్ కొనుక్కొని, దానికి ఆర్‌బి మోరే విశ్రాంతి గృహం అని నామకరణం చేశారు. ఇదంతా మోరే తన వయసు ఇరవై దాటక మునుపే చేశారు. అపవిత్రమౌతారని డ్రిల్, డ్రాయింగ్ తరగతులకు హాజరు కానివ్వని ఒక విద్యార్థిలో దాగున్న అద్భుత శక్తిని ఈ సంఘటనలు తెలియజేస్తాయి.

ఆర్‌బి మోరే జీవిత కథని అతని కుమారుడు సత్యేంద్ర మోరే, 'ఆర్ బి మోరే–దళితులకు కమ్యూనిస్టు ఉద్యమానికి వారధి' అనే పేరుతో రాశారు. అందులో మోరే స్కాలర్‌షిప్ పరిమితి మూడేళ్ళ కాలం ముగిసిన వెంటనే అతని చదువు బలవంతంగా ఆపేశారని రాశారు. అతని స్కాలర్‌షిప్ డబ్బులను తండ్రి చనిపోయిన తర్వాత తల్లి ఆశ్రయించిన పినతండ్రి వాడుకున్నాడనీ, చాలా రోజుల తర్వాత మోరే గ్రహించారుట. తన ఇంటి నుండి పూణేకి ఎలా పారిపోయిందీ, ఆ తరువాత ఖిడ్కి ఎలా చేరుకుందీ, అక్కడి జీవితం, భజన చేయడానికి ఒక గుడిలో కుదరడం, అస్పృశ్యుడు కావడం వలన దూరంగా ఉండి భజన పాటలు పాడమని వారు కూడా అనడం, ఆ తర్వాత ముంబై చేరి 1920లో బాలగంగాధర తిలక్ అంతిమ యాత్రలో పాల్గొనడం, బొంబాయిలో తన దగ్గర ఉన్న డబ్బులు కాస్తా పోగొట్టుకోవడం, డాక్‌లో బరువులు మోసే కూలి పనులు చేయడం, చివరిగా తిరిగి ఖిడ్కి చేరుకోవడం, దాసగమ్‌లో చదువు పూర్తి చేయడం, అన్నీ ఆత్మవిమర్శనా పూర్వకంగా, యధాతథంగా వివరించారు.

### ఎస్‌కె బోలె తీర్మానం

ప్రభుత్వ సంస్థలలో, అన్ని బహిరంగ ప్రదేశాలలో, నీళ్ల ట్యాంకులు అస్పృశ్యులకి అందుబాటులో ఉండాలని 1923లో రావు బహదూర్ సీతారాం బోలె బొంబాయి ప్రాంతీయ శాసనసభలో తీర్మానం ఆమోదింపచేశారు. బ్రిటిష్ ప్రభుత్వం అస్పృశ్యుల పట్ల చూపిన సానుకూల వైఖరిని ఇది తెలియజేస్తుంది. వారు కనీస మానవ సమానతను అమలు చేశారు.

ఈ విషయం మోరే దృష్టికి రాగానే, తన కులం వారితో మహర్వాడలో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశానికి చుట్టుపక్కల అనేక గ్రామాల నుండి కూడా మహర్‌లు హాజరయ్యారు. అక్కడ మారుతి అగ్వనే ఒకరు మహద్ పట్టణంలో 1923 చట్టం అమలు చేయాలని ఒత్తిడి తేవడానికి డాక్టర్ అంబేద్కర్ అధ్యక్షతన ఒక సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ సూచనను అందరు ఏకగ్రీవంగా ఆమోదించారు.

1915లో అప్పటికి 12 ఏళ్ల వయసులో ఉన్న రామచంద్ర, తక్కువ సమయమే అయినప్పటికీ, అంబేద్కర్‌ని మొదటిసారిగా చూశారు. అంబేద్కర్ అప్పుడే కొలంబియాలో ఎంఏ, పిహెచ్‌డి, ముగించుకుని క్రాఫోర్డ్ మార్కెట్లోని సివిల్ లైన్స్‌లో మహర్‌ల చేత సన్మానం అందుకోబోతున్నారు. మోరేలోని రాజకీయ చైతన్యం ఆ చిన్న వయసులోనే ఆ సమావేశానికి తాను తప్పనిసరిగా హాజరు కావాలనుకునేటట్టు చేసింది.

ఆ సమావేశం మోరేపై చెరగని ముద్ర వేసింది. అక్కడ అంబేద్కర్ ఉపన్యాసం ఇవ్వడానికి నిరాకరించారు. అందుకు బదులుగా వచ్చిన వారితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడటానికి సుముఖత చూపారు. వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆ వినయం మోరేని ఎంతగానో ఆకర్షించింది. బాగా ప్రభావితం చేసింది.

మారిన భౌతిక పరిస్థితులు కూడా మహర్‌లు తమ ఉనికిని బలపరచుకోడానికి

సహకరించాయి. ఆనాడు మహద్, బొంబాయిల మధ్య రోడ్డు మార్గం ఏర్పడింది. బస్సులు పడ్డాయి. కానీ ప్రైవేటు వాహనాలు మహర్లను తమ వాహనాల్లో ఎక్కించుకోడానికి తిరస్కరించేవి. అపుడు మోరే ప్రైవేటు వాహనదారులకు వ్యతిరేకంగా ఒక సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆ సేకరించిన సంతకాలను జిల్లా కలెక్టర్‌కి సమర్పించారు. దానితో సమస్య పరిష్కరించబడింది. ప్రైవేటు వాహనాల్లో మహర్లను అనుమతించడం మొదలైంది.

**అంబేద్కర్ సందర్శనకు సన్నాహాలు**

1924, మే నెల సెలవులలో 21 ఏళ్ల మోరే ముంబై వెళ్లారు. అనంత రావు చిత్రే అనే సామాజిక కార్యకర్త సహాయంతో డాక్టర్ అంబేద్కర్‌ని కలుసుకున్నారు. అంబేద్కర్ మహద్ రావడానికి ఒప్పుకున్నారు గాని తేదీ ఖరారు చేయలేదు.

అంబేద్కర్ హాజరవడానికి అంగీకరించిన వెంటనే సమావేశం ఏర్పాట్లు మొదలు పెట్టినట్టు మోరే తన ఆత్మ కథలో రాసుకున్నారు. పరేల్‌లోని దామోదర్ హాల్‌లో సంత్ తుకారాం నాటకాన్ని ప్రదర్శించి నిధులు సేకరించారు. ముంబైలోని మిలిటరీ సివిల్ లైన్స్‌లో నివాసం ఉంటున్న మహర్లకి టికెట్‌లు అమ్మారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా 1927 మార్చిలో గాని చాదర్ తాల్‌లో మహాసభ, సత్యాగ్రహం ఏర్పాటు చేయడం కుదరలేదు.

ఈలోగా బోలె గారు 1923లో చేసిన తీర్మానం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా మహర్లు, అంటరానివారు, అభివృద్ధి కాముకులు ఈ చట్టం అమలు చేయడం పట్ల ఉత్సాహం చూపారు. మనగామ్ తాలూకాలోని గోరేగావ్ అనే వాణిజ్య పట్టణంలో నివసించే ప్రఖ్యాత కార్మిక నాయకుడు ఎన్ఎం జోషి ఈ చట్టాన్ని మహర్లకు, చర్మాలకు బోధించడం మొదలు పెట్టారు. మహర్లు చట్టం అమలుకు సూచనగా తమ తమ పట్టణాలలోని చెరువులలో నీటిని తీసుకోవాలని నిర్ణయించారు. రామచంద్ర చాందోర్కర్ అనే దళిత నాయకుడు ఏకంగా చెరువులో దూకారు.

ఇది మరాఠాలకు, ఇతర దళితేతరులకు ఆగ్రహం తెప్పించింది. వారు దళితుల ఇళ్ళు, ఆస్తులు ధ్వంసం చేశారు. దళితులు ఈ విషయాన్ని మహర్ సమాజ్ సేవా సంఘ్‌కి ఫిర్యాదు చేశారు.

ఆ సమయంలో మోరే ముంబైలో ఉన్నారు. సంఘాన్ని సమావేశ పరిచి దాడులను ఖండించే తీర్మానం ఆమోదింపజేశారు. బాధితులకు

“ అంబేద్కర్ హాజరవడానికి అంగీకరించిన వెంటనే సమావేశం ఏర్పాట్లు మొదలు పెట్టినట్టు మోరే తన ఆత్మ కథలో రాసుకున్నారు. పరేల్‌లోని దామోదర్ హాల్‌లో సంత్ తుకారాం నాటకాన్ని ప్రదర్శించి నిధులు సేకరించారు. ముంబైలోని మిలిటరీ సివిల్ లైన్స్‌లో నివాసం ఉంటున్న మహర్లకి టికెట్‌లు అమ్మారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా 1927 మార్చిలో గాని చాదర్ తాల్‌లో మహాసభ, సత్యాగ్రహం ఏర్పాటు చేయడం కుదరలేదు. ”



కుటుంబంతో మోరే (ఎడమవైపు చివర)

సహాయ చర్యలు చేపట్టారు. వ్యక్తిగతంగా గోరేగామ్ చేరుకొని నిధులు అందించారు.

అలాగే 1926 డిసెంబర్ 4న కూడా దశగావ్ లోని ధర్మశాల గ్రౌండ్‌లో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి దళితేతరులు కూడా ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేటట్టు జాగ్రత్తలు తీసుకున్నారు. నిజానికి ఆ సమావేశానికి అధ్యక్షత వహించింది కూడా దళితేతరుడే.

ఉపన్యాసాలు ముగిసిన తరువాత అందరూ చెరువులలో నీటిని వాడడానికి బయలుదేరారు. ఆశ్చర్యంగా ఈ కార్యక్రమం అంతా సజావుగా సాగింది. అయితే అందుకు కారణం మోరే చేసిన ప్రయత్నాలే. విస్తృతంగా పాంప్లేట్లు పంచడం, చిన్న చిన్న సన్నాహక సమావేశాలు వేయడం వగైరా. 1927 మార్చి 19-20 లలో జరిగిన మహద్ సత్యాగ్రహంగా చెప్పుకునే ప్రఖ్యాత సత్యాగ్రహానికి ముందు మూడు నెలలపాటు విస్తృతమైన సన్నాహాలు జరిగాయి. చౌదర్ తాల్ వద్ద జరిగిన ఈ ప్రఖ్యాత మహర్ సత్యాగ్రహంలో 5,000 మంది దళితులు పాల్గొన్నారు. అప్పటికి రామచంద్ర మోరే వయసు 23 ఏళ్లు.

1927 మార్చి 20న జరిగిన ఈ చారిత్రాత్మక సత్యాగ్రహం, ఆ తర్వాత డిసెంబర్లో వేలాది మంది అనుయాయుల మధ్య జరిగిన బహిరంగ సభలో మనుస్మృతి దగ్ధం సందర్భంగా జరిగిన ప్రదర్శనలతో మోరేకి దళితుల విమోచన పట్ల ఉన్న నిబద్ధతను, శక్తి సామర్థ్యాలను అంబేద్కర్ గ్రహించారు. దాంతో అంబేద్కర్‌కి మోరే నమ్మకస్తుడైన అనుయాయుడయ్యారు. అతనితో పాటు ముంబైలోని పరేల్‌లో నాయి గౌవ్ కూడా అతనితో ఉండడం మొదలు పెట్టారు. అంబేద్కర్ వెలువరించే పత్రికకి, ఇతర కార్యక్రమాలకి సహకరించేవారు. ఇద్దరు కలిసి ఫలహారాలు

> అంబేద్కర్‌కి మోరే అంటే ఎంత గౌరవం ఉండే దంటే, ఆ తరువాత వచ్చిన ఎన్నికలలో ఆయన పార్టీ తరపున ముంబై ప్రాంతీయ కౌన్సిల్‌కి మోరే పోటీ చేస్తానంటే, కమ్యూనిస్టుగా కొనసాగుతున్నప్పటికీ టికెట్ ఇస్తానని అన్నారు. అయితే మోరే ఆ ప్రతిపాదనని సున్నితంగా తిరస్కరించారు.

చేసేవారు. పక్కనున్న ఇరానీ టీ కొట్టుకు వెళ్లి టీ తాగేవారు.

### బాబాసాహెబ్ అంబేద్కర్–కమ్యూనిస్టులు

కమ్యూనిస్టు పార్టీలో చేరక ముందు మోరే బాబాసాహెబ్ అంబేద్కర్‌తో అనేక దఫాలు చర్చలు జరిపారు. ఆ సమయంలో కమ్యూనిస్టు ఉద్యమ స్వభావం, దళితులు ఆ ఉద్యమంతో కలిసి పనిచేస్తే వచ్చే ప్రయోజనాల గురించి వివరించారు. మానవజాతి నిర్వహించే ఈ మహత్తర పోరాటంలో కమ్యూనిస్టు ఉద్యమంతో కలిసి మోరే పని చేయాలనుకుంటే తాను అడ్డుపడబోనని అంబేద్కర్ అన్నారు. బ్రాహ్మణుల నాయకత్వంలోని కమ్యూనిస్టు ఉద్యమంలో మోరే సముచిత గౌరవప్రద స్థానాన్ని పొందగలగాలని ఆశిస్తున్నట్టు తెలియచేశారు.

అంబేద్కర్‌కి మోరే అంటే ఎంత గౌరవం ఉండేదంటే, ఆ తరువాత వచ్చిన ఎన్నికలలో ఆయన పార్టీ తరపున ముంబై ప్రాంతీయ కౌన్సిల్‌కి మోరే పోటీ చేస్తానంటే, కమ్యూనిస్టుగా కొనసాగుతున్నప్పటికీ టికెట్ ఇస్తానని అన్నారు. అయితే మోరే ఆ ప్రతిపాదనని సున్నితంగా తిరస్కరించారు.

చరిత్రలోని కొన్ని చెదురుమదురు ఘటనలను ఉపయోగించుకుని అంబేద్కర్ కమ్యూనిస్టు వ్యతిరేకి అనడం పరిపాటిగా మారిపోయింది. నిజానికి దళితులు, కమ్యూనిస్టులు కలవకుండా కమ్యూనిస్టు వ్యతిరేక మేధావులు పన్నిన పన్నాగాలు అవి. అయితే ఈ ప్రచారం వలన పడిన గండి పూడ్చడానికి, మరమ్మత్తు చేయడానికి చేసే ప్రయత్నాలలో కొందరు కమ్యూనిస్టులు కూడా అనవసరమైన 'ఆత్మ విమర్శలు' చేసుకున్నారు. అటువంటి ఆత్మవిమర్శలలో ఒకటి నాసిక్ సత్యాగ్రహం సందర్భంగా రామ మందిరంలోకి వెళ్ళడానికి చేసే ప్రయత్నాలకు కమ్యూనిస్టులు దూరంగా ఉన్నారు అని అనడం. కొంత నిశితంగా పరిశీలిస్తే, కాలారామ్ మందిర ప్రవేశం చేయాలన్న నిర్ణయం 1929 అక్టోబర్‌లో జరిగింది. అప్పుడు అంబేద్కర్ రౌండ్ టేబుల్ సమావేశానికి ఇంగ్లాండ్ వెళ్లాల్సి ఉంది. 1929 మార్చి 20న ప్రముఖ కమ్యూనిస్టు నాయకులందరినీ అరెస్టు చేసిన విషయం ఈ విమర్శలు చేసిన మేధావులు మరిచినట్టున్నారు. ఆ నాడు 31 మంది కమ్యూనిస్టు నాయకులు జైలు పాలయ్యారు. అందులో ముంబై నగరంలో ఉండే ఎస్ ఏ డాంగే, ఎస్ వి ఘాటే, కె ఎన్ జోగ్లేకర్, డాక్టర్ జి అధికారి, ఆర్ ఎస్ నింబకర్, ఎన్ ఎన్ మిరాజ్‌కర్, సౌకత్ ఉస్మాన్, ఎంజి దేశాయ్, ఎస్‌ఎచ్ జాబ్ వాలా, జిఆర్ కాస్లే, అర్జున్ ఆత్మారాం ఆల్వే ఉన్నారు. కాలారామ్ మందిర్‌కి ఉన్న నాలుగు ప్రధాన ద్వారాలలో కచ్చు మధుజి సాల్వి నాయకత్వంలో ఉత్తర ద్వారం నుండి ప్రవేశించిన విషయాన్ని ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి. ఆ సమావేశానికి మద్దతుగా ఆర్ బి మోరే అనేక సమావేశాలు నిర్వహించారు. నిధులు సమకూర్చారు.

ఇక కమ్యూనిస్టులు మిల్లులలో అనుసరిస్తున్న అస్పృశ్యత పట్ల స్పందించలేదని నిందిస్తూ విమర్శించడంలో కూడా పస లేదు. 1928లో జరిగిన సమ్మెలో 9వ డిమాండ్ అదే. 'కార్మిక మాసపత్రిక' అనే బ్రిటిష్ పత్రిక ఈ విషయాన్ని నమోదు చేసింది. 1928లో ఆరునెలలపాటు ఘోరాతి ఘోరంగా సాగిన పోరాటంలో ఈ డిమాండ్ మన కమ్యూనిస్టు వ్యతిరేక మేధావుల కళ్ళకు కనిపించదు.

నిజానికి అంటరానివారి బాధలను ఎంతగానో అర్థం చేసుకుని, రాజకీయ, తత్వశాస్త్రాలలో లోతైన అధ్యయనం చేసిన, అవగాహన కలిగిన అంబేద్కర్‌ను కమ్యూనిస్టు వ్యతిరేకి అనడం దారుణం. ఆయన సోషలిస్టు రాజ్యాధిపత్యంతో సహా ఆర్థిక ఆలోచనల మూలాలు – భూమి జాతీయం చేయడం, పేదలకు అంటరాని వారికందరికి ప్రభుత్వం గృహవసతి కల్పించాలని డిమాండ్ చేయడం, దేశంలో ఏవగింపు కలిగించేంత అసమానతలు ఉండకూడదని అనడం – ఉన్నాయి. రాజ్యాంగాన్ని గురించి మాట్లాడుతున్న సందర్భంలో ఆయన పార్లమెంట్‌లో ఈ విషయాలన్నీ ప్రస్తావించారు. ఆయన మార్క్సిజానికి చేరువలో ఉన్నారని ఇవన్నీ సూచిస్తున్నాయి.

నిజానికి 1952 ఎన్నికల ఫలితాలు నెహ్రూకి అనుకూలంగా ఉండటంతో, దళిత ఉద్యమ నాయకుడు, తన స్నేహితుడు అయిన కర్మవీర్ దాదాసాహెబ్ గైక్వాడ్‌కి అంబేద్కర్ ఉత్తరం రాస్తూ, అత్యంత ప్రధానమైన ఒక ప్రకటన చేశారు. తన రాజకీయ తత్వశాస్త్రం మౌలికమైన కొన్ని అంశాలలో అసంపూర్ణ మైనదని తన జీవిత చరమాంకంలో అంబేద్కర్ గ్రహించారు.

హరిబాబు పగారె రాసిన దాదాసాహెబ్ గైక్వాడ్ జీవిత చరిత్ర నుండి నేను కొన్ని పంక్తులు ఉటంకిస్తాను.

"నేను ఫెడరేషన్ నుండి బయటకు వచ్చేయాలని భావిస్తున్నాను. అంతే కాదు, మొత్తం రాజకీయాల నుండి తప్పుకోవాలను కుంటున్నాను. అదంత సులభం కాదని నాకు కూడా తెలుసు. అయితే నా రాజకీయ తత్వం మన ప్రజలకు తక్షణ ఉపశమనం అందించలేదని గ్రహించాను. మన ప్రజల పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నదో నాకన్నా బాగా ఎవరికీ తెలిసి ఉండదు. కానీ ఉపశమనం పొందడానికి వారు ఇంకా ఎన్నేళ్లు ఎదురు చూడాలి? నేను కమ్యూనిస్టు పార్టీలో చేరాలనుకుంటున్నాను. "1952లో అంబేద్కర్ తన తత్వశాస్త్రం పరిమితులను గ్రహించి ఈ నిర్ణయానికి వచ్చిన విషయం మనం గమనించాలి. అది కూడా రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్ర పోషించిన తర్వాత, ఆ రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చిన తరువాత.

### ఆర్‌బి మోరే విమర్శ–దళిత సమస్య

1953లో కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరోకి లేఖ రాస్తూ మోరే, డాక్టర్ అంబేద్కర్ రాజకీయ తత్వశాస్త్రం గురించి, దాని పరిమితుల గురించి తన అంచనా చెప్పారు.

"కానీ అంబేద్కర్‌పై బూర్జువా రాజకీయ సిద్ధాంతం ప్రభావం తీవ్రంగా ఉందన్న విషయం గమనించాలి. అతని చివరి విశ్లేషణ, సమస్య ఆర్థిక కోణాన్ని విప్లవాత్మకంగా చూడ నిరాకరించటానికి దారితీసింది.

వర్ణ వ్యవస్థలో ఉన్న ఆర్థిక దోపిడీని అర్థం చేసుకోవాలంటే, మార్క్స్ పెట్టుబడిదారీ సమాజంలో అదనపు విలువ, అంతకు

ముందున్న సమాజంలోని వివిధ రూపాలలో అదనపు ఉత్పత్తి గురించి చేసిన ఆలోచనలు పరిగణనలోకి తీసుకోవాలి. మానవ సామాజిక పరిణామ క్రమంలో వ్యవసాయం ఉత్పత్తి రూపంగా అవతరించడం, ఇక్కడ ఉత్పత్తి అత్యధిక మోతాదులో ఉండడం అదనపు ఉత్పత్తికి మూలమైంది. వ్యవసాయంలో పది మంది పనిచేసి ఉత్పత్తి చేసినది పదిమంది బతకడానికి తినేందుకు అవసరమైన దాని కన్నా ఎన్నో రెట్లు అధికంగా ఉంటుంది. వ్యవసాయం కనుగొనడానికి ముందు, నాకు తెలిసినంతవరకు బానిసత్వం లేదు. నిజానికి "దాదాపు 425 సామాజిక సమూహాలు పరిశీలించిన తర్వాత, వ్యవసాయం, పశు పోషణ తెలియని ఆదిమ మానవులలో బానిసత్వం లేదని సామాజిక శాస్త్రవేత్తలు హెబౌసే, గిన్స్‌బర్గ్, వీలర్ నిర్ధారణకు వచ్చారు."

"ఆర్‌బి మోరే మొదటి విమర్శ, భూమి హక్కు పొందేటట్టు చేయడంలోనే దళితుల స్వేచ్ఛ ఇమిడి ఉందని. తక్షణం భూమిని జాతీయం చేయడానికి ఇచ్చే పిలుపు వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. కానీ భూమిని దళితులందరికి పంచిపెట్టడం అనే పిలుపు ఈ నాడు ప్రయోజనకరంగా ఉంటుంది."



మహద్ సత్యాగ్రహ ఆహ్వాన సంఘంలో బిఆర్ అంబేద్కర్ తదితరులతో కామ్రేడ్ మోరే (వెనుక వరుసలో నిలుచున్న వారిలో కుడివైపు చివర)

1867లో ప్రచురించబడిన పెట్టుబడి గ్రంథం మొదటి భాగంలో భూ యజమాన్యానికి, అణచివేతకు ఉన్న సంబంధాన్ని ఇంకా వివరణాత్మకంగా చూపారు. ఆఖరి భాగంలో పీల్ అనే ఆయన గురించి చెబుతూ, "అతడు ఇంగ్లాండ్ నుండి స్వాన్ నదికి, అటునుండి పశ్చిమ ఆస్ట్రేలియాకి వెళుతూ ఖర్చులకు, ఉత్పత్తి చేయడానికి తనతో 50,000 పౌండ్లు తీసుకెళ్లాడు. అతను ముందు చూపుతో తనతో పాటుగా 3000 మంది కార్మికులను, మహిళలు, పిల్లలను కూడా వెంట పెట్టుకెళ్ళాడు. గమ్యస్థానానికి చేరే సరికి పీల్ వద్ద పక్క వేయడానికి, నీళ్లు తెచ్చి ఇవ్వడానికి అయినా ఒక్క మనిషి కూడా మిగలలేదు. "భూమి ఎక్కడ చవకగా ఉంటుందో, అక్కడ మనుషులందరూ స్వేచ్ఛగా ఉంటారు. ప్రతివాడు తనకంటూ కొంత భూమిని సంపాదించుకోగలుగుతుండడం వలన కార్మికుల శ్రమ ఖరీదు ఉత్పత్తిలో ఎక్కువగా ఉండడమే కాదు, పెద్ద మొత్తంలో మొత్తం ధర చెల్లించినా, కార్మికులను పొందడం కష్టమవుతుంది."

భారతీయ దోపిడీ వ్యవస్థ తన అద్భుతమైన తెలివితేటలతో కులమనే ప్రత్యేకమైన ఉత్పత్తి విధానాన్ని కనుగొంది. ఇది వేలాది సంవత్సరాలు స్థిరంగా నిలిచిపోయింది – మొఘలులు, మరాఠాలు, బ్రిటిష్ వారు, భూ పంపిణీ చేస్తామని చెప్పుకునే భారత బూర్జువా వర్గం.– ఎవరి పాలనలో అయినా చట్టపరంగా గాని సాంప్రదాయబద్ధంగా గాని భూమిని కొనుక్కునేందుకు, వ్యవసాయం చేసుకునేందుకు, ఓడిపోయిన గిరిజనులకు, సమూహాలకు భూ హక్కు నిరాకరించడం అనే సాధారణ ఆలోచన ద్వారా వారిని కట్టి పడేయగలిగారు. వీరే అస్పృశ్యులు. కులాన్ని 'జాతి' అని, గిరిజనులను 'జనజాతి' అని పిలవడంలోనే వారి సామాజిక కూర్పు అవగాహన చేసుకోగలుగుతాం.

ఆర్‌బి మోరే మొదటి విమర్శ, భూమి హక్కు పొందేటట్టు చేయడంలోనే దళితుల స్వేచ్ఛ ఇమిడి ఉందని. తక్షణం భూమిని జాతీయం చేయడానికి ఇచ్చే పిలుపు వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. కానీ భూమిని దళితులందరికి పంచిపెట్టడం అనే పిలుపు ఈ నాడు ప్రయోజనకరంగా ఉంటుంది.

### ఆర్ బి మూర్ రెండో విమర్శ

విప్లవపంథాలో సమస్యలను పరిష్కరించడం అంటే, సమాజంలో బూర్జువా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ లక్షణాలను గుర్తించడం. వర్గ పోరాటాల ద్వారా తీసుకురావలసిన సామాజిక మార్పును గమనించడం. అంటే ఎక్కడయినా దళితులు అతి తక్కువ సంఖ్యలో ఉంటారు. వారు ఉన్నత తరగతుల, ఇతర తరగతుల మీద తమ జీవనానికి ఆధారపడతారు. మెజారిటీ ప్రజలు తమ ఇష్టాయిష్టాలను దళితులపై రుద్దడానికి వాడే ఆయుధమే సర్వసాధారణంగా జరిగే 'దళితుల వెలివేత'.

అందువలనే వారు భూమిలేని వర్గమని గుర్తించవలసిన అవసరం ఉంది. వారు ఉన్నత వర్గానికి చెందిన భూస్వాములకయినా, రైతులకయినా అప్పుణంగా పనిచేసిపెట్టే భూవసతి లేని పేదలని, బానిస బతుకులు బతికేవారని, కట్టు బానిసల నిల్వ సైన్యమని గుర్తించాలి.

పైగా భారతదేశంలో వ్యవసాయ కార్మికుల వర్గం ఏమిటి? మహారాష్ట్రలో 2020లో నమోదయిన రైతుల ఆత్మహత్యలతో సగానికి పైగా చనిపోయినది భూమిలేని పేదలే. 10677 ఆత్మహత్యలు నమోదు కాగా, వారిలో రైతులు 5579 మంది, 5098 మంది వ్యవసాయ కూలీలు. ఆ వ్యవసాయ కూలీలలోనూ 49 శాతం దళితులూ, ఆదివాసీలు.

(మిగతా 28వ పేజీలో)

జాతీయ పరిణామాలు

# విస్తరిస్తున్న ఆర్థికమాంద్యం

ఎ.కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

దేశంలో ఆర్థికమాంద్యం క్రమంగా విస్తరిస్తున్నది. మేకిన్ ఇండియా అంటూ ప్రధాని పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగిస్తున్నప్పటికీ దేశంలో తయారీరంగం పుంజుకోకపోగా మరింతగా దిగజారిపోతున్నది. వాస్తవంగా దేశం పురోగమించే క్రమంలో తయారీ రంగం అభివృద్ధి చెందటం ముఖ్యమైన అంశంగా ఉంటుంది. అభివృద్ధి క్రమంలో వ్యవసాయరంగంపై ఆధారపడినవారి సంఖ్య తగ్గుతుంది. వ్యవసాయరంగం నుండి బయటికి వెళ్ళిన వారిలో ఎక్కువ మంది తయారీరంగంలో ఉపాధి పొందుతారు. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ ఈ విధంగానే ముందుకుపోయాయి. కాని మనదేశంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి సంఖ్య అయితే తగ్గుతున్నది. కాని తయారీరంగంలో పని చేస్తున్నవారి సంఖ్య పెరగటం లేదు. దేశ జిడిపిలో తయారీరంగం వాటా 17-18 శాతం వద్ద స్థంభించిపోయింది. అమెరికా, అభివృద్ధి చెందుతున్న దక్షిణ కొరియా లాంటి దేశంలో కూడా ఇది 30 శాతానికి దగ్గరలో ఉంది. మరి వ్యవసాయరంగంలో ఉపాధి కోల్పోయిన వారు తయరీ రంగంలో కాకుండా ఎక్కడ ఉపాధి పొందుతున్నారు అంటే రియల్ ఎస్టేట్, చిల్లర వ్యాపారాలు, ఇతర చిన్నా చితకా పనులలో చేరుతున్నారు.

వ్యవసాయరంగంలో ఉపాధి కోల్పోయిన వారు తొలుత తయారీరంగం, ద్రవ్య, ఇతర సేవారంగాలలోకి వెళ్ళటం అభివృద్ధి చెందిన అన్నిదేశాలలోనూ జరిగింది. కాని మనదేశంలో అందుకు భిన్నంగా, ఏదో విధంగా పొట్టపోసుకోవటానికే పరిమితం అవుతున్నారు. ఇందుకు మరొక కారణం కూడా ఉంది. ప్రపంచీకరణలో భాగంగా ప్రతిరంగంలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశిస్తున్నాయి. అవి భారీగా యాంత్రీకరణతో ఉత్పత్తి చేస్తుండటంతో చిన్న సంస్థలు తయారీరంగంలో నిలబడలేకపోతున్నాయి. యాంత్రీకరణ పెరిగిన కొద్దీ కార్మికులను తగ్గించటం జరుగుతుంది. ప్రస్తుతం దేశంలోని కార్మికులలో 10-12 శాతం మాత్రమే తయారీరంగంలో ఉన్నారు. ఫలితంగా ప్రజల ఆదాయాలు తగ్గటంతో వారు సరుకుల కొనుగోలును తగ్గించుకొంటున్నారు. దానితో మాంద్యం ఆవరిస్తున్నది. ప్రపంచీకరణ ఫలితంగా అభివృద్ధి చెందిన దేశాలు వారి దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని కూడా మనలాంటి దేశాలపై నెట్టివేస్తుండటంతో ఆ భారాన్ని కూడా మన ప్రజలు మోయాల్సివస్తున్నది. గత దశాబ్దాలలో ప్రపంచాన్ని తీవ్రంగా ఆవరించిన సంక్షోభాలు మనపై తక్కువ ప్రభావం చూయించాయి. మనదేశం అనుసరించిన స్వతంత్ర ఆర్థికాభివృద్ధి విధానాలు అందుకు కారణం. కాని సరళీకరణ విధానాలతో స్వతంత్ర ఆర్థికాభివృద్ధి క్రమంగా అడుగంటిపోతున్నది. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విధానాలను పూర్తిగా విడనాడుతూ , సామ్రాజ్యవాద అనుకూల విధానాలను వేగంగా అమలుచేస్తున్నది. ఫలితంగా 2023లో ప్రపంచదేశాలను చుట్టుముట్టనున్న సంక్షోభం మనదేశంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. ఫలితంగా ఇప్పటికే అల్పాదాయాలు, ఉపాధి లేమితో బాధపడుతున్న శ్రామిక ప్రజానీకం పరిస్థితులు మరింత దిగజారిపోనున్నాయి. ఈ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించకపోతే దేశప్రజలు మరింత దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సివస్తుంది.

**ప్లేటు మార్చటంలో సాటిలేని మోడి**

"ఎదుటివారికి చెప్పేటందుకె నీతులు ఉన్నాయి" అన్న నానుడి మోడిగారి ఉచితాల రద్దు ప్రచారానికి బాగా వర్తిస్తుంది. ప్రజలకు ప్రభుత్వం అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలను ఉచితాలుగా ముద్రవేసి, వాటిని రద్దుచేయాలని ఆయన ప్రచారం చేస్తున్నాడు. డిసెంబరు నెలలో తెలుగురాష్ట్రాల పర్యటనకు వచ్చినపుడు కూడా ఈ అంశంపై తీవ్రమైన ప్రచారం నిర్వహించటంతో పాటు, సంక్షేమ విధానాలు అమలు జరుపుతామని ప్రకటిస్తున్న రాజకీయ పార్టీలను దూరదృష్టి లేనివంటూ నోరు పారేసుకున్నాడు. కాని నెలరోజులు కూడా గడవకముందే దీనికి పూర్తిగా భిన్నమైన నిర్ణయం తీసుకున్నాడు. 2024లో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, కోవిడ్ సమయంలో ప్రారంభించిన ఉచితంగా ఆహారధాన్యాలు అందించే కార్యక్రమాన్ని 2023 చివరి వరకు కొనసాగించాలని మోడి నాయకత్వంలో సమావేశమైన కేంద్రమంత్రివర్గం నిర్ణయించింది. ఆహారధాన్యాలతో పాటు ఇతర నిత్యావసరాలను కూడా ప్రజలకు ఉచితంగా లేదా నామమాత్రమైన ధరలకు అందించాలని, వివిధరకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరుతున్నవారిని హ్రస్వదృష్టితో ఉన్నారని, ఎన్నికల ప్రయోజనాల కోసం అడ్డదారులు వెదుకుతున్నారని పరిహసిస్తున్న మోడి మరోవైపున తమ ఎన్నికల ప్రయోజనాల కోసం ఉచిత ఆహారధాన్యాల పంపిణిని పొడిగించినపుడు మాత్రం ఆయనకు ఇవేవీ గుర్తుకురాలేదు. ప్రపంచ ఆకలి సూచిలో దేశం స్థానం దిగజారుతున్నదంటే అవి తప్పుడు నివేదికలని ఆగ్రహం వ్యక్తం చేసిన మోడి, బిజెపి నాయకులు తమ చర్యతో వాస్తవ పరిస్థితులను అంగీకరించినట్లైంది.

సంక్షేమ కార్యక్రమాలు అవి పొందే ప్రజలకు మాత్రమే కాక, దేశప్రజలందరికీ ప్రయోజనం కలిగిస్తాయి. ప్రభుత్వం ఆదాయం, సంపదలను బడా కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాల వలన మెజార్టి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతున్నది. ప్రజలు కొనకపోతే సరుకులు గుట్టలు

పడిపోతాయి. ఫ్యాక్టరీలు మూతపడతాయి. కార్మికులు నిరుద్యోగులుగా మారతారు. ఇది సంక్షోభానికి దారితీస్తుంది. ఈ సంక్షోభాన్ని అధిగమించాలంటే సరుకులు అమ్ముడయే మార్గం చూడాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే సరుకులు అమ్ముడవుతాయి. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ కార్యక్రమాల వలన సామాన్యప్రజల వద్ద మిగిలిన డబ్బుతో వారు సరుకులను కొనుగోలు చేస్తారు. ఆ విధంగా సంక్షోభాన్ని అధిగమించటం సాధ్యమౌతుంది.

సంక్షేమ పథకాలతో పాటు ప్రజల ఆదాయాలను పెంచటానికి కూడా చర్యలు తీసుకుంటే దేశం శీఘ్రగతిన అభివృద్ధి చెందుతుంది. కార్పొరేట్‌లు, సామ్రాజ్యవాదులకు సంపదలు, ప్రజల ఆదాయాలను కట్టబెట్టినందువలన దేశం అభివృద్ధి కాదు. ఆదాయాలను ప్రజలకు అందించటం ద్వారా మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రజల చేతుల్లోకి ఎక్కువ ఆదాయం వస్తే ఎక్కువ సరుకులు కొనుగోలు చేస్తారు. దానితో సరుకుల నిల్వలు అయిపోవటంతో పాటు మరింతగా సరుకులను ఉత్పత్తి చేయాల్సివస్తుంది. ఎక్కువ ఫ్యాక్టరీలను పెట్టాల్సివస్తుంది. ఎక్కువ మంది కార్మికులను పనిలోకి తీసుకోవాల్సి వస్తుంది. వీటన్నింటి వలన మరింతగా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. మరింతగా సరుకులు కావలసి వస్తాయి. ఈ విధంగా ప్రజల ఆదాయాలు, కొనుగోలు శక్తి పెరగటం వలన ఉత్పత్తికి, ఉద్యోగితకు ఊపు వస్తుంది. ప్రజల ఆదాయాలు, సరుకుల తయారీ పెరగటాలు ఒకదానిపై మరొకటి ప్రభావం చూపుకొంటూ చైన్ రియాక్షన్ లాగా పరస్పరం అభివృద్ధి అవుతాయి. ఇది జరగాలంటే మోడి ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దుచేయాలి. రైతులకు ఆదాయాలు పెరిగే చర్యలు తీసుకోవాలి. రైతాంగ ఉద్యమం ముందుకు తీసుకొచ్చిన డిమాండ్లను అమలు చేయాలి. అపుడు ప్రజల పరిస్థితులు మెరుగుపడతాయి. దేశం అభివృద్ధి చెందుతుంది. ఈ విధానాలను పక్కన పెట్టి కార్పొరేట్ల ఖజానాలను నింపే విధానాలను అమలుచేస్తే అభివృద్ధి మరింత కుంచించుకుపోతుంది.

“ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి గారు డిసెంబరు 28వ తేదీన ప్రధాని నరేంద్ర మోడిని కలిశారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం చర్చించటానికి ప్రధానిని లేదా కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్యులను కలిసినపుడు ఏ సమస్యల పరిష్కారం కోసం కలిశారు? దానికి వారి స్పందన ఎలా ఉన్నది అన్న అంశాలను వివరిస్తే ప్రజలు స్పష్టమైన అవగాహనతో ఉంటారు. కాని ప్రధానిని కలిషిన తర్వాత ముఖ్యమంత్రి గారుచేసిన ప్రకటనలో స్పష్టత లేదు.”

### మధుర మసీదును వివాదాస్పదం చేసిన సంఘ్ పరివార్

మధురలోని షాహి ఈద్గా మసీదును తొలగించి, ఆ స్థలాన్ని పక్కనే ఉన్న కృష్ణ మందిరానికి అప్పగించాలని దాఖలైన పిటీషన్‌ను విచారణకు అనుమతించాలని డిసెంబరు 22వ తేదీన జిల్లాకోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చాడు. దేశంలో వివిధప్రాంతాలలో ఉన్న మసీదులు, ఇతర ముస్లీం మత చిహ్నాలను వివాదాస్పదం చేస్తూ దేశంలో మతోన్మాదాన్ని పెంచటానికి సంఘ్ పరివార్ ప్రయత్నాలు చేస్తున్నది. మధురలోని షాహి ఈద్గా మసీదును కూడా అదే విధంగా వినియోగించుకోవటానికి చాలాకాలం నుండి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకోసం వారే వివాదాలను సృష్టిస్తున్నారు. మధుర షాహి ఈద్గా మసీదు వివాదాన్ని కూడా ఆ విధంగానే ముందుకుతెచ్చారు.

ఇదే అంశంపై మధుర సివిల్ కోర్టులో దాఖలైన పిటీషన్ 1991 ప్రార్ధనా స్థలాల చట్టంలోని నిబంధనలను అతిక్రమిస్తున్నదని చెబుతూ 2020లో న్యాయమూర్తి విచారణకు అనుమతించలేదు. పిటీషన్‌దారులు జిల్లా కోర్టులో కేసు వేయగా ఇపుడు జిల్లా జడ్జి ఇచ్చిన తీర్పుతో ఈ కేసు విచారణ ప్రారంభం అవుతుంది.

మసీదు స్థలానికి సంబంధించిన వివాదం 1950 దశాబ్దంలో తీవ్రమైంది. ఆనాడు ఉభయపక్షాలు చర్చించుకొని ఒక ఒప్పందానికి వచ్చాయి. 1968, అక్టోబరు 12వ తేదీన శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవాసమితి, షాహి ఈద్గా మసీదు ట్రస్ట్ లు స్థలానికి సంబంధించి ఒప్పందం చేసుకున్నాయి. వివాదంలో ఉన్న స్థలంపై ఉభయులు ఒప్పందం చేసుకొని, మసీదు స్థలంపై హిందుసంస్థలు చేస్తున్న వాదనలకు ముగింపు పలికారు. ఆనాడు ఒప్పందం చేసుకున్న శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవాసమితికి స్థలంపై హక్కులేదని, కాబట్టి ఆ ఒప్పందం చెల్లదని పిటీషనర్లు ఇపుడు వాదనలు చేస్తున్నారు. ఒప్పందం చేసుకున్న సంస్థకు లీగల్‌గా హక్కులేకపోతే ఆనాడే ఎందుకు వ్యతిరేకించలేదు? 50 సంవత్సరాల తర్వాత ఇపుడెందుకు దానిని వివాదాస్పదం చేస్తున్నారంటే సమాధానం స్పష్టమే. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి, మైనారిటీలపై దాడులను చేయటంలో భాగంగానే ఈ వివాదాన్ని ముందుకుతెస్తున్నారు. చట్టాల అమలు విషయంలో కొన్ని సందర్భాలలో న్యాయవ్యవస్థ దృఢంగా వ్యవహరించకపోవటం వీరికి కలిసివస్తున్నది. మత సామరస్యాన్ని దెబ్బతీసే ఇటువంటి వివాదాలకు ముగింపు పలకటానికి ప్రజలు చైతన్యంతో ముందుకు వచ్చేవరకు వీరు వికృత క్రీడలు కొనసాగిస్తూనే ఉంటారు.

### విన్నపాలు మినహా సాధించింది శూన్యం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి గారు డిసెంబరు 28వ తేదీన ప్రధాని నరేంద్ర మోడిని కలిశారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం చర్చించటానికి ప్రధానిని లేదా కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్యులను కలిసినపుడు ఏ సమస్యల పరిష్కారం కోసం కలిశారు? దానికి వారి స్పందన ఎలా ఉన్నది అన్న అంశాలను వివరిస్తే ప్రజలు స్పష్టమైన అవగాహనతో ఉంటారు. కాని ప్రధానిని కలిషిన తర్వాత ముఖ్యమంత్రి గారుచేసిన ప్రకటనలో స్పష్టత లేదు. ప్రధాని సానుకూలంగా స్పందించాడని చెబుతున్నారు. ముఖ్యమంత్రి నిర్దిష్టంగా అడిగిన అంశాలపై ప్రధాని నిర్దిష్టంగా చెప్పివుంటే దానినే చెబితే ప్రజలకు స్పష్టత వస్తుంది. రాష్ట్ర విభజన సమస్యలు, పోలవరానికి నిధులు తదితరాలపై ప్రధానితో చర్చించినట్లు వెల్లడైన సమాచారం తెలుపుతున్నది. విభజనకు సంబంధించి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవటం గురించి, తక్షణమే ప్రత్యేకహోదా ఇవ్వాలన్న అంశాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించలేదు. ప్రతిపక్షంలో ఉన్నతకాలం ప్రత్యేకహోదా జపం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత దాని సాధనకు పూనుకోకపోవటం వైసిపి అవకాశవాదాన్ని వెల్లడిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం కావాలనే విభజన సమస్యలను పరిష్కరించకుండా, ఉభయ రాష్ట్రాల మధ్య తంపులు పెట్టి, తన ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని చూస్తున్నది. బిజెపి ప్రభుత్వ ఈ వైఖరితో పోరాడకుండా కేవలం విజ్ఞప్తులు, విన్నపాలు చేసినందువలన ప్రయోజనం లేదు.

పోలవరం విషయంలో కూడా ప్రభుత్వం

(మిగతా 28వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# ఆర్ఎస్ఎస్ ఎజెండా : జాతిని హైందవీకరించి, హిందువులను సైనికీకరించడం



**రచయిత ప్రముఖ పాత్రికేయుడు, వామపక్ష ఉద్యమకారుడు. 'మోడీనామా', 'హిందూత్వ పునరాగమనం' వంటి అనేక పుస్తకాలు రాశారు. వర్తమాన రాజకీయాలపై వ్యాఖ్యానాలు, వ్యాసాలు రాస్తుంటారు.**

**సుభాష్ గటాడే**

ఇస్లాం, యూదుమత దురహంకారం, మతమౌఢ్య బౌద్ధం వగైరాలు, మతాన్ని కేంద్రంగా చేసుకుని దాని చుట్టూ సిద్ధాంతం, సంస్థ, నిర్మాణం ఏర్పరచుకున్నాయి. అలాగే హిందుత్వ కూడా తన హిందూ మతాన్ని కేంద్రంగా చేసుకుని, తన అనుయాయులను, 'ఇతరులతో' పోరాటం చేయటానికి, వాళ్ళను నెమ్మదిగా, (అలాగని చడీ చప్పుడు లేకుండా మాత్రం కాదు) బయటికి పంపించి', తన కల – హిందూ రాష్ట్రం ఏర్పరచడాన్ని – సాకారం చేసుకోడానికి సన్నద్ధం చేసింది. దాని సిద్ధాంతకర్తలు, నాయకులు, వారి నమ్మకస్తులకు, 'అంతర్గత శత్రువులను' ఎలా గుర్తించాలి, వారితో ఎలా వ్యవహరించాలి, అవసరమైతే వారిని ఎలా తొలగించాలి అనే విషయాలు దాపరికం లేకుండా తెలియచేస్తారు. ఇలా తయారు చేయడానికి క్రమపద్ధతిలో సునిశితమైన శిక్షణని ఇస్తారు. ఆటలాడిస్తారు. ఇతర సైనిక సాధనలు, అభ్యాసాలు చేయిస్తారు. 'హిందువులు పిరికివారు, ఇస్లాంను అనుసరించేవారు కత్తులతో తమ మతాన్ని వ్యాపింపచేయడానికి సిద్ధపడతారు' అని ప్రజలను నమ్మింపచేసే హిందూ మతతత్వవాదుల వాదనలకు ఇది విరుద్ధమైనది.

చరిత్రను పరిశీలిస్తే – స్వతంత్రం రాక మునుపు, వచ్చిన తరువాత కూడా ఇది మోసపూరితంగా, లేదా అంతగా మోసపూరితంగా కాకుండా కూడా ఎలా జరిగిందో తెలుస్తుంది. ఈ కలని సాకారం చేసుకోడానికి, ఇందులోని నాయకులు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడడానికి కూడా ముందుకు రాలేదు. పూర్తిగా 'ప్రజల'లో హిందూమతాన్ని జప్పించడం పైనే దృష్టి పెట్టారు. ఆ సమయంలోనే హెగ్డేవార్ గురువు, ఆర్.ఎస్.ఎస్ వ్యవస్థాపకులలో ఒకరు అయిన డాక్టర్ బి.ఎస్ ముంజి హిందువులను సైనికీకరించడానికి ఒక స్కూల్‌ని కూడా స్థాపించారు. దీని ఉద్దేశం హిందువులలో పునరుజ్జీవనం తేవడమే. ఇవి దాదాపుగా, ముస్సోలిని ఇటలీలో 'ఇటలీని వున్న సైనికీకరించడానికి' స్థాపించిన బాలియా సంస్థల వంటివే.

క్విట్ ఇండియా ఉద్యమం కాలంలో, దేశమంతా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కాలంలో, సావర్కర్ బ్రిటిష్ సైన్యంలో చేరమని భారతీయులకు పిలుపునివ్వడం వారి చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయం. ఆ రకంగా ఎగసిపడుతున్న స్వాతంత్రోద్యమాన్ని నీరుగార్చడానికి బ్రిటిష్ సైన్యంతో చేతులు కలిపి, ఆ ఉద్యమాన్ని అణచివేయడానికి హిందుత్వ అధినాయకులు బ్రిటిష్ సైన్యాన్ని బలపరిచారు. ఆ నాటి సిద్ధాంతవేత్తలలో ఆద్యుడైన సావర్కర్ ఊరూరూ తిరుగుతూ బ్రిటిష్ సైన్యంలో చేరాలని హిందూ యువకులను అభ్యర్థించారు. హిందూ రాష్ట్రం ఏర్పాటు చేయడం కోసం 'హిందువులను సైనికీకరించాలి, దేశాన్ని హైందవీకరించాలి' అని పిలుపునిచ్చారు.

అందులోనున్న తర్కం సాధారణమైనది. ఒకసారి బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లి పోగానే సైనికరించబడిన హిందువులు దేశ సారథ్యం వహిస్తారు.

దేశ విభజన, ఆ తరువాత చెలరేగిన అల్లర్లు ఈ శక్తులకు, ఇతర మతవాదులు లాగే, తమ బలప్రదర్శనకు అవకాశం కల్పించింది. ఆ అల్లకల్లోలంలో ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత కూడా ఇదే పద్ధతి కొనసాగుతున్నది.

ప్రభుత్వాలు నియమించిన కమిషన్లు అన్నీ, జరుగుతున్న అల్లర్లలో స్థానిక హిందుత్వ బ్రిగేడ్ హస్తం ఉందని నిర్వివాదంగా నివేదికలు ఇస్తూ వస్తున్నాయి. భారతదేశ స్వాతంత్ర్యానంతరం హిందూ ముస్లిం మతాల మధ్య జరుగుతున్న మత ఘర్షణలు గమనించిన వారు, అధ్యయనం చేసిన వారు "అల్లర్ల వ్యవస్థ సంస్థాగతం చేయబడిందని" అంటున్నారు. ఇందులో సైనికీకరించబడిన హిందూ జాతీయవాద సంస్థల ప్రమేయం చాల ఎక్కువగా ఉంది. ఉదాహరణకి బాబ్రీమసీదు విధ్వంసంలో, హిందూ ఆధిపత్య శక్తులు కుప్పలు తెప్పలుగా పాల్గనడాన్ని చెప్పుకోవచ్చు – ఈ సంఘటన జరిగి ఇప్పటికి 25 సంవత్సరాలు దాటింది. ఇది చాలా ప్రణాళికాబద్ధంగా చేసిన దాడి – ఆకస్మికంగా జరిగినట్టు అనుకూల వర్గాల చేత చిత్రించబడింది. న్యూస్ క్లిక్ అనే పత్రిక ఆ అపవిత్రమైన దినం, రిపోర్టర్స్‌ని సంఘటన స్థలానికి పంపించి, తెప్పించుకున్న వీడియోలలో, హిందూ నాయకులు, మసీదు కూల్చాలని, గుడి కట్టాలని అక్కడ కూడిన జనాలని ఎగదోయడం కనిపించింది. కూల్చిన గుంపులు తాళ్లు, గొడ్డళ్లు, బండరాళ్లతో సాధన కూడా చేశారని న్యూస్ క్లిక్ వీడియో నమోదు చేసింది. అందులో హిందుత్వ నాయకులు ఖాకి నిక్కర్లు వేసుకుని దిశానిర్దేశం చేయడం, ఈలలు వేయడం కనిపించింది. హిందుత్వ బాటలో పయనించిన వారు గట్టి క్రమశిక్షణగల సైనిక

చర్య కావాలని కూడా కోరుకున్నారు. 1992, 2013లో జరిగిన అల్లర్లపై వేసిన శ్రీకృష్ణ కమిటీ బాలథాకరే గురించి ఏమని నివేదించిందో గుర్తు చేసుకుందాము. "థాకరే ఒక అనుభవజ్ఞుడైన సైనిక అధికారిగా తన విధేయులైన అనుయాయులను ముస్లింలపై పద్ధతి ప్రకారం ఎదురు దాడులు చేయాలని ఆదేశించారు" అని రాశారు.

"భారతదేశం, హిందూ రాష్ట్రంగా మారాలని కోరుకుని, ఈ పంథాలో వచ్చిన కొత్త వారు మరింత స్పష్టంగా మాట్లాడుతుండడం ఆసక్తిదాయకం. సనాతన సంస్థ, హిందూ జన జాగృతి సమితి వంటి సంస్థలలో, 'దుష్ట శిక్షణ' వారి 'ఆత్మ సాధనలో' అంతర్భాగం. ఈ 'సంహరణ మానసికంగాగాని, శారీరికంగాగాని 'జరగవచ్చు. సాధుక్‌లగా పిలవబడే వీరికి, 'ధర్మ క్రాంతి' (మత విప్లవం) సాధించడానికి ఆయుధాల – తుపాకులు, త్రిసూలాలు, లాఠీలు, ఇతర ఆయుధాల – శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుంది. వీరికిచ్చే ముఖ్యమైన గ్రంధం – 'రక్షణ గ్రంధం'. ఇందులో దైవ రాజ్య స్థాపనకు 'ఎయిర్ రైఫిల్స్'లో కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.

నిజానికి ఈ మధ్యే రాజకీయ జర్నలిస్టు, ధీరేంద్ర కే.ఝా రాసిన 'షాడో ఆర్మీస్' అనే పుస్తకంలో శ్రీ రాంసేన, హిందూ యువ వాహిని, సనాతన సంస్థ, హిందూ ఐక్య వేదిక, వంటివి విపరీతంగా పెరుగుతుండడాన్ని ప్రస్తావించారు. ఇవన్నీ ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలకు అదనం. 'కల్లోలాలు సృష్టించు, ప్రజలను మత ప్రాతిపదికన భిన్న ధ్రువాలకు చేర్చు, హిందుత్వ పేరుతొ అల్లర్లు సృష్టించు' అన్నదే వీరి ప్రధాన నినాదం, అని రచయిత అంటారు. బిజెపికి ఈ 'నీడ సైన్యానికి' చెప్పుకోదగ్గ స్థాయిలో దగ్గరి సంబంధాలు ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. వారు గత మూడు దశాబ్దాలుగా బిజెపి క్రమంగా పెరగడానికి –1984లో వచ్చిన రెండు లోక్ సభ సీట్ల నుండి 2014లో 282 సీట్లు వచ్చే వరకు – ఏంతో కఋషి చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాగానే, వీరందరూ విపరీతంగా బలం పుంజుకున్నారు. దానితో వారు తమ విధేయులను మరింతగా సైనికరించే /హింసాత్మకంగా మలిచే పనిలో పడ్డారు. రక్షకులుగా చలామణి అవుతున్న గుంపులు బహిరంగంగా రావడానికి ఈ మార్పే కారణం. వారికి అదనపు శక్తినిచ్చే అనుకూల వాతావరణం ఇప్పుడుంది.

1. గుంపు దాడుల భారతం లేదా రక్షకులుగా చలామణి అవుతున్నవారు సాగిస్తున్న హింస సాధారణీకరించబడుతున్నది. పాణిజారి గ్రామంలో వాటర్‌ఫాల్స్ చూడడానికి గౌహతి నుండి వచ్చిన 29 ఏళ్ల నీలోత్పల్, 30 ఏళ్ల అభిజిత్‌నాథ్‌లపై 200 నుండి 250 మంది గుంపు, దాడిచేసి హత్యచేసిన ఘటన వారి ఈ కిరాతకాన్ని కళ్లకు కడుతుంది. అధికారులు సామాజిక మాధ్యమాలలో కొద్ది రోజులగా వచ్చిన ఈ వార్తను ఖండించి, అస్సాం వెలుపలి నుండి వచ్చి, ఇక్కడి పిల్లలను ఎత్తుకుపోయే వారి పని ఇది అని ఎదురుదాడితో కప్పిపుచ్చుకున్నారు.

కానీ మేము ప్రచురణకి వెళ్లే సమయానికి చంపబడిన నీలోత్పల్, అభిజిత్‌ల హత్యకి ప్రతీకారంగా వారి గ్రామాలైన కర్బి, ఆంగ్లోన్గ్‌లలో అల్లర్లు చెలరేగాయి. సూక్ష్మంగా పరిశీలించే వారెవరికైనా, ఈ హత్యలు అరుదైన ఘటనలు కాదని, ఈ మధ్యకాలంలో జరుగుతూనే ఉన్నాయని అర్థం అవుతుంది. కొద్ది రోజుల క్రితం తమిళనాడులో పిల్లలను ఎత్తుకుపోయే వారనే నకిలీ వాట్సప్‌లో వచ్చిన సందేశం ఆధారంగా గుంపుదాడులు చేసి అమాయకులను హత్య చేయడం చూశాం. కొత్త భారతదేశంలో', రక్షకులుగా చలామణి అవుతున్న వారి ఆగడాలు కొత్త మార్కర్‌లగా నేటి పాలకులు చెప్పుకుంటున్నారు.

మూక దాడులలో ప్రధానమైనది గోవుకు సంబంధించిన దాడులు. ఈ దాడులలో హత్య గావించబడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ దాడులలో 97 శాతం 2014 తరువాత జరిగినవే. అందులో చనిపోయిన వారిలో 84 శాతం మంది ముస్లింలు.

ఈ హింస ఎలాగుందంటే, అందులో హింసించబడిన వారే నిజమైన దోషులుగా చిత్రీకరింకరించబడుతున్నారు. హింసకు పాల్పడినవారు ప్రాణత్యాగాలు చేసిన వారుగా కీర్తించబడుతున్నారు. 2003లో జజ్జర్‌లోని ధులియాలో అయిదుగురు దళితులను ఆవు చర్మం వొలుస్తున్నారనే నెపం మీద చంపివేశారు. దాదాపు వెయ్యి మంది మూకలు, అసహాయులైన వారిని నిర్దాక్షిణ్యంగా కొడుతుంటే, పోలీసు అధికారులు చోద్యం చూశారు. పైగా చనిపోయిన వారిపైనే 'ప్రజలను ఉసి గొల్పారని' కేసు నమోదు చేశారు.

మరో గమనించవలసిన విషయం, ఇక్కడ యాదృచ్ఛికంగా జరిగినది ఏదీ లేదు. ఈ చర్యలన్నీ ప్రణాళికాబద్ధంగా జరిగినవే. వాటిని రికార్డ్ చేయడమే కాదు సామాజిక మాధ్యమాలలో పంచుకున్నారు కూడా. ఎవరికైనా అనుమానంగా ఉంటే, రెండేళ్ల

" నిజానికి ఈ మధ్యే రాజకీయ జర్నలిస్టు, ధీరేంద్ర కే.ఝా రాసిన 'షాడో ఆర్మీస్' అనే పుస్తకంలో శ్రీ రాంసేన, హిందూ యువ వాహిని, సనాతన సంస్థ, హిందూ ఐక్య వేదిక, వంటివి విపరీతంగా పెరుగుతుండడాన్ని ప్రస్తావించారు. ఇవన్నీ ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలకు అదనం. 'కల్లోలాలు సృష్టించు, ప్రజలను మత ప్రాతిపదికన భిన్న ధ్రువాలకు చేర్చు, హిందుత్వ పేరుతొ అల్లర్లు సృష్టించు' అన్నదే వీరి ప్రధాన నినాదం, అని రచయిత అంటారు. "



ఆర్ఎస్ఎస్ డ్రిల్

**"ఎదో ఒక చిన్న సాకుతో మూకలు దాడులకు దిగడం, సహాయం చేయాల్సిన పోలీసు యంత్రాంగం చోద్యం చూడడం సాధారణమయిపోయింది. ఒక్కొక్కసారి దాడులు చేసేవారికి సహాయం చేస్తున్నారు. ఝార్ఖండ్ లోని తేహార్‌లో ఇద్దరు యువకులను, గోరక్షక మూక అత్యంత హేయంగా హింసించి చంపారు. ఉదంపూర్లో ట్రక్‌లో నిద్రిస్తున్న ఒక బాలుడిపై, ట్రక్‌లో ఆవు మాంసం ఉందనే అనుమానంతో పెట్రోలు బాంబు వేసి తగల బెట్టారు."**

కిందట పంజాబ్ హర్యానా హై కోర్టు ఇందుకు సంబంధించిన కేసులో ఇచ్చిన తీర్పును పరిశీలించవచ్చు. లేదా గుజరాత్ డైరెక్టర్ జెనరల్ అఫ్ పోలీస్‌గా, 'ఉనా' ఉద్యమ కాలంలో ఉన్న అధికారి నివేదికను చూడవచ్చు. అతడు ఆవు రక్షణ గుంపు చర్యలను నిర్ద్వందంగా అభిశంసించారు. వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇటువంటి సంఘటనలలో పోలీసులు, అధికార గణం, తాత్సారంగా వ్యవహరించడం సర్వసాధారణంగా మారిపోయాయి. ఎదో ఒక చిన్న సాకుతో మూకలు దాడులకు దిగడం, సహాయం చేయాల్సిన పోలీసు యంత్రాంగం చోద్యం చూడడం సాధారణమయిపోయింది. ఒక్కొక్క సారి దాడులు చేసేవారికి సహాయం చేస్తున్నారు. ఝార్ఖండ్ లోని తేహార్‌లో ఇద్దరు యువకులను, గోరక్షక మూక అత్యంత హేయంగా హింసించి చంపారు. ఉదంపూర్లో ట్రక్‌లో నిద్రిస్తున్న ఒక బాలుడిపై, ట్రక్‌లో ఆవు మాంసం ఉందనే అనుమానంతో పెట్రోలు బాంబు వేసి తగల బెట్టారు. హర్యానాలోని పాల్వాయిలో అల్లర్లు చెలరేగడానికి కారణం, ట్రక్ ఆవు మాసాన్ని తీసుకెళుతున్నదన్న అనుమానం. గుర్గావ్‌కి ఆవులను అమ్మడానికి తీసుకెళుతున్నారన్న అనుమానంతో, ఇద్దరిపై దాడులు చేసి, వారిని ఆవుపేడలో, ఆవు ఉచ్చ పోసి తినిపించారు. అంతర్జాలంలో ఈ మూర్ఖులు, చేస్తున్న దాడుల వివరాలు ఉన్నాయి. ఎవరైనా చూడవచ్చు. కానీ వీరిపై చట్టపరంగా గానీ, ఇతర ప్రజానీకం నుండి గానీ ఎటువంటి చర్యలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

సాధారణంగా మైనారిటీ మతస్థులు, దళితులు, భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచిన వారు ఇటువంటి దాడులకు గురి అవుతుంటారు. ఈ దాడులు పెరిగి పెరిగి మెజారిటీ మతస్థులు కూడా దీనికి బలవుతున్న సంగతి కార్బి, అంగ్లోగ్ ఘటనలలో చూస్తున్నాము.

ప్రజాతంత్ర వ్యవస్థకు రక్షణ కల్పించాల్సిన మీడియా, తన విమర్శనాస్త్రాలను మూటకట్టేసినట్టు కనిపిస్తున్నది. ఎప్పుడో తప్ప గొంతు విప్పడం లేదు. మౌనాన్ని పాటిస్తున్నది లేదా మెజారిటీ మతస్థుల అభిప్రాయాన్నే ప్రచారం చేస్తున్నది. ఒక్కొక్కసారి ఆ దాడులలో ప్రజలు భాగస్వాములయే విధంగా ప్రోత్సహిస్తున్నది కూడా.

రాజ్యాంగానికి కాపు కాయవలసిన న్యాయవ్యవస్థ ఆ పని చేయడంలో విఫలమవుతున్నది.

ఈ వ్యవస్థనంతటిని తక్షణం జీర్ణించుకోడం అసాధ్యమయినప్పటికీ, ఈ రక్షక మూకలు రాజ్యాంగం లోకి ఎలా చొచ్చుకుపోతున్నాయో, న్యాయాన్ని అందించవలసిన న్యాయవ్యవస్థ లోకి ఈ భావాలు ఎలా జరబడ్డాయో, అసమ్మతి గొంతును అణిచేపనిని రాజ్యం ఈ మూకలకు ఎలా వప్పచెప్పిందో అర్థం చేసుకోవడం ఎంతైనా అవసరం.

క్రిస్టోఫెర్ జాఫర్లాట్ ఈ ప్రయివేటు మూకల పెరుగుదలకు కారణాలు విశ్లేషిస్తూ, ఆర్ఎస్ఎస్ పాత్రను విడగొట్టి తరచి చూశారు. 'ఆర్ఎస్ఎస్ సమాజాన్ని అంతర్గతంగా మార్చాలనుకుంది. తన క్రమశిక్షణను అందులో జొప్పించాలనుకుంది. అదే హిందువులను సమర్థవంతంగా రక్షించడానికి అవసరమని నమ్ముతున్నది. రాజ్యం సమాజం పై నియంత్రణ కలిగి ఉండకూడదు. సమాజం తనకు తానే సామాజిక క్రమాన్ని అమలుచేయడంపై ఒత్తిడి పెట్టి నడుపుకోవాలి, హిందుత్వ సిద్ధాంతంలో చెప్పిన 'సామరస్యం', లేదా దొంతరల, ఆధారంగా నడవాలి' అంటారు.

**హిందువులను సైనికీకరించే సమయం ఆసన్నమైందా?**

ఈ దేశంలో ఏ నాయకుడైనా, తన సంస్థ, లేదా తన ప్రజలు, లేదా కార్యకర్తలను మూడు రోజులు సరిహద్దులలో ఉంచితే 'సైన్యం'గా మారతారని బహిరంగంగా ప్రకటిస్తే, సైనికులకంటే సమర్థవంతంగా సరిహద్దులను రక్షిస్తారని ప్రకటిస్తే, ఏ చట్టపరమైన చర్యలు ఎదుర్కోకుండా బయటపడగలడా? ఈ రకమైన "జాతి వ్యతిరేక" చర్యలకు గాను తప్పనిసరిగా కటకటాల వెనక్కి పంపబడి ఉండేవారు.

ఆర్ఎస్ఎస్ అధినాయకుడు, మోహన్ భగవత్ బీహార్‌లోని ముజఫర్ నగర్లో ఆ మాటలు అన్నప్పుడు దేశంలో పెద్ద దుమారం లేవాల్సింది గాని అటువంటిదేం జరగలేదు. చర్యల మాటటుంచి, ప్రభుత్వంలోని ఒక మంత్రి మోహన్ భగత్‌కి అండగా నిలబడ్డారు. ఆర్ఎస్ఎస్ మహిళా భారత ప్రచార ప్రముఖ్, మన్మోహన్ వైద్య ఇచ్చిన వివరణ పుండుమీద కారం చల్లినట్లుంది. "అవసరమైన పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు, రాజ్యాంగం అనుమతిస్తే, భారత సైన్యం సమాజాన్ని సన్నద్ధం చేయడానికి ఆరు నెలల కాలం తీసుకుంటే, స్వయం సేవకులు మూడు రోజుల్లో సిద్ధం చేయగలరు. ఎందుకంటే స్వయం సేవకులకు క్రమశిక్షణ అలవాటుగా ఉంటుందని మోహన్ భగత్ గారి ఉద్దేశం" అని వివరించారు వైద్య గారు.

సైన్యాన్ని మోహన్ భగత్ అవమానించడంపై దేశవ్యాప్తంగా చర్చలు నడుస్తున్నాయి గానీ, 'ప్రపంచంలోని అతి పెద్ద సాంస్కృతిక సంస్థ లోపల ఏం జరుగుతున్నదో ఏమాత్రం దాపరికం లేకుండా మోహన్ భగత్ గారు బాహాటంగా ఒప్పుకోడం' ఆశ్చర్యం కలిగిస్తుంది. నిజానికి ఇంత స్పష్టంగా ఇటువంటి సంస్థలతో సంబంధం ఉన్నవారు ప్రకటించడాన్ని వినడం అరుదుగా జరుగుతుంటుంది. హిందుత్వ ఉన్మాదులకు తీవ్రవాద కార్యకలాపాలలో భాగస్వామ్యం ఉన్నట్టు వార్తాపత్రికలలో ప్రధాన శీర్షికలుగా వచ్చినప్పుడు, ఆర్ఎస్ఎస్ రక్షణలో పడింది. కానీ మోహన్ భగవత్, సూరత్‌లో ఆర్ఎస్ఎస్ సభ్యులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ఈ ప్రకటన చేశారు. "పేలుళ్లకి సంబంధించిన కేసులలో ప్రభుత్వం నిందితులుగా చూపిన వారిలో చాలామంది తామంత తామే సంస్థని విడిచి స్వచ్ఛందంగా వెళ్లారు. కొన్ని సార్లు సంఘ్, 'మీ దుందుడుకు వాదం' ఇక్కడ చెల్లదని, వెళ్లిపొమ్మని సూచించింది" అన్నారు.

హిందుత్వ సంస్థలన్నిటిలో, కచ్చితమైన క్రమశిక్షణ, సైనిక శిక్షణ, 'ఇతరుల' పై చర్యలు తీసుకోవడం, మేళవించి బోధిస్తారు. మోహన్ భాగవత్ గారి ప్రకటన 'నోరు జారడమేనా' లేదా తన కార్యకర్తల నైతికతను పెంచేందుకు

> "ఒకప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు లాఠీలతో విజయ దశమి నాడు వీధులలో కవాతు చేసేవారు. వీటిని పథసంచలన్ అనేవారు. వాటిలో కూడా అప్పుడప్పుడు స్వయం సేవకులు, కొన్ని అనుబంధ సంఘాల వారు కత్తులు, పిస్టళ్లతో వచ్చేవారని, ఒక్కొక్క సారి తమ సందేశాన్ని ఇవ్వడానికి గాలిలో కాల్పులు కూడా జరిపేవారని ఆరోజులలో పత్రికలలో వార్తలు వచ్చేవి."

ఇచ్చిన ప్రోత్సాహమా? లేదా అతనా విషయం పట్ల గంభీరంగా ఉన్నారా?

ప్రకటన చేసిన సమయం గురించి చర్చించవచ్చు కానీ, మోహన్ భగత్ ఆ మాటలను ఆ అర్థంతో అనలేదని, వాటి అర్థం ఆయనకు తెలియదని ఎవరూ అనలేరు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు – బజరంగ్ దళ్, దుర్గ వాహిని – తుపాకీలను వాడడంతో సహా, ఆత్మ రక్షణార్థం ఇస్తున్న శిక్షణ గురించి అందరికీ తెలుసు.

ఒకప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు లాఠీలతో విజయ దశమి నాడు వీధులలో కవాతు చేసేవారు. వీటిని పథ సంచలన్ అనేవారు. వాటిలో కూడా అప్పుడప్పుడు స్వయం సేవకులు, కొన్ని అనుబంధ సంఘాల వారు కత్తులు, పిస్టళ్లతో వచ్చేవారని, ఒక్కొక్క సారి తమ సందేశాన్ని ఇవ్వడానికి గాలిలో కాల్పులు కూడా జరిపేవారని ఆరోజులలో పత్రికలలో వార్తలు వచ్చేవి.

ఇప్పుడు మత ఉత్సవాల సాకుతో హిందుత్వ కార్యకర్తలు, మద్దతుదారులు ఆయుధాలతో ప్రదర్శనలలో పాల్గనడం ఉత్తర భారతదేశంలో సర్వసాధారణం అయిపోయింది. ఇదే అనేక ప్రాంతాలలో మతఘర్షణలకు దారి తీస్తోంది.

ఈ విధంగా మతగుర్తులను, ఆచారాలను ప్రదర్శనలలో వాడడం, పవిత్రమైన మతాన్ని అపవిత్రత వైపుకు మరల్చడం ప్రతి మతమౌఢ్యులు, తమ మతప్రచారం కోసం పన్నే పన్నాగమే. ఇది వాస్తవానికి రాజకీయ అవసరం కోసం వాడే 'నమ్మకమనే' మతవ్యవస్థని, మతం కోసమనే భ్రమను కల్పించడంలో సహకరిస్తుంది. కూ క్లక్స్ క్లాన్ అనే ఇంగ్లండ్లో ఉన్న క్రిస్టియన్ మతోన్మాదులు మండుతున్న శిలువలను ప్రదర్శనగా తీసుకెళతారు. ఇది తెల్లవారి ఆధిపత్యాన్ని, తెల్లవారి జాతీయతని, వలసవాసుల పట్ల వ్యతిరేకతని, కమ్యూనిస్టు వ్యతిరేకతని నూరిపోసే, ప్రతిఘాతక ఆలోచనలను ప్రజలలోకి ఎక్కించే సంస్థ. ఫస్సాది ఉగ్రవాదులు, జిహాద్ లేదా ఆల్ ఖైదా చేసే పనులు కూడా ఇలాంటివే.

### త్రిశూల దీక్షల నుండి ఆయుధాల ప్రదర్శన వరకు

అన్ని సమాజాలలో సంప్రదాయాలలో కొన్ని భ్రమలు, గుర్తులు, అలవాట్లు ఉండి, అవి ఒక తరం మరో తరానికి అందించబడు తుంటాయి. ఆ అలవాట్లు ఎరిగినవే అయి ఉండడం వలన కొంత సౌకర్యంగా ఉంటాయి. అయితే, త్వరితగతిని మార్పులకు లోనయిన సమాజాలలో ఈ మానసికానందం పొందడం విలాస వంతం, కష్టతరం అవుతుంది. ఎందుకంటే నిజమైన సంప్రదాయాలు అందించే సామాజిక పొందికలు ఆ సమాజాలలో ఉండవు. ఆ సంప్రదాయాలు ఏర్పడినప్పటి పరిస్థితులు మారిపోయి ఉంటాయి. అందువలన ఈ సమాజాలు 'సంప్రదాయాలను' సృష్టించుకుంటుంటాయి. మ్యూజియంలు ప్రాచీన వస్తువులను సృష్టించుకుంటున్నట్టు. వాజపేయి ఎన్‌డిఏకి నాయకత్వం వహించిన కాలంలో, త్రిశూలాలు పట్టుకుని ప్రదర్శనలలో పాల్గొనే సంప్రదాయం, ప్రదర్శనలలో పాల్గొనే ప్రజలకి, త్రిశూలాలు పంచిపెట్టే సంప్రదాయం వస్తే, ఈనాడు ఆ సంప్రదాయం మరింత అభివృద్ధిచెంది, ప్రదర్శనలలో తుపాకులు పట్టుకుని 'మతోత్సవాలలో పాల్గొనడం' గా మారడం మనం చూస్తున్నాము. ఉదాహరణకి హిందూ పండగలు, రామనవమి, హనుమ జయంతిలను హిందుత్వ బ్రిగేడ్ అనుబంధ సంస్థలు మతవిద్వేషాలు రెచ్చగొట్టడానికి ఉపయోగించడం మన కళ్ళ ఎదుట కనిపిస్తూనే ఉంది. కిందటేడు ఇవి భాగల్పూర్‌లో, ఔరంగాబాద్‌లో మంటలు చెలరేగడానికి కారణం అయ్యాయి. ఆ తరువాత అనేక ప్రాంతాలలో ఉద్రిక్తతలు చెలరేగాయి. యుపి, రాజస్థాన్, మహారాష్ట్రలలో ఉద్రిక్తతలు చెలరేగినా, హింస పెద్ద ఎత్తున జరగలేదు. ఆ ఏడు భాగల్పూర్, 1989 తరువాత ఎన్నడూ చూడనంత మతఘర్షణలు చూసింది. ఒక కేంద్ర మంత్రి కొడుకు నాయకత్వం వహించిన ప్రదర్శనలో రెచ్చగొట్టే నినాదాలు పదేపదే ఇచ్చారు. ఫలితంగా అల్లర్లు చెలరేగాయి. ఔరంగాబాద్‌లో కూడా రామనవమి ప్రదర్శన ముస్లింల నివాస ప్రాంతాలలో నుండి తీసుకెళ్లారు. అది అల్లర్లకు, కర్ఫ్యూకి దారితీసింది. గయా, శివన్, కిమ్మూర్‌లలో కూడా రామనవమి ప్రదర్శనలు ఉద్రిక్తతకు, రెచ్చగొట్టే ప్రదర్శనలకు దారితీసింది.

ఇంతకు ముందే చెప్పినట్టు, మతప్రదర్శనలలాగా కనిపించడానికి ముందుగా వేరెక్కడో ప్రణాళిక రచించబడింది.

– కత్తులను పంచిపెట్టారు, సిడిలు పెన్ డ్రైవ్‌లు పంచారు. అందులో ఇస్లాంను కించపరిచే పాటలు రికార్డ్ చేసారు. వాటిని లౌడ్ స్పీకర్‌లలో రామనవమి ప్రదర్శన రోజు వినిపించారు.

– రామనవమి ప్రదర్శనలో వినిపించిన పాటలలో మచ్చుకి ఒకటి – పాకిస్తాన్‌కి పంపండి లేదా అంతం చేయండి. పుట్టలో దాగిన పాములకు పాలు పోసి పెంచకండి. హిందుత్వం మేల్కొని జై శ్రీరామ్ అన్నరోజు, టోపీ పెట్టుకున్న వీడు కూడా జైశ్రీరామ్ అంటాడు. అల్లాహ్‌ని పూజించేవాళ్ళు, దూరంగా జరగండి, మీరు రాముడి జన్మ భూమిని ఎందుకు చుట్టుముట్టారు, మసీదులను తెలివిగా నిర్మించుకోండి, ఇది రాముడి నివాసం. పాకిస్తాన్ మతపెద్దలారా వినండి, పరమశివుడు కోపంతో ఊగిపోతున్నాడు.

ఈ పాటలన్ని యూ ట్యూబ్‌లో ఏడాదికి ముందే ఎక్కించబడ్డాయి. లక్షలాది మంది చూశారు. రెండు లక్షల పదునైన ఆయుధాలు రాష్ట్రం వెలుపల నుండి ప్రభావిత ప్రాంతాలకు తరలించబడ్డాయని అధికారులు తెలియచేశారు. సోనేపూర్‌లో కత్తులు, అమ్మే సంతలలో సంత మొదలైన రెండో రోజుకే కత్తులన్నీ అమ్ముడుపోయాయి. అంటే హింసకి ముందే ప్రణాళిక రచించబడిందన్నమాట. అందుబాటులో ఉన్న సమాచారం మేరకి, కత్తులను కొని ఊరికే పంచిపెట్టారు. పాట్నాలోని ఒక వ్యాపారి 50000 కత్తులకి ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ సరఫరా దారుడికి ఆర్డర్ పెట్టారు. ఈ ప్రదర్శనలన్నిటిలో సర్వ సాధారణంగా జరిగేవి

– స్థానిక పూజ లేదా ఉత్సవ కమిటీ పేరు కింద ప్రదర్శన జరగడం

– రౌడీ ప్రదర్శన చేయాలని నొక్కి చెప్పడం

> "బీహార్‌లోలాగా పశ్చిమ బెంగాల్‌లో కూడా మత ప్రదర్శనల తర్వాత మతఘర్షణలు తలెత్తాయి. పురూలియా, రాణిగంజ్, బుర్ద్వాన్ జిల్లాలలో జరిగిన మతఘర్షణలలో అనేకులు మరణించారు. 24 పరాగణాలలో, ముషీరాబాద్‌లో కూడా మత ఘర్షణలు జరిగాయి. అల్లరి మూకలు కాషాయ జండాని, ఆయుధాలను చేతులలో పట్టుకుని ఆస్తులను ధ్వంసం చేశారు. ఇదివరకటి విద్య శాఖ మంత్రి, మౌలానా అబ్దుల్ కలాం విగ్రహంతో సహా అనేక స్వతంత్ర సమర యోధుల విగ్రహాలను ధ్వంసం చేశారు."

– ముస్లిం వ్యతిరేక నినాదాలు చేయడం.

– ఏ అనుమతులు లేకుండా ముస్లింలు అధికంగా ఉండే ప్రాంతాలలో ప్రదర్శనలు చేయడం.

– పోలీసులతో ఘర్షణ పడడం

బీహార్‌లోలాగా పశ్చిమ బెంగాల్‌లో కూడా మత ప్రదర్శనల తర్వాత మతఘర్షణలు తలెత్తాయి. పురూలియా, రాణిగంజ్, బుర్ద్వాన్ జిల్లాలలో జరిగిన మతఘర్షణలలో అనేకులు మరణించారు. 24 పరాగణాలలో, ముషీరాబాద్‌లో కూడా మత ఘర్షణలు జరిగాయి. అల్లరి మూకలు కాషాయ జండాని, ఆయుధాలను చేతులలో పట్టుకుని ఆస్తులను ధ్వంసం చేశారు. ఇదివరకటి విద్య శాఖ మంత్రి, మౌలానా అబ్దుల్ కలాం విగ్రహంతో సహా అనేక స్వతంత్ర సమర యోధుల విగ్రహాలను ధ్వంసం చేశారు.

21వ శతాబ్దపు తొలిరోజుల్లో 'త్రిశూల దీక్ష' మతం గుర్తుగా ఉంటే, మితవాదుల రాజకీయ, సామాజిక స్థాయి పెరగడం వలన ఈ గుర్తు స్థానంలోకి తుపాకులు పట్టుకొని ప్రదర్శనలు చేయడం వచ్చింది. అయితే ఈ రెండిటికి తేడాను ఎవరూ గమనించకుండా ఉండలేరు. రాజస్థాన్‌లోని పౌర సమాజాల సమూహాలు, త్రిశూలాలు పంచిపెట్టడం వలన, ఈ మతతత్వ సమీకరణాల గురించి' బోధించడంతో 'ఆగలేదు. తమతో పాటు పనిచేయగల పియుసిఎల్, వంటి సంస్థలను కలుపుకుని అప్పటి గెహ్లాట్ ప్రభుత్వానికి పిటిషన్లు పెట్టారు. ప్రదర్శనలు చేశారు.

త్రిశూలాలను కూడా ఆయుధాల చట్ట పరిధిలోకి తేవాలని, తొగాడియా వంటి విహెచ్‌పి నాయకులను త్రిశూలాలు పంచుతూ, విద్వేషమత ప్రసంగాలు చేస్తున్నందు వలన వారిని కూడా ఈ చట్ట పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆనాడు త్రిశూలాల పంపిణీ గురించి చేసిన ఆందోళన ఫలితంగా త్రిశూలాలు ఆయుధాల చట్ట పరిధిలోకి తేబడ్డాయి. మత కేంద్రీకరణలకు దారి తీసే ఆయుధాలు ధరించి చేసే ప్రదర్శనలపై ఇంకా ఎటువంటి నిర్ణయాలు తీసుకోబడతాయో వేచి చూడాలి. ఇప్పుడు ఆయుధాలు చేతబట్టిన ప్రదర్శనలను ఆపాల్సిన బాధ్యత సమానత్వం, అభివఅద్ధి, సమన్యాయం కోరుకునే వారందరిపైనా ఉంది.

❈

# దళిత ఉద్యమం: కామ్రేడ్ ఆర్‌బి మోరే కృషి

(21వ పేజీ తరువాయి)

2013లో ప్రకటించిన శాంపిల్ సర్వే గణాంకాల ప్రకారం, 58 శాతం గ్రామీణ దళిత కుటుంబాలకు భూమి లేదు. 66 ఏళ్ల స్వాతంత్రం తరువాత కూడా హర్యానాలో 92 శాతం, పంజాబ్‌లో 87 శాతం, బీహార్‌లో 86 శాతం భూమిలేని దళితులు ఉన్నారంటే, అది భారతదేశంలోని వ్యవసాయ అభివృద్ధి స్వరూపాన్ని తెలియచేస్తుంది.

అందువలన ఈనాడు వ్యవసాయ కార్మిక సంఘానికి, దళిత ఉద్యమానికి ఉన్న ఉమ్మడి ప్రయోజనం గుర్తించాలంటే, దళిత ఉద్యమానికి, భూమిలేని వ్యవసాయ కూలీల ప్రయోజనాలకు ఉన్న సంబంధాన్ని గుర్తించాలి. వారి మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. దళితుల పోరాటాలను, వ్యవసాయ కూలీల పోరాటాలను కూడా బలపరచాలి.

రామచంద్ర బాబాజి మోరే నిర్ధారణలు ఎలా ఉండేవో పైన చెప్పిన సూచనలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆయనలోని జ్వాలకు, స్ఫూర్తికి కారణం బాబాసాహెబ్ అంబేద్కర్ నమూనానే. అయితే ఈనాటి ఉద్యమ పరిస్థితులకి దిశా నిర్దేశం మాత్రం కామ్రేడ్ ఆర్ బి మోరే జీవితం నుండి గ్రహించాలి. నిజానికి దళితులకు న్యాయం చేయడానికి మోరే చేసిన పోరాటాలను, ఆలోచనలను దళితులకు న్యాయం చేయాలనుకునే వారందరికీ తెలియచేసి మోరే జన్మదినోత్సవాలను జరుపుకుందాము.

(అనువాదం: కె ఉషారాణి)

# విస్తరిస్తున్న ఆర్థికమాంద్యం

(23వ పేజీ తరువాయి)

అనుసరిస్తున్న విధానాలు రాష్ట్రానికి ఏ మాత్రం ఉపయోగకరంగా లేవు. పోలవరం ప్రాజెక్టుకు నవీకరించిన అంచనాలను ఆమోదించక పోవటం, ఆ మేరకు కేటాయింపులు పెంచకపోవటం, ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును కేంద్రం సకాలంలో చెల్లించక పోవటం, పునరావాసాన్ని ప్రాజెక్టు ఖర్చులో భాగంగా చేయకపోవటం తదితరాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. వీటితో పాటు రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అనేక సమస్యలున్నాయి. నీటి పారుదల ప్రాజెక్టులు, వెనుకబడిన ప్రాంతాలకు నీటి వనరులు కల్పించటం, ఆయా ప్రాంతాలలో పరిశ్రమల నిర్మాణం, విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్నది. కాని ఈ విషయంపై ముఖ్యమంత్రి నోరు మెదపలేదు. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన వాటిని గురించి కేంద్రంతో చర్చించకుండా ప్రధానితో ఇంకేమి మాట్లాడినట్లు? అటువంటి చర్చల వలన రాష్ట్రానికి ఉపయోగం ఏమిటి? కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని నిలదీసి, తమ రాష్ట్రాల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తున్న ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను చూసైనా మన ముఖ్యమంత్రిగారు నేర్చుకుంటారా?

❈

చైనా కమ్యూనిస్టు పార్టీ

# ఒడిదుడుకులనదిగమిస్తూ సోషలిస్టు పంథాలో ముందుకు

**ఆర్ అరుణ్ కుమార్**



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

(గత సంచిక తరువాయి)

చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభ పూర్తయిన వెంటనే అక్టోబరు 25వ తేదీన పొలిట్‌బ్యూరో గ్రూపు అధ్యయనానికి పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ నాయకత్వం వహించారు. 20వ మహాసభ నిర్దేశించిన మార్గదర్శ కాలను బాగా అధ్యయనం చేయటం, అర్థం చేసుకోవటం, అమలు చేయటం కోసం ఈ సమావేశం నిర్వహించారు. 20వ మహాసభ నిర్దేశించిన కర్తవ్యాలను ఆర్థిక, సామాజిక రంగాలలో అమలు చేయాలని, ఆ క్రమంలో ఎదురయే సంక్లిష్టమైన సమస్యలను ఎదుర్కోవాలని సమావేశం నొక్కిచెప్పింది.

20వ మహసభలో ప్రవేశపెట్టిన నివేదికలో మార్క్సిజాన్ని సైద్ధాంతికంగా అభివృద్ధి చేయటానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పార్టీ ప్రారంభ లక్ష్యాలను ఎప్పుడూ మర్చిపోవద్దని, మార్క్సిజానికి, సోషలిజానికి ఎల్లప్పుడూ బద్ధులై ఉండాలని మహాసభలో నివేదికను ప్రవేశపెడుతూ జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. పార్టీ తన స్వభావాన్ని, సహజ లక్షణాలను, నిబద్ధతను ఎప్పటికీ వదులుకోదని ఆయన చెప్పారు. తన స్వభావాన్ని మార్చుకోవటం ద్వారా తన మార్గం నుండి, సోషలిస్టు వ్యవస్థ నుండి వైదొలగబోదని ఆయన పేర్కొన్నారు.

గడిచిన దశాబ్దం అనేక మార్పులను చూసింది. అనేక ఆచరణాత్మకమైన డిమాండ్లను ముందుకు తెచ్చింది. ఫలితంగా శతాబ్దాల కాలంలో ఎదురయే ప్రశ్నాపరంపరను సిపిసి అధ్యయనం చేసి, జవాబు చెప్పాల్సివచ్చింది. కాలం ముందుకుతెచ్చిన సమస్యలు అవి. సమస్యల పట్ల స్పందించటం, వాటికి తగిన పరిష్కారాలను వెదకటానికి మార్గదర్శకాలను రూపొందించటమే సిద్ధాంతానికి సంబంధించిన ప్రధాన కర్తవ్యం. ఈ రోజు మనం ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత సంక్లిష్టమైనవైనందున వాటిని పరిష్కరించటం అత్యంత కష్టంగా మారుతున్నది. అన్ని అంశాలూ పరస్పర సంబంధంలోనూ, పరస్పర ఆధారంగానూ ఉన్నాయి. ఒక పరిపూర్ణమైన వ్యవస్థలో అవి విశ్వమంతా విస్తరించి ఉన్నాయని, వాటి అభివృద్ధిని నిర్దేశిస్తున్న సూత్రాలను మనం అర్థం చేసుకుంటే అవి నిరంతరం అభివృద్ధి చెందుతున్నాయని అర్థం చేసుకోగలం. ఈ సమస్యలు తలెత్తిన కాలాన్ని పరిగణనలోకి తీసుకొని, మార్క్సిజాన్ని చైనా పరిస్థితులకు వర్తింపజేయటం ద్వారా మాత్రమే ఈ ప్రశ్నలకు సమాధానాలను చెప్పగలం.

కార్మిక-కర్షక మైత్రితో కూడిన కూటమికి కార్మికవర్గం నాయకత్వం వహిస్తున్నదని, కార్మిక వర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక నియంతృత్వంతో కూడిన సోషలిస్టు దేశంగా చైనా ఉన్నదని, మొత్తం అధికారం అంతా ప్రజలకు చెందుతుందని సిపిసి చెబుతున్నది. ఈ ప్రభుత్వ హయాంలో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం పధానమైన ఉత్పాదక శక్తిగా ఉన్నదని, సామర్థ్యం ప్రధానమైన వనరుగానూ, నూతన ఆవిష్కరణలు వృద్ధికి ప్రధానమైన ప్రేరకాలుగానూ ఉన్నాయని చెప్పింది. సమతుల్యత లేని చాలీచాలని వృద్ధి, మరింత మంచి జీవితం కోసం పెరుగుతున్న ప్రజల నిరంతర ఆకాంక్షలకు మధ్య ఉన్న ప్రధాన వైరుధ్యాన్ని చైనా సమాజం ఎదుర్కొం టున్నది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించటంపైనే పార్టీ తీసుకుంటున్న అన్ని చర్యల ప్రధాన కేంద్రీకరణ ఉంటున్నది.

విస్తృతమైన, ప్రగాఢమైన సామాజిక పరివర్తన చెందుతున్న, ఇప్పటికీ సోషలిజం ప్రాథమిక దశలో ఉన్న అభివృద్ధి చెందుతున్న ప్రధాన దేశం చైనా అని సిపిసి చెబుతున్నది. ఈ విధమైన పూర్వరంగంలో సంస్కరణలు, అభివృద్ధిని ముందుకు తీసుకుపోవటానికి లేదా వివిధ తరగతుల ఆకాంక్షల మధ్య సమతుల్యతను సాధించటానికి తీసుకునే చిన్న చర్య కూడా తీవ్రస్థాయిలో ప్రభావం చూయించటానికి, అంటే పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేయటానికి అవకాశాలు ఉన్నాయి. కాబట్టి మనం ప్రత్యేకమైన- సాధారణమైన వాటి మధ్య, ప్రాథమిక-ద్వితీయ సమస్యల మధ్య, స్థూలమైన-సూక్ష్మమైన వాటి మధ్య, వర్తమానం-భవిష్యత్ మధ్య, స్థానికమైన- సార్వజనీనమైన వాటి మధ్య సంబంధాలను సక్రమంగా అర్థం చేసుకోవాలి. చారిత్రక పూర్వరంగం నుండి వర్తమానాన్ని చూడటం, పైపైన చూడటాన్ని పక్కన పెట్టి, విషయాల లోతుపాతులను అర్థం చేసుకోవటం అవసరం. వ్యూహాత్మకమైన ఆలోచనా విధా నాన్ని అమలు చేయటానికి ఉన్న అవకాశాలను విస్తృతం చేసుకోవటం, చారిత్రకమైన, గతితార్కికమైన ఆలోచన విధానాన్ని క్రమబద్ధీకరించటం అవసరం. అత్యంత సష్టకరమైన కేసుల విషయంలో కూడా సృజనాత్మకంగా ఆలోచించటం ద్వారా మనం అభివృద్ధి కావాలి. ఈ విధంగా చేయటం ద్వారా మనం ప్రణాళికను సర్వజనులకు సన్నిహితం చేయటానికి, సమగ్రంగా, పురోగమన దృక్పథంతో ముందుకుపోతున్న పార్టీ, దేశం చేసే ప్రయత్నాలకు మరింత తోడ్పాటునిస్తుంది.

ఈ విధమైన అవగాహనతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్టుబడి, పరిశ్రమలలో సంస్కరణలను లోతుగా అమలుజరపాలని, ప్రభుత్వ పెట్టుబడులు, ప్రభుత్వరంగ పరిశ్రమలు మరింత బలపడాలని, బాగా పనిచేయాలని, మరింత పెద్దవిగా అభివృద్ధి కావాలని, ప్రభుత్వరంగ పరిశ్రమల పోటీతత్వాన్ని మరింత పెంచాలని సిపిసి కోరుతున్నది. ప్రైవేటు పరిశ్రమలకు అవసరమైన వాతావరణాన్ని కల్పించటం, వారి ఆస్థిహక్కులను రక్షించటం, చట్టబద్ధంగా పారిశ్రామికవేత్తల హక్కులు, ప్రయోజనాలను రక్షించటం, ప్రైవేటురంగం పెరగటానికి తగిన అవకాశాలను కల్పించటం చేయాలని కూడా భావిస్తున్నది. గుత్తసంస్థలు,

> "కార్మికుల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించటంలో, పరిశ్రమలు, ప్రజాసంస్థలలో ప్రజాస్వామిక పద్ధతులను మెరుగుచేయటంలో కార్మికవర్గం బాధ్యత వహించాల్సి ఉన్నది. కార్మికచట్టాలు, నిబంధనలు, కార్మిక సంబంధాలు, చర్చలు, మధ్యవర్తిత్వం, మొత్తంగా కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలను మరింత ఎక్కువ చేయాలని నివేదికలో పేర్కొన్నారు."

అసమాన పోటీకి వ్యతిరేకంగా తీవ్రమైన చర్యలు తీసుకోవటం ద్వారా సూక్ష్మ, స్థూల, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నది.

**ప్రజాస్వామ్యాన్ని పెంపొందించటంలో కార్మికవర్గ ప్రధానపాత్ర**

కార్మికుల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించటంలో, పరిశ్రమలు, ప్రజాసంస్థలలో ప్రజాస్వామిక పద్ధతులను మెరుగుచేయటంలో కార్మికవర్గం బాధ్యత వహించవలసి ఉన్నది. కార్మికచట్టాలు, నిబంధనలు, కార్మికసంబంధాలు, చర్చలు, మధ్యవర్తిత్వం, మొత్తంగా కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలను మరింత ఎక్కువ చేయాలని నివేదికలో పేర్కొన్నారు. సున్నితమైన రంగాలు, నూతనమైన ఉద్యోగాలలో ఉన్నవారి హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించటం కోసం మరింత చేయాలని నిర్ణయించింది.

కార్మికులు చేసిన ఎక్కువ పనికి ఎక్కువ వేతనం చెల్లించే విధంగా చట్టాలు హామీ కల్పించాలి. ఉత్పత్తి ప్రాతిపదికగా పంపకం చేసే విధానాన్ని మరింత అభివృద్ధి చేయాలి. ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై ఆధారపడి తక్కువ, మధ్యస్తంగా ఆదాయం పొందుతున్న తరగతులకు ఎక్కువ పొందేందుకు ఉన్న వివిధ అవకాశాలను అన్వేషించాలి. పట్టణ, గ్రామీణప్రాంతంలోని వారి ఆస్తులపై వస్తున్న ఆదాయాలను పెంచటానికి మరిన్ని అవకాశాలు కల్పించాలి. పారిశ్రామికాభివృద్ధి కోసం వ్యవసాయం, ఆహారభద్రతలను ఫణంగా పెట్టరాదు. చైనాలో ఉన్న 12 కోట్ల హెక్టార్ల వ్యవసాయ భూమిపై ఆంక్షలు విధించింది.

మార్క్సిజాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు వర్తింపచేయటం ద్వారానే సైద్ధాంతిక భావాలు, నూతన ఆవిష్కరణలు వచ్చాయి. మౌలిక, మార్గదర్శకమైన సిద్ధాంతం మార్క్సిజం. దానిపై మనదేశం, సిద్ధాంతం ఆధారపడిఉన్నాయి. ప్రాథమిక స్థాయిలో మన విజయాలకు కారణం మార్క్సిజాన్ని చైనా పరిస్థితులకు వర్తింపజేయటమే. తన లక్ష్యాల సాధన పట్ల పార్టీ దృఢమైన విశ్వాసం, కట్టుబాటు కలిగి ఉండటానికి మార్క్సిజం ఇస్తున్న స్థిరమైన నాయకత్వం ప్రధాన వనరుగా ఉన్నది. చైనా పరిస్థితులకు, మన కాలానికి అనుగుణంగా వర్తింపజేసినపుడు మార్క్సిజం.. పార్టీకీ, సోషలిజానికి విజయా లను అందిస్తున్నది.

ఈ విధమైన సైద్ధాంతిక అన్వేషణలు, నూతన ఆవిష్కరణల ద్వారా కమ్యూనిస్టు పార్టీ పాలనా నిర్వహణ, సోషలిజం అభివృద్ధి, మానవసమాజ అభివృద్ధి జరుగుతున్నదని జిన్‌పింగ్ చెప్పాడు. మార్క్సిజాన్ని మార్గదర్శకంగా స్వీకరించటం అంటే దానిలోని అంశాలను గుర్తు పెట్టుకొని ఉదహరించటం, దానిని మార్చరానిదిగా చూడటం కాదు. మన మస్తిష్కానికి స్వేచ్ఛనివ్వాలి, వాస్తవాల నుండి సత్యాన్ని తెలుసుకోవాలి. కాలంతో పాటు ముందుకు సాగాలి. వాస్తవమైన, సమగ్రమైన దృక్పథంతో వ్యవహరిం చాలి. మనం చేసే ప్రతిపనీ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి. సంస్కరణలు, ఇతరు లకు తలుపులు తెరవటం, నూతన శకంలో సోషలిస్టు ఆధునీకరణకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా ఎదురౌతున్న సమస్యలను పరిష్క రించటంపై కేంద్రీకరణ పెట్టాలి. చైనా, ప్రపంచం, ప్రజలు, మనకాలం ముందుకు తెస్తున్న ప్రశ్నలకు మనం స్పందించాలి. ఆ విధంగా చేసేటపుడు భౌతిక సూత్రాలకు అనుగుణమైన నిర్ధారణలకు రావాలి. కాలానికి అనుగుణమైన నూతన సిద్ధాంతాలను రూపొం దించాలి. ఆ విధంగా చైనా ఆచరణకు మరింత మంచి మార్గదర్శకత్వం ఇవ్వాలి. ఆచరణకు ఎటువంటి పరిమితులు లేనట్లే నూతన సైద్ధాం తిక ఆవిష్కరణలకు కూడా ముగింపులేదు.

నిత్య నూతనమైన ప్రజల ఆచరణలను సిపిసి గౌరవిస్తుంది, వాటి నుండి నేర్చుకుంటుంది. ప్రజల విజ్ఞానాన్ని ఒకచోటుకు చేర్చి, దాని ప్రాతిపదికగా నూతన సైద్ధాంతిక ఆవిష్కరణలు చేస్తుంది. కాబట్టి దాని సిద్ధాంతం ప్రజల నుండి, ప్రజల కొరకు, ప్రజలకు ప్రయోజనం కలిగించటం. ప్రజల నుండి వేరుబడిన సిద్ధాంతాలు బలహీనంగా, శక్తిహీనంగా ఉంటాయి. ప్రజలకు ప్రయోజనం కలిగించని సిద్ధాంతాలు నిర్జీవంగా ఉంటాయి.

మార్క్సిజానికి పార్టీ మొత్తం దృఢంగా కట్టుబడి ఉంటుంది. మార్గం, సిద్ధాంతం, విధానం, చైనా లక్షణాలతో కూడిన సంస్కృతిలో విశ్వాసాన్ని పెంచుతుంది. మార్క్సిజం శాస్త్రీయమైది అన్న అంశాన్ని పునరుద్ఘాటిస్తూ పార్టీ నూతన అంశాలను స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నదని, కాలంతో కలిసి ముందుకు సాగుతుందని, ఆచరణ ద్వారా అభివృద్ధి చేయటానికి కట్టుబడి వుంటుందని, మార్క్సిజాన్ని అభివృద్ధి చేయటం కోసం అవసరమైన తోడ్పాటునందిం చటానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఎప్పుడూ చెప్పని విషయాలను చెప్పటానికి, ఎవరూ చేయని పనులు చేయటానికి మేం తెగింపుతో ఉన్నాం. నూతన ఆచరణను ముందుకు తీసుకుపోవటానికి నూతన సిద్ధాంతాన్ని ఉపయోగించుకుంటాం.

మార్క్సిజాన్ని అధ్యయనం చేయించటం, సిద్ధాంతంలో వస్తున్న నూతన అభివృద్ధిని అర్థం చేసుకోవటానికి ప్రోత్సహించటం ద్వారా పార్టీ సభ్యులందరినీ విద్యావంతులను, సాయుధులను చేయాలని పేర్కొన్నారు. కీలకమైన సోషలిస్టు విలువలను విస్తృతంగా ప్రచారం చేయటం, దేశభక్తి, సమైక్యభావన, సోషలిజంలపై విశ్వాసం పెంచటం, జాతీయ పునర్నవీకరణ కార్యక్రమ భారాన్ని మోసేలా యువతను సన్నద్ధం చేయాలి. ప్రజాచైతన్య కార్యక్రమాలు నిర్వహించటం కోసం సమర్థత కలిగిన తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలను సమీకరించాలని నిర్ణయించింది. శాస్త్ర విజ్ఞానంపై ప్రజలకు అవగాహన పెంచాలని, పుస్తకాలను చదివే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని మహాసభ నిర్ణయించింది. పార్టీని అధ్యయనం చేసే మార్క్సిస్టు పార్టీగా నిర్మించాలని పిలుపునిచ్చింది.

పార్టీ సభ్యుల ఆలోచనలు, భావాలను బలపరచటం ద్వారా దీనిని సాధించగలం. పార్టీ అవసరాలను తీర్చటానికి, ప్రాపంచిక దృక్పథం, జీవనంపై భావనలు, విలువలకు వారు కట్టుబడి ఉండేలా చేయాలి. సమున్నత మైన కమ్యూనిజం భావాలకు, చైనా లక్షణాలతో కూడిన సోషలిజం భావాలకు మేం దృఢమైన మద్దతుదారులుగానూ, ఆచరణ వదులుగానూ ఉంటాం. పార్టీ సమకాలిక, దీర్ఘకాలిక చరిత్రతో సైద్ధాంతిక అధ్యయనాన్ని జతచేస్తాం. పార్టీ సభ్యులు, అధికారులు తమ అవగాహన, కట్టుబాటు, సమగ్రత, కృషిని పెంపొందించు కోవటానికి,

పార్టీ విప్లవ సాంప్రదాయాలు, వారసత్వం, పార్టీ చరిత్రను అధ్యయనం చేయాలి. పార్టీ సభ్యులకు, ముఖ్యంగా కౌంటి, డైరెక్టర్ స్థానాలలో ఉన్నవారు, అంతకన్నా పై వారి అవగాహనను పెంచటం కోసం సైద్ధాంతిక అధ్యయన కేంద్రాలను నిర్వహిస్తాం.

ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని, మానవాభివృద్ధి, పురోగమనంలలో నూతన ధోరణులపై లోతైన అవగాహన ఉండాలని, అన్ని దేశాలలోని ప్రజల సమస్యలపై స్పందించాలని, మానవ జాతిని ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటం కోసం మనవంతు కృషి చేయాలని నివేదికలో పార్టీ కోరింది. మరింత మంచి ప్రపంచాన్ని నిర్మించటం కోసం వివిధ నాగరికతలలో జరిగిన అసాధారణమైన కృషి నుండి ఉత్తేజం పొందాలని చెప్పింది. మార్క్సిస్టు సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి, కాలం కన్నా ముందుండి, మనకృషికి ఎదురయే ప్రమాదాలు, అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులు, సుడిగాలులు, ముంచటానికి సిద్ధంగా ఉండే ప్రవాహాలు, తుఫానులను ఎదుర్కొని, మన లక్ష్యసాధనకు ముందుకుసాగాలి.

సిపిసి 20వ మహాసభ ముగిసిన రెండురోజుల తర్వాత, అక్టోబరు 25వ తేదీన పొలిట్‌బ్యూరో మొదటి గ్రూపు అధ్యయన సమావేశం జరిగింది. పార్టీ కేంద్రకమిటీలో కేంద్రీకృత, ఐక్య నాయకత్వాన్ని బలపరచటం కోసం రూపొందించాల్సిన సూత్రాలు, పని నిర్వహణపై రూపొందించిన ఎనిమిది పాయింట్ల అమలును గురించి చర్చించారు. ఆ మరుసటి రోజు అక్టోబరు 26న జిన్‌పింగ్ నాయకత్వంలో పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటి వాయువ్య చైనాలోని షాన్‌గ్జి ప్రాంతంలోని పాత విప్లవకేంద్రమైన యేనాన్‌ను సందర్శించింది. సిపిసి ఏడవ జాతీయ మహాసభ జరిగిన ప్రాంతాన్ని, మావోజెడాంగ్ గతంలో నివసించిన గృహాన్ని, సిపిసి కేంద్రకమిటి యేనాన్ కేంద్రంగా పనిచేసిన 13 సంవత్సరాల కాలంలోని ముఖ్యాంశాలతో రివల్యూషనరి మెమోరియల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మహాసభ తీర్మానంలో పేర్కొన్న పార్టీ ప్రారంభకాలంలో నిర్దేశించుకున్న లక్ష్యాలకు కట్టుబడి ఉండటం, పార్టీ పోరాట పటిమను, పోరాటశక్తిని నిలబెట్టుకోవటానికని పేర్కొన్నవాటిని బలపరిచేలా ఈ పర్యటన ఉంది.

20వ మహాసభకు సమర్పించిన నివేదికలో పార్టీ నిర్మాణంపై నొక్కిచెప్పారు. బలమైన పార్టీ ద్వారా మాత్రమే చైనా ప్రకటించిన లక్ష్యాలను చేరుకోగలదని, శక్తివంతమైన సోషలిస్టు దేశాన్ని నిర్మించగలదని చెప్పింది. పార్టీ నిబంధనావళిని మన ప్రాథమికమైన మార్గదర్శిగా చేసుకొని, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని మార్గదర్శిగా పార్టీ నిబంధనలను అభివృద్ధి చేయటానికి, వాటిని మరింత మెరుగుచేయటం, వాటిని పూర్తిగా అమలుచేయటం గురించి పేర్కొంది. వాస్తవాన్ని వెల్లడించటం, తప్పులను సవరించుకోవటం, సమస్యలను బట్టబయలు చేయటం, వైఫల్యాలను సవరించుకోవటానికి అవసరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకొని పార్టీని బలపర్చుకోవాలి.

**“20వ మహాసభకు సమర్పించిన నివేదికలో పార్టీ నిర్మాణంపై నొక్కిచెప్పారు. బలమైన పార్టీ ద్వారా మాత్రమే చైనా ప్రకటించిన లక్ష్యాలను చేరుకోగలదని, శక్తివంతమైన సోషలిస్టు దేశాన్ని నిర్మించగలదని చెప్పింది. పార్టీ నిబంధనావళిని మన ప్రాథమికమైన మార్గదర్శిగా చేసుకొని, కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని మార్గదర్శిగా పార్టీ నిబంధనలను అభివృద్ధి చేయటానికి, వాటిని మరింత మెరుగుచేయటం, వాటిని పూర్తిగా అమలుచేయటం గురించి పేర్కొంది.”**

పార్టీలోపల అనేక విషయాలు ఉన్నాయి. వివిధరకాలైన బలహీనతలు ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు. పార్టీ నాయకత్వానికి అవిధేయంగా ఉండటం, స్పష్టమైన అవగాహన లేకపోవటం, శక్తివంతమైన చర్యలు తీసుకోవపోవటం, అశక్తులు, అసమర్థుల వైపు మొగ్గటం తదితరాల ద్వారా ఆచరణలో పార్టీ నాయకత్వాన్ని నీరుగారుస్తున్నారు. తమ రాజకీయ కట్టుబాటుపై కొందరు పార్టీ సభ్యులు, అధికారులు ఊగిసలాడుతున్నారు. నిరంతరం హెచ్చరిస్తున్నప్పటికీ అర్థంలేని ఫార్మాలిటీస్, బ్యూరోక్రటిజం, విలాసవంతమైన జీవనం తదితరాలు అనేకప్రాంతాలు, విభాగాలలో ఉన్నాయి. ప్రత్యేకహక్కులు కోరుకోవటం, వాటిని అనుభవించే ప్రయత్నం చేయటం ముఖ్యమైన సమస్యగా ఉంది. తీవ్ర ఆందోళనకు గురిచేసేలా కొన్ని అవినీతి కేసులు వెల్లడౌతున్నాయి.

ఈ బలహీనతలను తొలగించటం కోసం నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అవినీతిపరులు, అసమర్థులను తొలగించటానికి సిపిసి చేసిన నిరంతర ప్రయత్నాలతో కొన్ని ఫలితాలు వచ్చాయి. ఈ విధమైన ప్రయత్నాల వలన దీర్ఘకాలం నుండి కొనసాగుతున్న అనారోగ్యకర ధోరణులను తిప్పికొట్టటం, సంవత్సరాల తరబడి పట్టిపీడిస్తున్న తీవ్రమైన సమస్యలను కొంతమేరకు పరిష్కరించుకోవటం జరిగింది. కర్తవ్యాన్ని నిర్వహించాలనే దృఢ సంకల్పం వలన కొన్ని వేలమందిని శిక్షించి, 140 కోట్లమంది విఫలం కాకుండా నిరోధించాం. పార్టీలో ఉన్న చెడుగులన్నింటినీ తొలగించటం కోసం “పులులను వెలికిరాబట్టటం, ఈగలను అడ్డుకొని, నక్కలను వేటాడటం” చేశాం. అన్ని విధాలుగా అవినీతికి పాల్పడుతున్న వారిని శిక్షించాం. పార్టీలో, దేశంలో, సైన్యంలో అంతర్గతంగా ఉన్న తీవ్రమైన ప్రమాదాలను తొలగించాం. పార్టీ, ప్రజలు మాకిచ్చిన అధికారాన్ని ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే ఉపయోగిస్తామని స్పష్టం చేస్తున్నాం.

మహాసభలో తీసుకున్న మరొక ముఖ్య నిర్ణయం ‘స్వయం సంస్కరణ’. సిపిసి గత సంవత్సరాలలో అమలుచేసిన దిద్దుబాటు ఉద్యమం తరహాలోనిదే ఈ స్వయం సంస్కరణ. స్వయం సంస్కరణ చేసుకోవటానికి కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. సోషలిజం నిర్మాణంలో ఎదురయే ఆటంకాలన్నింటినీ అధిగమించాలి”. ఈ విధమైన కార్యాచరణ ద్వారానే పార్టీ అవినీతితో పోరాడగలదని, అది తిరిగి తలెత్తే పరిస్థితులు ఉన్నంతకాలం ఈ విధమైన చర్యలు తప్పనిసరి అని జిన్‌పింగ్ చెప్పాడు.

పార్టీ సభ్యులు, అధికారుల అప్రమత్తతను పెంచే విధంగా విద్య గరపటం, మార్గదర్శకత్వాన్ని ఇవ్వటం ద్వారా స్వయం సంస్కరణను అమలుచేయాలి. దీనివలన వారు అవినీతి పట్ల ఆసక్తి లేనివారుగానూ, గౌరవప్రదంగా పనిచేయటం, జీవించటానికి ఇష్టపడతారు. స్వయం సంస్కరణ వలన పార్టీ సభ్యుల అంతర్గత శక్తులను మేల్కొలపటానికి, తద్వారా వారు ఎప్పుడూ ధనం, అధికారానికి లొంగి అవినీతిపాలు కాకుండా చేయటానికి, దరిద్రంలో ఉన్నా లేదా అత్యున్నతమైన స్థాయిలో ఉన్నా సూత్రాల నుండి వైదొలగకుండా ఉండటానికి, బలప్రయోగానికి లొంగిపోకుండా ఉండటానికి దారితీస్తుంది.

ప్రపంచంలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న మార్క్సిస్టు పార్టీగా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, మనకు ఎదురౌతున్న సవాళ్ళను అధిగమించటానికి సిద్ధంగా ఉండటం ద్వారా

"పార్టీ ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించటం, వారి సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకోవటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమౌతుంది. అధికారంలో ఉన్న పార్టీ బతికిబట్టకట్టటానికి సత్‌ప్రవర్తన అత్యంత కీలకమైనదని పేర్కొంటూ, పార్టీ కున్న ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలని పార్టీ సభ్యులను నివేదిక కోరింది."

ప్రజల మద్దతును పొందటం, అత్యధిక కాలం పాలిస్తున్న మార్క్సిస్టు పార్టీగా తనస్థానాన్ని మరింత బలపరుచుకోవటం చేయాలని సిపిసి భావిస్తున్నది. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలలో సోషలిజం దెబ్బతిన్న తర్వాత సిపిసి నేర్చుకున్న ముఖ్యమైన పాఠాలలో ఇది ఒకటి. సోషలిస్టు మార్గానికి స్థిరంగా కట్టుబడి, పడుతూ లేస్తూ ముందుకుసాగాలని సిపిసి కోరుకుంటున్నది.

అత్యంత కష్టభూయిష్టమైన ప్రయత్నాల ద్వారా చారిత్రకంగా పడుతూ లేస్తూ ముందుకుసాగే క్రమాన్ని ఎలా అధిగమించాలన్న ప్రశ్నకు సిపిసి రెండవ సమాధానాన్ని కనిపెట్టింది. ఆ సమాధానం స్వయం సంస్కరణ. పునాదిలో పార్టీ నిర్మాణంలో బలహీనతలు, నిరాసక్తి సమస్యలను పరిష్కరించటం ద్వారా శుద్ధి చేసుకోవటానికి, అభివృద్ధి కావటానికి, పునర్నూతనం కావటానికి, మంచిదిగా మారటానికి పార్టీ శక్తిని మరింతగా పెంపొందించాం. పార్టీలో సమ్మిళిత రాజకీయ వాతావరణాన్ని నిరంతరం స్థిరంగా అభివృద్ధి చేశాం. ఈ విధంగా చేయటం వలన పార్టీ తన స్వభావాన్ని, తన కట్టుబాటును ఎప్పటికీ మార్చుకోదు.

పార్టీ ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించటం, వారి సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకోవటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమౌతుంది. అధికారంలో ఉన్న పార్టీ బతికిబట్టకట్టటానికి సత్‌ప్రవర్తన అత్యంత కీలకమైనదని పేర్కొంటూ, పార్టీ కున్న ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకుపోవాలని పార్టీ సభ్యులను నివేదిక కోరింది. మొతం పార్టీ సభ్యులు, చైనా ప్రజలలో దృఢత్వాన్ని, ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించాలి. అభివృద్ధి, రక్షణ కోసం పోరాటక్రమంలో ఆటంకాలను, కష్టాలను మనం ఎదుర్కొంటాం. రానున్న మార్గంలో ఎదురయ్యే కష్టాలను అధిగమించటానికి మరింత లోతైన కృషిచేయాలి. మన లక్ష్యమైన సోషలిజంలో నూతన శిఖరాలను చేరటానికి తనలోని అజేయమైన పోరాటశక్తిని వెలికితీయాలని పార్టీకి పిలుపునిచ్చింది.

స్వయం సంస్కరణ అనేది ఒకసారితో పోయేదికాదని, నిరంతరం కొనసాగాలని చెప్పింది. "స్వయం పాలన అనేది పూర్తిగా కష్టసాధ్యమైనదని, నిరంతరం ప్రయత్నం చేయాలని పార్టీలో ఉన్న అందరం నిరంతరం మనసులో ఉంచుకోవాలి. స్వయం సంస్కరణ అనేది ఎప్పటికీ ముగింపులేని ప్రయాణం. మనం ఎప్పుడూ మన ప్రయత్నాన్ని సడలనివ్వరాదు. ఎప్పటికీ అలసిపోరాదు". పార్టీ సభ్యులందరూ తమ ప్రవర్తనను, ఆచరణను అభివృద్ధి చేసుకోవటం ద్వారా సామాజిక మార్పును సాధించటానికి తాము స్వయంగా మార్పుచెందాలి.

పార్టీ నిర్మాణాన్ని బలపరచుకోవటానికి ప్రవేశపెట్టనున్న మార్పులు మొదట పైనుండే ప్రారంభం అవుతాయని నివేదికలో పేర్కొన్నారు. కేంద్ర కమిటీ చర్చలు, సంస్థలను కోఆర్డినేట్ చేయటం, నిర్ణయాలు చేసే విధానాన్ని మెరుగుపరుస్తాం. దానితో ప్రధాన అంశాలలో ఐక్య, కేంద్రీకృత నాయకత్వం బలపడుతుంది. పార్టీని రాజకీయంగా బలపరచటం కోసం ఖచ్చితమైన రాజకీయ క్రమశిక్షణ, నిబంధనలను అమలుచేస్తాం. అన్ని స్థాయిలలోని పార్టీ కమిటీలు తమ ప్రధాన బాధ్యతలను నెరవేర్చాలి. రాజకీయంగా తప్పొప్పుల అవగాహన, పార్టీ సంస్థల కార్యకలాపాల నిర్వహణ, పార్టీ అధికారులపై పర్యవేక్షణ తదితరాలను నిర్వహించాలి.

పార్టీ మొత్తం కేంద్రకమిటి నాయకత్వాన్ని, కేంద్రీకృత, ఐక్య నాయకత్వాన్ని బలపరచాలని నివేదిక కోరింది. అన్ని వైపుల నుండి జరిగే ప్రయత్నాలను సమన్వయం చేసేలా మొత్తం పార్టీ నాయకత్వ విధానాన్ని మరింతగా మెరుగు చేయాలి. రాజకీయ విధానం, అవగాహన, సూత్రాలు, మార్గం తదితరాలలో పార్టీ సభ్యులందరూ కేంద్రకమిటీని అనుస రించాలి.

కార్మికసంఘాలు, కమ్యూనిస్టు యూత్‌లీగ్, మహిళా సంఘాలు, ఇతర ప్రజాసంఘాలను సంస్కరించాలని, అవసరమైనవాటిని ఏర్పాటు చేయాలని మహాసభ నిర్ణయించింది. పార్టీ, ప్రజల మధ్య సంధానకర్తలుగా తమ పాత్రను ఇవి జయప్రదంగా నిర్వహిస్తాయని చెప్పారు.

అధికారులను ఎంపిక చేయటంలో రాజకీయ విధేయత మొదటి అర్హతగా పరిగణించాలి. పారిశ్రామిక కార్మికులు, రైతులు, మేధావులు, యువత, మహిళలను సభ్యులుగా అభివృద్ధి చేసుకోవటం, నాయకత్వ స్థానాలకు ఎంపిక చేయవలసిన అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది. పార్టీ భవిష్యత్‌కు ఇది అత్యంత కీలకమైనది. ఈ కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవటానికి తగినవారిని తీర్చిదిద్దాలి. యువ అధికారులు స్థానికసమాజాలు, ప్రాంతాలలో కఠిన పరిస్థితులు ఉన్నచోట పనులు చేయటం ద్వారా అనుభవం పొందాలి. వారి శిక్షణలో అదొక ముఖ్యాంశం అయేలా చూడాలి. మహిళలను అధికారులుగా ఎంపిక చేయటం, వారికి ముఖ్యమైన బాధ్యతలను అప్పగించటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. మైనారిటీ జాతులకు చెందిన వారిని అధికారులుగా తీసుకోవటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పార్టీయేతర అధికారులతో పనిని సమన్వయం చేసుకోవాలి. ఉద్యోగ విరమణ చేసిన అధికారుల పట్ల తగిన శ్రద్ధ చూయించాలి.

కార్యకర్తల పట్ల పార్టీ తగిన శ్రద్ధ తీసుకుంటుందని, అదే సమయంలో సడలింపులు లేకుండా వ్యవహరిస్తుందని నివేదికలో పేర్కొన్నారు. బాధ్యతలను తీసుకోవటానికి, పనిలో తమ శక్తిని ప్రదర్శించటానికి కార్యకర్తలను ప్రోత్సహించాలి. ఆచరణ ద్వారా కార్యకర్తలను సమర్థులుగా తీర్చిదిద్దటం, వారికి వృత్తిపరమైన శిక్షణ ఇవ్వటం, ప్రధానమైన కర్తవ్యాలను అప్పగించటం ద్వారా వారి నైపుణ్యాలను వెలికితీయటం, వారి పోరాటశక్తిని పెంపొందింపజేయటం, ఇబ్బందులను అధిగమించటం, సవాళ్ళను ఎదుర్కోవటం, వత్తిడి సమయాలలో ఎదిరించి నిలబడటం తదితర లక్షణాలను కార్యకర్తలలో బలపరచాలి. శక్తి కలిగినవారిని పైస్థాయికి పంపాలి. అసాధారణమైన కృషి చేసిన వారిని సత్కరించాలి. అర్హతలేని వారిస్థాయిని తగ్గించాలి. అశక్తులను తొలగించాలి.

ప్రభుత్వరంగ సంస్థలు, ద్రవ్యసంస్థలలో పార్టీ నాయకత్వాన్ని బలపరుచుకోవాలని నివేదికలో పేర్కొన్నారు. మిళితమైన నాయకత్వం ఉన్నచోట, ప్రైవేటుసంస్థలు ఉన్నచోట, ట్రేడ్ అసోసియేషన్లు, విద్యాసంబంధ సొసైటీలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, నూతన తరహా ఆర్థిక, సమాజిక నిర్మాణాలు, నూతనంగా ఉపాధి కల్పించే రంగా

(మిగతా 34వ పేజీలో)

# సాఫ్ట్‌వేర్ రంగం కూడా మాంద్యం నుండి తప్పించుకోలేదు

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ట్విట్టర్‌లోనూ, సాఫ్ట్‌వేర్ రంగంలోనూ పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. దీన్ని మనం ఎలా చూడాలి? చిన్న చిన్న సాఫ్ట్ వేర్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల సంగతేమిటి? ప్రపంచ వ్యాపితంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు భద్రత లేదా? భారతదేశంలోని ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? ఉద్యోగ భద్రతకు మార్గాలు ఏమిటి? దయచేసి వివరణ ఇవ్వగలరు.**

**తెల్లాకుల బాజీబాబు,**
**కృష్ణాజిల్లా డివైఎఫ్ఐ కన్వీనర్**

సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మీడియాలో తరచుగా వస్తున్న వార్తలను చూస్తున్నాం. ట్విట్టర్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలలో వందలాది ఉద్యోగులకు ఉద్వాసన పలికారు. ఇది ప్రపంచంలోని అన్ని దేశాలలో సాఫ్ట్‌వేర్ రంగ సంక్షోభంలో పడ్డ ధోరణిని వ్యక్తం జేస్తుందా లేక ఆయా కంపెనీలలో ఏర్పడిన విడివిడి వ్యాపార ఒడిదుడుకులను ప్రతిబింబిస్తుందా అన్న విషయంపై భిన్నాభిప్రాయాలున్నాయి.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికపరిస్థితి విషమిస్తున్నది. 2023 సంవత్సరంలో మాంద్యం వ్యాపిస్తుందని భావిస్తున్నారు. ఈ అంచనా వాస్తవరూపం దాల్చితే సాఫ్ట్‌వేర్ రంగంకూడా మాంద్యం నుండి తప్పించుకోలేదు. ఈ రంగంలో కూడా దివాళా తీయడాలు, మూసివేతలు, ఉద్యోగుల తొలగింపులు సాధారణం కావచ్చు.

కరోనా వైరస్ (కోవిడ్) ప్రపంచాన్ని అతలా కుతలం జేసిన కాలంలో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. కానీ సాఫ్ట్‌వేర్ రంగం కొంత మేరకు తట్టుకొని నిలబడగలిగింది. భౌతిక ఉత్పత్తి దెబ్బతిన్న ఈ కాలంలో డిజిటల్ రంగం పెరిగింది. అనేక కార్యకలాపాలు డిజిటల్ రూపంలోకి మార్చబడ్డాయి. పని కూడా ఆఫీసుతో పని లేకుండా ఇంటినుండి కూడా జేసే అవకాశం సాఫ్ట్‌వేర్ రంగానికుండటంతో కరోనా కాలంలో ఈ రంగం సర్దుబాటు జేసుకుని కార్యకలాపాలను సాగించగల్గింది. అందువలన ఇతర రంగాలపై పడిన ప్రభావం దీనిపై తీవ్రంగా పడలేదు.

అయినా మొత్తం ఆర్థికవ్యవస్థ చిక్కుకున్న సంక్షోభం నుండి సాఫ్ట్‌వేర్ రంగం దీర్ఘకాలం దూరంగా ఉండజాలదు. 2023లో మాంద్యం సంభవిస్తే సాఫ్ట్‌వేర్ రంగం కూడా ఇబ్బందులను ఎదుర్కొంటుంది.

మనదేశంలో సాఫ్ట్‌వేర్ రంగం హైదరాబాద్, బెంగుళూరు, పూనె, గుర్‌గాం వంటి నగరాలలో బాగా అభివృద్ధి అయింది. ఇంకా పెరుగుతోంది. ఇక్కడ కూడా రకరకాల కారణాలతో ఉద్యోగుల తొలగింపులు జరుగుతున్నాయి. అలాగే నియామకాలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు తొలగింపు సమస్య ఒక పెద్ద ధోరణిగా మారలేదు. 2023 నాటికి మన ఆర్థిక పరిస్థితి కూడా దిగజారవచ్చని అంచనా వేస్తున్నారు. దాని కన్నా అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితి దేశంలోని సాఫ్ట్‌వేర్ రంగాన్ని ప్రభావితం జేస్తున్నందున వచ్చే రోజుల్లో ఈ రంగానికి మన దేశంలోనూ ఇబ్బందుల రావచ్చు.

**కమ్యూనిస్టుల దృష్టిలో సామాజికం, సామాజిక న్యాయం అంటే ఏమిటి? వివరించాల్సిందిగా కోరుతున్నాను.**

**ఎ. బాలచంద్రయ్య,**
**గూడురు,**
**తిరుపతి జిల్లా**

గతంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వం అన్న భావనలనే ఇప్పుడు కొంత మర్యాదపూర్వకం జేసి ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం అన్న పదజాలంతో వ్యక్తం జేస్తున్నారు. సమాజంలో ఆర్థిక వ్యవస్థలో నిర్వహించే పాత్రను బట్టి ప్రజలను వర్గాలుగా విభజన జేస్తారు. పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థలో మనుషులను ఎక్కువగా లింగ, కుల, వయో, భాషా బేధాలను బట్టి బృందాలుగా జూసేవారు. ఈ రకమైన విభజన ఆధారంగానూ, సామాజిక అంశాల ప్రాతిపదికపైనా మనుషుల మధ్య తారతమ్యాలు, హోదాలు, అణచివేతలు ఏర్పడినప్పుడు వాటిని రూపుమాపడాన్ని సామాజిక న్యాయం అంటాం. ఆడవాళ్ళ పట్ల వ్యక్తమయ్యే పితృస్వామిక పద్ధతి, పుట్టుక మీద ఆధారపడి హెచ్చుతగ్గులను నిర్ణయించే కులవ్యవస్థ, పనిచేసే రంగం మీద ఆధారపడి చూపే వివక్షలు సామాజిక పీడనను, అణచివేతలను వెల్లడిస్తాయి. వాటిని తొలగించడాన్ని సామాజిక న్యాయం అంటుంటాం. అయితే సామాజిక న్యాయం అనేది సామాజిక అసమానతల మూలాన్ని బట్టబయలు జేయదు. కొత్త సంస్కరణలను, చట్టాలను జేయడంతోటే సామాజిక అసమానతలు తొలగిపోతాయన్న భ్రమను ఈ భావన వ్యక్తం జేస్తుంది. సామాజిక న్యాయం అభిలషణీయమైనా. సామాజిక అసమానతలకు మూలాన్ని తొలగించే మౌలిక మార్పు మరింత అవసరం. దానికోసం ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థను ధ్వంసంజేసి సమసమాజ స్థాపన చేయాలి.

**జి20 సమావేశాల్లో ఎవరు పాల్గొంటారు? సమావేశాల ముఖ్య ఉద్దేశం ఏమిటి ? సమావేశాల్లో ఏ అంశాల మీద చర్చలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో మన పార్టీ నుండి ఎంతమంది పాల్గొన్నారు? దీని గురించి క్లుప్తంగా తెలియజేయగలరు**

**బాజీ బాబు తెల్లాకుల.**

అంతర్జాతీయ పరిస్థితుల పరిశీలన సందర్భంలో తరచుగా జి20 అనే పదాన్ని వింటుంటాం. (గ్రూప్ ఆఫ్ ట్వంటీ (20 దేశాల బృందం) అనే దానికి సంక్షిప్త రూపం జి20. అలాగే జి7 అనే పదాన్ని కూడా తరచుగానే వింటుంటాం. జి7 అనగా 7 దేశాల బృందం. ఈ జి7లో సామ్రాజ్యవాద దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలుగా పేరుబడిన అమెరికా, కెనడా, ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ ఉన్నాయి. జి20లో ఈ దేశాలతోపాటు ఇండియా, చైనా, ఇండోనేషియా, సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, టర్కీ, సౌదీ అరేబియా, బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా, మెక్సికో, అర్జెంటీనా, రష్యా దేశాలు, వీటితోపాటు యూరోపియన్ యూనియన్‌లు ఉన్నాయి. ఈ పొందిక చూస్తే జి20 అనేది అభివృద్ధి చెందుతున్న దేశాల కలయిక అనేది అర్థం అవుతుంది. అయితే

ప్రపంచంలో ఉన్న 195 దేశాల్లో అత్యధిక భాగం దీనిలో భాగస్వాములు కాదనేది గుర్తించాల్సిన విషయం. ముఖ్యంగా పేద దేశాలు, చిన్న దేశాలు పూర్తిగా మినహాయించబడ్డాయి. ఆ రకంగా జి7 గాని, జి20 గాని వివిధ రకాల బలహీనత లెదుర్కొంటున్న అభివృద్ధిలో దిగువ స్థాయిలో ఉన్న దేశాలకు పెద్దగా ప్రయోజనం లేని సంస్థలుగా మనం గమనించవచ్చు.

జి20 1999 సెప్టెంబరు 26న ఏర్పాటైంది. 2008 నుండి జి20 సమావేశాలు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లో దేశాధినేతతోపాటు విదేశాంగ శాఖ మంత్రి, ఆర్థికశాఖ మంత్రి, ఇతర ఉన్నతాధికారుల బృందం పాల్గొంటారు. అలాగే కొన్ని స్వచ్ఛంద సంస్థలను కూడా ఆహ్వానిస్తుంటారు. సంవత్సరానికి ఒక దేశం తరపున ఆ దేశాధినేత జి20కి అధ్యక్షత వహిస్తారు. ఆ రకంగా జి20 అధ్యక్షత అనేది రొటేషన్ ప్రకారం మారుతూ ఉంటుంది. 2021లో ఇటలీ, 22లో ఇండోనేషియా దేశాధినేతలు జి20కి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇప్పుడు డిశంబరు 1, 2022 నుండి నవంబరు 30, 2023 వరకు మన ప్రభుత్వాధినేత ప్రధానమంత్రి మోడీ దీనికి అధ్యక్షత వహిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం, నాయకులు ఆనవాయితీగా వచ్చిన ఈ అధ్యక్ష పదవి ఏదో మోడీ గారి గొప్పతనం వలన వచ్చిందని, భారతదేశం విశ్వగురువుగా అందరూ పరిగణించడానికి ఇదో చిహ్నం అని గప్పాలు కొట్టుకుంటున్నారు. దేశంలో దిగజారుతున్న ప్రతిష్టను జి20 అధ్యక్ష స్థానాన్ని ఉపయోగించుకొని రాబట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

జి7 గానీ, జి20 గానీ ప్రధానంగా ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో వస్తున్న ఆర్థిక ఒడిదుడుకులను అన్ని దేశాలు ఉమ్మడిగా ఎదుర్కొంటున్న తక్షణ, ముఖ్యమైన సమస్యలను చర్చించుకోవడానికి ఉద్దేశించబడింది. ఇది చర్చా వేదికే తప్ప అంతకన్నా దీనికి ప్రత్యేక శక్తేమీ లేదు. గతంలో ఎయిడ్స్ వ్యాధి ప్రపంచ వ్యాపితంగా ఉధృతమైనప్పుడు 2008 ఆర్థిక మాంద్యం ప్రపంచ దేశాల్ని కుదిపేసినప్పుడు పర్యావరణ విపత్తు భూగోళాన్ని ప్రభావితం చేస్తున్న సందర్భంలో వాటిని ఎదుర్కొనేందుకు పరస్పర సహకారం చేసుకోవడానికి తీసుకోవలసిన చర్యల గురించి చర్చించుకున్నారు. ఈ చర్చల్లో అంగీకరించే ఉమ్మడి అభిప్రాయాలను అమలు జరిపేదానికి సభ్య దేశాల నుండి గ్యారంటీ ఏమీ లేదు. చర్చల ప్రభావం ఏ మేరకు ఉంటే ఆ మేరకే ఈ చర్చల ప్రయోజనం ఉంటుంది. అయితే జి7 దేశాల్లో ఇతర దేశాలకే మాత్రం ప్రమేయం లేకుండా సామ్రాజ్యవాద దేశాలుగా ఉన్నవారే ప్రపంచాన్ని ఆధిపత్యం వహించే పద్ధతిలో వ్యవహరిస్తున్న నేపథ్యంలో జి20 అనేది జి7 పెత్తనానికి ప్రత్యామ్నాయంగా కాకపోయినా ప్రతిగా కొన్ని సందర్భాల్లో వ్యవహరించడానికి ఉపయోగపడుతుంది. అయితే జి20 బృందంలో ఆ సామ్రాజ్యవాద దేశాలు కూడా ఉండడం చైనా మినహాయిస్తే మిగతా అన్ని దేశాలు పెట్టుబడిదారీ విధానం కలిగినవి కావడంతో ప్రపంచవ్యాప్తంగా సరళీకరణ విధానాల్ని విస్తరించడానికి జి20 కూడా ఉపయోగపడు తున్నదనేది యదార్థం. ముఖ్యంగా జి20 కూడా ఆఫ్రికా, ఆసియాల్లోని పేద, చిన్న దేశాల ప్రయోజనాల గురించి పెద్దగా పట్టించుకున్న పరిస్థితి గానీ, వాటికి ఒక బృందంగా తోడ్పడుతున్న పరిస్థితి గానీ లేదు. అప్పుడప్పుడైనా ఏ మేరకు సామ్రాజ్యవాద దేశాల ఉమ్మడి చర్యలను ప్రతిఘటించడానికి జి20 ప్రయత్నిస్తే ఆ మేరకు దాని ప్రయోజనం అంతర్జాతీయ స్థాయిలో ఉంటున్నది.

# ఒడిదుడుకుల నదిగమిస్తూ సోషలిస్టు పంథాలో ముందుకు

**(32వ పేజీ తరువాయి)**

లలో పార్టీ నిర్మాణాన్ని మెరుగుచేసుకోవాలి.

పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొం దింపజేయాలని, పార్టీ సభ్యుల హక్కులను పరిరక్షిస్తూనే పార్టీని నాణ్యంగా ఉంచాలని నిర్ణయించింది. కాబట్టి పార్టీ ప్రమాణాలకు తగనివారిని బహిష్కరించి, పార్టీ సభ్యుల స్వభావం, సమగ్రతను పరిరక్షించుకోవాలి.

"మంచి కమ్మరి మాత్రమే నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేయగలడన్న సామెతను గుర్తు చేసుకుంటూ మార్క్సిజం పతాకాన్ని ఉన్నతంగా నిలబెడుతూ సోషలిజం మార్గంలో దృఢంగా ముందుకుసాగిపోవటం కోసం సిపిసి మహాసభ పార్టీని, దాని నాయకత్వాన్ని పై నుంచి కింది వరకు బలపర్చటానికి పూనుకున్నది. మహాసభ 205 మంది సభ్యులు, 171ప్రత్యామ్నాయ సభ్యులు, 133 మంది కొత్త సిసిడిఐ సభ్యులతో నూతన కేంద్ర కమిటీని ఎన్నుకున్నది. కేంద్ర కమిటీ 24మందితో పొలిట్‌బ్యూరో, ఏడుగురితో పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటిని ఎన్నుకున్నది. నూతనంగా ఎన్నికైన కేంద్ర కమిటీ అక్టోబరు 23వ తేదీన సమావేశమై సిపిసి ప్రధాన కార్యదర్శిగా, సిపిసి సెంట్రల్ మిలిటరి కమిషన్ ఛైర్మన్‌గానూ తిరిగి సి జిన్‌పింగ్‌ను ఎన్ను కున్నది.

జిన్‌పింగ్ తన ముగింపు ఉపన్యాసంలో పోరాటం చేయగల ధైర్యం, విజయం సాధించగల పట్టుదల సిపిసికి ఉన్నాయని చెప్పారు. "నూతన యుగం కోసం చేస్తున్న ప్రయాణంలో కొత్త, అత్యంత గొప్ప అద్భుతాలను, ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే అద్భుతాలను సాధించగలమన్న పూర్తి విశ్వాసంతో ఉన్నాం". కాలానికి తగిన జీవితం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, పూర్తి శక్తిసామర్థ్యాలను ఉపయోగించి ప్రజలకు సేవ చేయాలని, ప్రజలు కేంద్రంగా ఆలోచనలు ఉండాలని, ప్రజాపంథాను అమలుచేయాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అన్న సూత్రాన్ని మనం పాటిం చాలి. ప్రజలతో సన్నిహిత సంబంధాలను కొనసాగించాలి. వారి పర్యవేక్షణ, విమర్శలను అంగీకరించాలి. ప్రజలు జీవించిన విధంగానే మనం జీవించాలి. మన భవిష్యత్తు వారితో ముడిపడి ఉంది. మనం సంపూర్ణంగా ప్రజలలో భాగంగా ఉండాలి.

పార్టీని, దాని మార్గదర్శకత్వాన్ని అనుసరిం చాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. 'ఉన్నత లక్ష్యాలను పెట్టుకోండి, కాని భూమిపైనే నిలబడండి. విశాలంగా ఆలోచించటానికి ధైర్యం చేయండి, కార్యాచరణలో ఉండండి, మీరు సాధించగలరని నిరూపించండి. నూతన శతాబ్దంలోని గొప్ప యువ సమూహం మీదని, విభిన్న భావజాలం, బాధ్యతా భావం, అంకిత భావం ఉన్నవారమని నిరూపించటానికి ప్రయత్నించండి'.

వట్టిమాటల వలన ఉపయోగం లేదని, కష్టపడి పనిచేయటం ద్వారా మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దృఢమైన విశ్వాసంతో ఒకటిగా, ఐక్యంగా దృఢ నిశ్చయంతో ముందుకుసాగుదాం అన్నారు. ఆధునిక సోషలిస్టు దేశాన్ని నిర్మించటానికి ఐక్యంగా ముందుకుసాగాలని, అన్ని రంగాలలోనూ జాతీయ పునరుజ్జీవనాన్ని తీసుకురావాలని చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

అక్టోబరు 23వ తేదీన మీడియా సమావేశంలో మాట్లాడుతూ లక్ష్యాలను ఉన్నతంగా నిలిపిన, శక్తిని కూడదీసుకున్న, ఐక్యత, అంకిత భావంతో జరిగిన మహాసభ ఇదని సి జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనాలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించే ప్రయత్నంలో సిపిసి విజయం సాధించాలని మనం కోరుకుందాం.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# వేద వాఙ్మయ పరిచయం

(2వ పేజీ తరువాయి)

**అరణ్యకాలు**

బ్రాహ్మణాలకు అనుబంధంగా మళ్లీ రెండు విభాగాలైన గ్రంథాలు ఉన్నాయి. ఒకటి అరణ్యకాలు, రెండవది ఉపనిషత్తులు. ఆరణ్యకాలు అంటే ఆత్మకు సంబంధించిన మర్మాలు, అడవులలో చేసే విధుల గురించి చర్చిస్తాయి. మనకు ఈనాడు లభించే అరణ్యకాలు ఋగ్వేదం, కృష్ణ, శుక్ల యజుర్వేద బ్రాహ్మణాలకు అనుబంధంగా ఉన్నాయి.

**ఉపనిషత్తులు**

ఉప-ని-సద్ అన్న దాని నుండి పుట్టింది ఉపనిషత్. అంటే యోగ్యుడైన శిష్యుని దగ్గరగా కూర్చుండబెట్టుకొని గురువు బోధించే రహస్య జ్ఞానం. అయితే ఈ ఉపనిషత్తుల మీద చర్చలు అన్నీ రాజాస్థానంలో జరుగుతూ వచ్చాయి. దాదాపు 200కు పైగా ఉపనిషత్తులు ఉన్నప్పటికీ వీటిలో బహుకొద్ది ఉపనిషత్తులు మాత్రమే వైదిక యుగానికి చెందినవి. అవి 1. ఐతరేయోపనిషత్తు 2. కౌషితకి ఉపనిషత్తు 3. తైత్తరీయ ఉపనిషత్తు 4. బృహదారణ్యక ఉపనిషత్తు 5. చాందోగ్యోపనిషత్తు 6. కేనోపనిషత్తు 7. కఠోపనిషత్తు 8. శ్వేతాశ్వతర ఉపనిషత్తు 9. మహా నారాయణ ఉపనిషత్తు 10. ఈశావాస్యోపనిషత్తు 11. ముండకోపనిషత్తు 12. ప్రశ్నోపనిషత్తు 13. మైత్రి ఉపనిషత్తు 14. మాండూక్యోపనిషత్తు. ఈ ఉపనిషత్తులు గుప్త కర్మలు, మంత్రాల నుండి తాత్విక ఊహాగానాల వరకు అనేకమైన అంశాలను చర్చిస్తాయి. వీటిలో కొన్ని బుద్ధుని కాలానికి ముందు, తర్వాత కాలానికి కూడా చెందినవి ఉన్నాయి. ఉపనిషత్తులు అన్నీ వేదానంతర కాలానికి చెందినవే. వీటినే వేదాంతం అంటారు. వేదములకు అంతమున ఉన్నవి కనుక ఆ పేరు వచ్చింది. వేద సాహిత్యం లో ఆఖరి భాగంగానూ, జ్ఞాన విషయంలో వేదం యొక్క అంతిమ లక్ష్యం అన్న అర్థంలో వీటిని చెప్తారు. ఈ ఉపనిషత్తులు ఆత్మ, పరమాత్మ గురించి, ఓం శబ్దం యొక్క మహత్యాన్ని గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి, ముక్తిని, పరలోకం గురించి, ఆధ్యాత్మికత గురించి ప్రధానంగా చర్చిస్తాయి. అయితే అందులో ఒక ఉపనిషత్తు అయిన ముండకోపనిషత్ యజ్ఞయాగాదులను కర్మకాండలను నిరసిస్తుంది. బ్రహ్మచర్యాన్ని, తపస్సును ఆచరించడం ద్వారా ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చునంటుంది. ఈ ఉపనిషత్తు యజ్ఞ యాగాల గురించి కర్మకాండ గురించి ఈ విధంగా చెబుతుంది. యజ్ఞాలు అనేవి ఓటి పడవలు. అవి ఒడ్డుకు చేరటానికి ఏ విధంగానూ పనికిరావు. ఈ యజ్ఞాలంటే గొప్పవి అనుకునేవారు మూర్ఖులు. మళ్లీ మళ్లీ పుడుతూ గిడుతూ జనన మరణ చక్రభ్రమణంలో కొట్టుమిట్టాడుతుంటారు. అజ్ఞానం కారణంగా తాము ధీరులమని, పండితుల మని అనుకునే వీరు గుడ్డి వాళ్ళ చేత నడపబడే గుడ్డి వాళ్ళు లాగా దుఃఖాన్ని పొందుతుంటారు. అజ్ఞానం కారణంగానే తాము కృతార్థుల మైనామని గర్విస్తుంటారు. కర్మకాండలలో మునిగి వీళ్లు రోగ కారణాలు తెలుసుకోలేరు. పుణ్య లోకాలను పొందలేరు. కర్మకాండలను వదిలి శ్రద్ధతో తపస్సు ఆచరిస్తూ అరణ్యవాసం చేసినవాడు పాపరహితుడు అవుతాడు. పుణ్యలోకాలు పొందుతాడు. ఆత్మ పురుషుడు (బ్రహ్మ) ను చేరుతాడు అంటాడు ఈ ముండకోపనిషత్ కారుడు. అనేక తాత్విక చర్చల సంకలనమే ఉపనిషత్తులు.

**వేదాంగాలు**

ఈ ఉపనిషత్తుల అనంతరం వచ్చిన మొత్తం గ్రంధాలను వేదాంగం అని సంప్రదాయకులు పిలుస్తారు. వీటిని వేదాలలో భాగంగా చూపినప్పటికీ స్పష్టంగా ఇవి వేదాంత కాలానికి చెందినవి. వీటిలో సూత్ర గ్రంథాలు, శిక్ష, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, చందస్సు, జ్యోతిషం వీటన్నింటినీ కలిపి వేదాంగాలు అంటారు. ఈ సాహిత్యంలో అత్యధికభాగం సూత్ర గ్రంథాలే. సూత్రం అంటే నూలుపోగు అని అర్థం. తేలికగా అర్థం చేసుకోవటం దీని ఉద్దేశం. ఇవి బ్రాహ్మణాలతో ముడిపడి ఉంటాయి. వీటిలో ముఖ్యంగా శ్రౌత సూత్రాలు, అంటే గృహ్య సూత్రాలు గృహ కర్మలకు సంబంధించినవి. అంటే కుటుంబానికి సంబంధించిన నామ కరణము, ఉపనయనము, సీమంతము, వివాహము, అపర కర్మ లకు సంబంధించినవి ఉన్నాయి. ఈ సూత్రాలును చాలా మంది రచించారు. ఉదాహరణకు హిరణ్య కౌశిక గృహ్య సూత్రాలు, ఆపస్తంబ గృహ్య సూత్రాలు, పారస్కర గృహ్య సూత్రాలు, బోధాయన సూత్రాలు, పరాశర గృహ్య సూత్రాలు, అశ్వలాయన గృహ్యసూత్రాలు మొదలైనవి.

**సుల్వ సూత్రాలు:** ఇవి యజ్ఞ వేదిక నిర్మాణ కొలతలు నిర్ణయించేవి. ఇవి జామెట్రీ, గణిత శాస్త్రాలకు ప్రారంభ రూపాలుగా భావించవచ్చు.

**ధర్మ సూత్రాలు:** ఇవి రాజులు, సమాజంలోని వివిధ వర్ణాల ప్రజలు అనుసరించవలసిన ధర్మాలను ప్రబోధిస్తాయి. ఈ సూత్ర గ్రంధాలలో అత్యధికభాగం బుద్ధుని తర్వాత కాలం అంటే దాదాపుగా క్రీస్తు పూర్వం నాలుగు వందల సంవత్సరాల నాటివి.

**శిక్ష:** వేదమంత్రాలను స్వర బద్ధంగా స్వచ్ఛమైన ఖచ్చితమైన ఉచ్చారణ ఎలా ఉండాలో నిర్ధారించేవి.

**కల్పం:** యజ్ఞయాగాదులను నిర్వహించే పద్ధతులను చర్చిస్తుంది.

**వ్యాకరణం:** అనేకమంది వ్యాకరణ కర్తలు వేద భాష రూపాన్ని స్థిరీకరించే ప్రయత్నం చేశారు. వీరందరిలో ప్రముఖుడు పాణిని. పాణిని రచించిన అష్ట ధ్యాయి ప్రపంచంలోని మొదటి శాస్త్రీయ వ్యాకరణ గ్రంథం. క్రీస్తు పూర్వం 500 సంవత్సరాల కాలం నాటిది. పాణిని వారసులలో అతి ముఖ్యుడు పతంజలి. ఇతడు క్రీస్తు పూర్వం రెండు వందల సంవత్సరాల కాలం నాటి వాడు. పాణిని వ్యాకరణ సూత్రాలకు గొప్పగా భాష్యం వ్రాశాడు. సంస్కృత భాషకు చాలా తార్కికంగా విస్పష్టంగా సూత్రాలను రూపొందించినవారు ఈ పతంజలి. దీనితో సంస్కృత వ్మాయంలో వ్యాకరణం గొప్ప ప్రాధాన్యత సంతరించుకున్నది.

**నిరుక్తం:** ఋగ్వేదం లోని చాలా పదాలకు అర్థాలు వ్యాఖ్యానిస్తూ రచించిన గ్రంథం యాస్కుని నిరుక్తం.

**జ్యోతిషం:** ఋతువులను, నక్షత్ర గమనాలను పరిశీలించే ఖగోళ జ్యోతిష్య శాస్త్రం ఇది.

**చందస్సు:** వేదాల్లో ఉన్న వివిధ చందములను వివరించే గ్రంథం. రుగ్వేదంలో 19 రకాల చందస్సులు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి మూలమైనవి గాయత్రి, పుష్ణిక్, అనుస్టవ్, బృహతి, విరాట్, త్రిస్టువ్, జగతి అనేవి. గానము కొరకు గాయత్రి చందము ముఖ్యమైనది. సోమపానం చేసేటప్పుడు ప్రతి ఒక్కరికి కంఠం విప్పు కుంటుంది. మద్యం తాగే వాళ్ళ విషయంలో కూడా ఇది మనం చూస్తూనే ఉంటాం. గొంతు బాగా పెకులుతుంది. ఋగ్వేదం 9వ మండలం అంతా సోమపాన మండలం. ఇందులోని రుక్కులన్నీ చాలావరకు గాయత్రి చందంలోనే ఉంటాయి. ఈ గానాన్ని గాయత్రి సోమం అని కూడా అంటారు. ఈ వేదాంగాల సాహిత్యం క్రీస్తుకు పూర్వం నాలుగు వందల సంవత్సరాల కాలానికి చెందినది. తర్వాతి కాలపు సాహిత్యం స్మృతులు. అనేక స్మృతులు ఉన్నప్పటికీ మనుస్మృతి ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఎందుకంటే నిచ్చెనమెట్ల కులవ్యవస్థను మరింతగా స్థిరీకరించిన స్మృతి ఇది. కొత్త కులాలను కూడా సృష్టించినది ఈ స్మృతి.

(సశేషం)

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 8 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36



# ఆయుఃప్రమాణాల పెరుగుదల

మంచి ఆహారం, ఆరోగ్య సదుపాయాలు లభిస్తేనే ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తారు. ఆకలి, అనారోగ్యం, అవిద్య వారి జీవన ప్రమాణాల మీద ప్రభావం చూపిస్తుంది. ప్రజల ఆయుఃప్రమాణాన్ని బట్టి ఆ దేశంలోని ప్రజల జీవన పరిస్థితిని అంచనా వేయవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ గమనం ఒక మూలమలుపు తీసుకుంది. అనేక వలస దేశాలు సామ్రాజ్యవాద దేశాల నుండి విముక్తి చెందాయి. వాటిలో కొన్ని పెట్టుబడిదారీ బాట పట్టగా కొన్ని సోషలిస్టు మార్గాన్ని ఎన్నుకున్నాయి. ఏ దేశమైనా వెలిగిపోతున్నదీ అని పాలకులు ప్రచారం చేసుకుంటుంటే అది నిజమో కాదో తెలుసుకోడానికి ఆ దేశంలోని ప్రజల సగటు ఆయుఃప్రమాణాన్ని పరిగణనలోకి తీసుకుని వారు చెబుతున్నది నిజమో కాదో చెప్పవచ్చు. 1950–2021 మధ్య ఆయా దేశాల ప్రజల సగటు ఆయుఃప్రమాణం ఎలా పెరిగిందో కింద అంకెలు చెబుతున్నాయి. మోడీ నాయకత్వంలో బిజెపి పాలనలో మన దేశం వెలిగిపోతున్నదని చెప్పేవారు మన పొరుగునున్న దేశాలకన్నా జీవన ప్రమాణాల విషయంలో మనం ఎంతగా వెనుకబడి పోయామో, పెట్టుబడిదారీ దేశాల కాన్నా సోషలిస్టు దేశాల్లో ప్రజల జీవన ప్రమాణాలు కొద్ది కాలంలో ఎంతగా పెరిగాయో కింది గణాంకాల ద్వారా తెలుసుకోవచ్చు.

| దేశం | 1950లో సం॥లు | 2021లో సం॥లు |
|---|---|---|
| భారత్ | 36.62 | 67.2 |
| శ్రీలంక | 54.51 | 76.4 |
| పాకిస్తాన్ | 37.04 | 66.1 |
| నేపాల్ | 34.01 | 68.4 |
| భూటాన్ | 32.26 | 71.8 |
| బంగ్లాదేశ్ | 40.67 | 72.4 |
| చైనా | 43.83 | 78.2 |
| వియత్నాం | 53.50 | 73.6 |
| ఉత్తర కొరియా | 37.60 | 73.3 |
| క్యూబా | 59.44 | 73.7 |

| దేశం | 1950లో సం॥లు | 2021లో సం॥లు |
|---|---|---|
| అమెరికా | 68.71 | 77.2 |
| బ్రిటన్ | 69.40 | 80.7 |
| జపాన్ | 62.80 | 84.8 |
| ఫ్రాన్స్ | 67.05 | 82.5 |
| జర్మనీ | 67.52 | 80.6 |

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిప్రతిక: **రూ.15**, సంవత్సర చందా:**రూ.150**, పోస్టు ద్వారా **రూ. 180**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................

వీధి..........................................

గ్రామం..........................................

మండలం లేదా పట్టణం..........................................

జిల్లా..........................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,